ఆంధ్రసచిత్రవారపత్రిక

17-10-75
60 పైసలు

దసర
సంచి



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 – 1972)
శుక్రవారం : 17–10–'75
రాక్షసనామసం.ఆశ్వయుజమాసశు.త్రయోదశి
సంపుటము : 69 సంచిక : 6

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

★

సంవత్సర చందా — రు. 33–80
ఆరుమాసాల చందా — రు. 16–90
విడిప్రతి వెల 60 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ–520003.

విషయానుక్రమణిక

అట్టమీద బొమ్మ :
జయదుర్గ
(చిత్రం : శ్రీ వేజండ్ల సత్యనారాయణరావు)



గంగాధర
ఆదుర్తి దర్శకత్వంలో
మరొక ఆణిముత్యం!
ఆత్రేయ గీతాలకు
మహదేవన్
మధుర సంగీతం!
ఓం
రవికళా మందిర్ వారి
గాజుల కిష్టయ్య
ఈస్ట్‌మన్ కలర్
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం
ఆదుర్తి సుబ్బారావు
పాటలు
ఆత్రేయ
సంగీతం
కె.వి.మహదేవన్
నిర్మాతలు
ఆదుర్తి భాస్కర్-ఎమ్.ఎస్.ప్రసాద్

మనలో మాట

మా పాఠకులకు, రచయితలకు, ఏజెంట్‌లకు, ప్రకటన కర్తలకు అందరికీ దసరా శుభాకాంక్షలు.

* * *

ఈ వారం నుంచి కొత్త సీరియల్ కథ "శ్రావణ సంధ్య" మొదలైంది. రచయిత తాళ్లూరు నాగేశ్వరరావుగారు మా పాఠకులకు సుపరిచితులు. పాతిక నవలల దాకా ప్రచురించిన వీరు ఆరేడువందల కథలను రాశారు. తెనుగు పత్రికలన్నింటా



వెలువడిన వీరి కథలు కొన్ని కన్నడం, హిందీ, గుజరాతీ, యింగ్లీషు భాషలలోకి కూడా అనువదింప బడ్డాయి! రేడియో శ్రోతలకు కూడా వీరు చిరపరిచితులే. ఎన్నో బి. కామ్. పాఠ్యగ్రంధాలు, ఆర్థిక శాస్త్ర గ్రంధాలు వ్రాసిన శ్రీ తాళ్లూరు ఎమ్. కామ్. ఎల్. ఎల్. బీ. పట్టాలందు కున్నారు. హైద్రాబాద్ తెలుగు అకాడమీలో కామర్స్ రీసెర్చి ఆఫీసర్‌గా వుద్యోగం చేస్తున్నారు. "ఫిలిమ్ ఫైనాన్సింగ్ యిన్ ఆంధ్రప్రదేశ్" అనే అంశంపై పి. హెచ్.డీ. కి పరిశోధన చేస్తున్నామని తెలిపారు.

వీరి రచనలలో కొత్త ఇల్లు, భార్యాభర్తలు, ఎదగని పువ్వు, జీవనజ్యోతి వంటివి ఎంతో ప్రాచుర్యం పొందాయి. కథా సంపుటాలు పదహారు దాకా వెలువడ్డాయి. చాలా నాటికలు కూడా వ్రాసిన నాగేశ్వరరావుగారి వయస్సు 41 సంవత్సరాలు. వివాహితులు.యిరువురు సంతానం. వీరి కొత్త నవల శ్రావణ సంధ్య మా పాఠకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాము.

* * *

పై వారం నుంచి కుమారి బొడ్డుచర్ల గౌరిదేవి గారు వ్రాసిన సీరియల్ కథ 'గెలుపునాదే' ప్రారంభిస్తున్నాము. ఈ వారం చోటులేక నిలిపివేశాము.

ఉత్తరాలు

సామాన్యుని సణుగుడు

హాస్య సంచికలో సామాన్యుని సణుగుడు చాలా బాగున్నది. గానాబజానాలు ఒక్కోసారి అర్ధరాత్రి 2 గంటల వరకు సాగుతాయి. మధ్య మధ్య రికార్డులు ఆపు చేసి, ఎవరో ఒకరు తమ స్వరంతో మైకులో ప్రజలందరికి బల వంతపు గాన కచ్చేరీలు వినిపించటం కూడా ఒక తతంగం. పరీక్షలకు చదువుకునే విద్యార్థులు రోగులు, ముసలివారలకు యీ గాన కచ్చేరీల వల్ల నిద్రరాహిత్యంతో తలనొప్పి కలుగును.

పేటల్లో జంక్షన్ పూజలు బ్యాన్ చేయుమని ఇందులో అన్నారు. అది అవసరం. ముఖ్యంగా జాతీయ రహదారులపై ఇది బ్యాన్ చేయుట అవసరం. రహదారి కటూ ఇటూ రాటలు పాతి, దారిని ఆక్రమించుట వలన ఒక్కో సందర్భంలో ఎంతో ట్రాఫిక్ జామ్ అయిపోతూంటుంది.

సి. వి. రామమోహనరావు, (వెదురుమూడి)

నమ్మూ—నమ్మకపో


నమ్మూ నమ్మకపో శీర్షిక ప్రతివారం ఉండేటట్లు చూడండి. 'సామాన్యుని సణుగుడు' సామాన్యుల జీవితాలను ప్రతిబింబింపజేస్తుంది. కథల్లో "జీవన సంధ్య' మరిచిపోలేని విధంగా ఉన్నది. "గాజు మేడ" సీరియల్ మొదట్లో ఉన్న ఇంట్రెస్టు ఉండుటలేదు, 'సినిమా' శీర్షిక విమర్శనాత్మకంగా ఉంటే బాగుంటుంది.

ఎమ్. రోశయ్య, జి. ప్రభాకరరావు, (బండ్లవారిపాలెం)

హైదరాబాద్ నోట్ బుక్

29—9—75 సంచిక ఉత్తరాల శీర్షికలో శ్రీ కె. నాగచెంచయ్య, వి. రామకృష్ణ, జి.తిరుమలరావు, (అహమదాబాద్) గార్లు నేను 29.8.75 సంచిక హైదరాబాద్ నోట్‌బుక్‌లో "అంతరిక్షంలో అధ్యాపకుడు" అనే వార్తలోని పొరపాట్లు తెలిపినందుకు కృతజ్ఞుణ్ణి. అవి నిజంగా పొరపాట్లే. వాటికి కారణాలు తెలుపుతున్నాను. (1) నిజానికి 399 గ్రామాలు. పూర్ణ సంఖ్యగా వుంటుందని 400 అని వ్రాశాను. నాలుగు సంఖ్యలోని నిలువు గీత పై కొనాగ్రం తాకి వుంటుంది, తొందరగా వ్రాయడంలో. అది తొమ్మిదిగా ముద్రితమైంది (2) జరిగింది 1వ తేదీన. ఇది కూడ బాల్‌పాయింట్ కలం అంటనందువల్ల ఒత్తి వ్రాయడం వల్ల కలిగిన పొరపాటు. జంటనగరాలలో ప్రయోగం అన్న విషయంలో నేను వివరణ చేయకపోవడం పొరపాటు. నా ఉద్దేశం ముఖ్యమంత్రి టెలివిజన్‌కు స్విచ్ వేసే ప్రయోగమని. కాని అది వివరణ సాపేక్షం. కనుక పొరపాటే. పొరపాట్లుచూపిన పాఠకోత్తములకు ధన్యవాదాలు.

—తిరుమల రామచంద్ర (హైదరాబాద్)



భారతావని అంతటా జరిగే సామూహిక శక్తిపూజ దసరా పండుగ!

దేవీ నవరాత్రులు – దేవీ అవతరణ

వసంత నవరాత్రులు చైత్రమాసంలోనూ, గణపతి నవరాత్రులు భాద్రపదంలోనూ, దేవీనవరాత్రులు ఆశ్వయుజంలో జరుపుకోవటం మనకు వేదకాలంనుండీ వచ్చే ఆచారం.

వసంతకాలంలోనే దేవి ఆరాధింపబడుతున్నట్లు గతేతిహాసం వల్ల తెలుస్తోంది. రామాయణ కాలానికి తర్వాత 'దేవి'ని శరత్కాలంలోనే అంటే ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకూ పూజింపబడుతున్నట్లు కాన వస్తోంది. ఇక ఇట ఆరాధింపబడే శక్తి సామూహిక శక్తి ఏ మతానికీ సంబంధించినది కాదు. ఆ సామూహిక శక్తి స్వరూపిణియే దుర్గ అనీ, కాళి అనీ, మహిషాసురమర్దని అనీ ప్రసిద్ధి చెందింది.

ఆమె రూపాన్ని ఇలా వర్ణించారు —

"అష్టాదశ భుజాం దివ్యాం సర్వాభరణభూషితాం
సర్వ లక్షణ సంపన్నాం వరాయుధ ధరాంశుభాం"

పదునెనిమిది భుజాలతో సర్వాభరణ భూషితయై సర్వలక్షణ సంపన్నయై, వరములను, ఆయుధములను ధరించియున్నది. ఆమె రూపురేఖల్ని దేవతాగణం ఎలా కల్పించారో పరికిద్దాం!

నూరేళ్ల యుద్ధం

దేవాసుర సంగ్రామం వంద సంవత్సరాలు జరిగింది. దేవతలకు నాయకుడు ఇంద్రుడు, రాక్షసులకు నాయకుడు మహిషాసురుడున్నూ. ఈ మహా భయంకర యుద్ధంలో దేవతలు ఓడిపోయారు. దేవేంద్రపదవి నధిష్ఠించాడు మహిషాసురుడు. పరాజితులై పరాభవాన్ని పొందిన దేవతానీకం,దేవేంద్రుడూ, బ్రహ్మ— శివకేశవుల దగ్గరకు వచ్చి తమకు జరిగిన పరాభవాన్ని చెప్పుకున్నారు. శివకేశవులు ఆలోచించారు. తుదకు మహిషుని మర్దించే ఉపాయాన్ని యోచించాలని అనుకున్నారు. ఇంతలోనే ఆచట చేరియున్న— బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు— సమస్త దేవతలూ ఒక్కుమ్మడిగా ఆగ్రహోదగ్రులయ్యారు. కోపతాపమగ్నులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులనుండి దేవతానీకం నుండి ఒక బలీయమైన తేజస్సు వెలువడింది ఆ తేజస్సంతా ఒకటిగా చేరి జాజ్వల్యమానమైన కొండవలె భాసించింది— ఆ క్షణంలో. ఆ తేజస్సు సమస్త దిశల్లోనూ అలుముకుంటూంది — సామూహికమైన ఆ దేవతా శక్తితో తులతూగేదేదీ ఆచట కల్పించలేదు ఆ తేజస్సే 'శక్తి స్వరూపిణి'. సమస్త దేవతాగణం, ప్రకృతీ తమశక్తులను ఆమెకు సమర్పించింది. పరికింపుడు ! సమస్త దేవతలూ తమ శస్త్రాస్త్రములను భూషణములను విష్ణువు ఆదేశానుప్రకారం ఆ దేవికి ఇవ్వనారంభించారు.

క్షీరసాగర వరాలు

క్షీరసాగరుడు దివ్యాంబరమును, అందమైన హారాన్ని, రెండు కుండలములను, చూడామణినీ ప్రసాదించాడా దేవికి.

విశ్వకర్మ పదునెనిమిది బాహువులకూ భుజకీర్తులనూ, కంకణములనూ దేవికి సమర్పించాడు.

బ్రహ్మ చాలా ఉదార హృదయుడు. ఆ దేవీ చరణములకు స్వచ్ఛమైన అందెలను, చేతి వ్రేళ్లకు 'అంగుళీప్రదాన'ము చేసినాడు.

వరుణుడు "వైజయంతి" అని ఖ్యాతిగాంచిన తామర పుష్పమును దేవి కంఠమున అలంకరింప చేసినాడు.

హిమవంతుడు సింహాన్ని వాహనంగా సమర్పించాడు దేవికి.

అప్పటికాదేవి సర్వలక్షణ సంపన్నయై సింహవాహినియై సర్వాభరణముల ధరించి కూర్చుని యున్నది.

విష్ణువు తన చక్రమును సమర్పించినాడు దేవికి. త్ర్యంబకుడు తన త్రిశూలాన్ని ఇచ్చాడు. ప్రసన్నాత్ముడైన వరుణుడు శంఖమును ప్రసాదించినాడా దేవికి. దానవానీకాన్ని ధ్వంసంచేయుటా

(50 వ పేజీ చూడండి)

బెజవాడ కనకదుర్గ



మొదటిసారిగా కృష్ణప్రసాద్ మా యింటికి వచ్చినప్పుడు చేస్తున్న పనిని ఆపి, గబగబా హాలులోకి పరిగెత్తిన మాట వాస్తవమే కానీ - రెండోసారి అతనిని చూడాలంటేనే ఏదోలాగా అన్పించింది నాకు.

'ఫస్ట్ ఇంప్రెషన్' ఆ 'ఏదోలా' ఫీలవడాన్కి కారణం కావచ్చు.

"విజయా... విజయా..." హాల్లోంచి ఆయన గావుకేకలు పెట్టేస్తున్నారు. మొదటిసారి అతను వచ్చినపుడూ ఇలాగే అరిచారు. అపుడు నవ్వొచ్చింది కానీ ఇప్పుడు విసుగేస్తోంది—

"కృష్ణ ప్రసాద్ వచ్చాడు" గుమ్మంలోంచి తొంగి చూస్తూ అన్నారు.

"అయితే మాత్రం... ఏమిటా హడావుడి-? అతను మీకు ఫ్రెండా? నాకా?... వస్తాను పదండి..." బట్టలు తీసుకుని బాత్ రూమ్‌లోకి వెళ్ళిపోయాను. నిజానికి మనిషిలోని ఉత్సాహాన్ని అలా నీరు కార్చేయడం నా పద్ధతికి విరుద్ధం కానీ నా ప్రవర్తనకు పూర్తి కారణం... కృష్ణప్రసాదే?

ఆనాడు... మొదటి సారిగా అతనినిచూసినప్పుడు నవ్వొచ్చింది నాకు - ఎంతో అందగాడనీ పెద్ద పెర్సనాలిటీ అని ఈయన పదే పదే అంటూండటంవల్ల నా వూహలో ఆ పొడుగు అలా అలా ఎక్కువై, దాని అందం మరింత కలిసి, ఒక రచయిత్రి రాసే కథానాయకుడు నా ఊహలో వచ్చేవాడు కానీ... కృష్ణ ప్రసాద్ ఆ విధంగా లేడు. పొడుగ్గానే ఉన్నా, తగిన లావు లేడు - తెల్లగా ఉన్నా అతని ముఖంలో అంత అందమేం కన్పించలేదు. మొత్తంమీద అనాకారి కాకపోయినా, మనిషిని నిలబెట్టే అందగాడేం కాదు.

పరస్పర పరిచయాలూ, కాఫీలు అయ్యాక "మరి ఇంత ఫ్రెండ్సని చెప్పుకుంటున్నారు కదా - పెళ్ళికెందుకు రాలేదు?" అని అడిగాను.

"అదేనండీ మా బాధ! పెళ్ళికి వారం రోజులు ముందు వరకూ జంట కవుల్లాగా తిరిగాం — సరిగా ఆటైముకి ఏదో ట్రైనింగ్ అంటూ మద్రాస్ తరిమేసారు మా కంపెనీ వాళ్ళు - ఏం చేస్తాం - తప్పించుకోలేంకదా. ఒకరి మోచేతినీళ్ళు తాగుతూ బ్రతికే వాళ్ళం."

మాట్లాడిన అరగంటలోనూ కృష్ణప్రసాద్‌లో నేను కనిపెట్టగలిగినవీ, ముఖ్యంగా నాకు నచ్చనవీ రెండే రెండు గుణాలు ఉన్నాయి.

మొదటిది అవసరమైన దానికన్నా ఎక్కువ దర్పం మాటల్లో ప్రదర్శిస్తాడు. అది ఎదుటి మనిషిని ఆకర్షించడానికి పనికి వస్తుందన్న ఊహ, అతని ప్రవర్తనలో కన్పించింది.

రెండోది—అన్నింటికీ అవసరమైనా—అనవసరమైనా పెద్దగా నవ్వడం. అతను ఎందుకు నవ్వుతాడో, నవ్వుతున్నాడో అర్థం కాలేదు నాకు. మొత్తంమీద అతను ఉన్న గంటలో ఏభై అయిదు నిమిషాలు అతను మాట్లాడితే—మిగిలిన ఐదు నిమిషాలు నేను మాట్లాడాను. మా వారు ఒక ప్రేక్షకుడిలా, తనకు ప్రత్యేకంగా ఒక స్వరం అంటూ ఉందని అది తన భావాల్ని చెప్పడాన్కి పనికి వస్తుందనీ మర్చిపోయినట్లు తోచింది నాకు. కృష్ణప్రసాద్ మాట్లాడిన దానికల్లా అవునన్నట్లు తలఊపడం చూస్తే ఇంకో గంట అతను ఉంటే ఈయన మెడలు ఇగకు పట్టేస్తాయేమోనన్న భయం వేసింది నాకు. నా భయం గ్రహించిన వాడిలాగా 'వస్తానండీ' అంటూ పైకి లేచాడు, 'మంచిది రేపు మా యింటికి భోజనాన్కిరావాలి" అంటూ నేనూ పైకి లేచాను.

"అలాగే తప్పకుండా వస్తానులెండీ— కానీ-ఇవాళ్టికి మా వాడికి మీరు పర్మిషన్ ఇవ్వాలి."

"అదేమిటి ఆయన అలా చెప్తారేమిటి-? అయినా... మీ ఫ్రెండ్‌కే కానీ ఆయన భార్యనైనందుకు నాకు అక్కర్లేదా డిన్నర్?"

"ఎంత మాటన్నారండీ...అదేం లేదు నేను ఇంకా వారం రోజులుంటానన్న సంగతి మర్చిపోయారా? సన్‌డే అప్సరాలో ఉభయులకూ డిన్నర్..." అంటూ మావారి చేయి



పట్టుకుని వీధివైపు నడిచాడు.

'వస్తాను విజయా. నేను వచ్చేసరికి కాస్త ఆలస్యం కావచ్చు. భోజనంచేసి — పడుకో...'' అంటూ అతనితో నడిచారు.

వచ్చిన అతిథిని గుమ్మందాకా సాగనంపడం మర్యాదలక్షణం కాబట్టి వారి వెనక నేనూ అతని కారువరకూ వెళ్ళాను.

జేబులో చేయిపెట్టి 'కీ' బయటికి లాగ బోతూండగా, కర్చీఫ్, దాన్తో ఒక పాకెట్టు అతనిజేబులోంచి కింద పడ్డాయి— ''అరే...' అంటూ వంగుని పాకెట్టుతీస్తూ ఒకసారి నావైపు చూసాడతను. అప్పటికే నాకు వొళ్ళు జలదరించినట్లయింది— ''వస్తాను— లోపల స్టౌమీద గిన్నె ఏమయిందో'' అంటూ గబగబా లోపలికి వచ్చేసాను. ఇరవైనాలుగ్గంటలూ జేబులో అవిధంగా అవిపెట్టుకు తిరిగే అతనిపట్ల ఎవరికైనా గౌరవం ఎలా ఉంటుందో అర్థంకాలేదు నాకు.

''ఏమిటలా వెళ్ళిపోయావు—మేనర్సు తెలీకుండా—'' తెల్లవారుగట్ల ఇంటికి వచ్చిన శ్రీవారి చిందులవి.

''ఎలాంటి వాళ్ళకి గౌరవం ఇవ్వాలో నాకు బాగా తెల్సులెండి''

''ఏమిటి తెల్సిపోయింది అతని గురించి.''

''ఏం నాచేత చెప్పించాలనా ?'

''అవును... ఏదో పనిమీద గవర్నమెంట్ హాస్పిటల్‌కివెళ్తే అక్కడ ఊరికే పడుంటే ఒక పాకెట్ తెచ్చుకుంటే—తప్పా ?''

''అతను చెప్పమన్నాడా ఈ సంజాయిషీ''

''నీకు సంజాయిషీ ఇవ్వాల్సిన ఖర్మ అతని కేమిటి ?''

''అయినా అతని తరుపు వకాల్తా పుచ్చుకుని వాదించాల్సిన అవసరం మీకేమిటి ?''

ఈవిధంగా అతని మూలంగా మొదటిసారిగా మా యిద్దరి మధ్యా పచ్చగడ్డి భగ్గుమంది. మర్నాటికే మర్చిపోయిన ఈకలహాన్ని గురించి నేను బాధపడలేదు కానీ వరుసగా రాత్రుళ్ళు ఇంటికిరాని ఈయన ప్రవర్తన, దానికి కారకుడైన ఆ మనిషి గుణం...మెల్లగా బోధపడసాగాయి.

తెల్లవారకుండానో, తెల్లవారిన తరువాతో ఇంటికి రావడం తొమ్మిది గంటల దాకా పడుకుని, గాబరాగాలేచి గబగబా రెడీ అయి క్యాంప్‌వెళ్తే మళ్ళీ మర్నాడు ప్రొద్దున్నే దర్శనం.

కృష్ణప్రసాద్ అనే వ్యక్తి ఇలా మధ్యన వచ్చి మా యిద్దర్నీ విడదీయడం నేను సహించలేకపోయాను. అతని గురించి ఏమైనా చెప్పబోయినా వినే శాంతము నాలో లోపించింది.

మొత్తంమీద పదిరోజులూ, ఒక యుగంలాగా గడిచాక, ఒక శుభోదయాన ఏమీ ఎరుగని వాడిలాగా వచ్చి హాల్లో కూర్చొంటే అటు వెళ్ళాలంటేనే జుగుప్స కలిగింది.

''విజయా...తొందరగా రా—వాడు వెళ్ళిపోవాలని ఖంగారుపడుతున్నాడు''—బాత్‌రూమ్ తలుపు బాదారాయన.

ఇష్టమున్నా లేకపోయినా కొన్ని విధులు గృహిణికి తప్పవు.

''సారీ విజయగారూ...మళ్ళీ వద్దామనుకున్నా కుదరలేదు—మీకు డిన్నర్ బాకీ పడిపోయాను—మళ్ళీసారి తీర్చుకుంటాను''

''ఎందుకులెండి దానికి బదులు మావారికిచ్చిన పార్టీలు చాలు'' అని మనసులో అనుకొని 'ఫర్వాలేదులెండి' అని నవ్వేసి 'కాఫీ తెస్తా' ను అని లోపలికి వచ్చేసాను.


మా యిరువురి మధ్యా జరిగిన సంఘర్షణ అతనికి తెలుసోలేదో తెలియదుకానీ ఏమీ ఎరుగని వాడిలా మాట్లాడే అతని ప్రవర్తన మాత్రం ఆశ్చర్యం వేసింది.

''ఈసారి వచ్చేటప్పుడు మీ మిసెస్‌ని కూడా తీసుకురండి—మా యిద్దరికీ కాలక్షేపం అవుతుంది'' అన్నాను కాఫీ అందిస్తూ.

''అమ్మా...ఎంత దెబ్బ కొట్టారండీ... దానికెక్కడ కుదురుతుందండీ—మా బాబు ఒకడు కదా—వాడితో ఛీదర.''

ఇంకా వాదన పెరిగితే మర్యాదగా ఉండదని ''ప్రయత్నించండి'' అనేసాను. నిజానికి భార్యను పరాయి వ్యక్తుల దగ్గర 'అది' 'ఇది' అని సంభోదించే అతని సంస్కారాన్ని మరొక్క క్షణం భరించలేనన్పించింది.

రోజులు కృష్ణప్రసాద్‌ని గురించిన వాదనరానంతకాలం ప్రశాంతంగానే గడుస్తున్నాయి. కృష్ణప్రసాద్‌మాట వచ్చినప్పుడల్లా మావారు తాచుపాములాగా లేచేవారు. 'వాడి గురించి నీకేం తెల్సు?' అంటూ. కొత్తగా పెళ్ళయింది. అయ్యో...వాళ్ళని ఎందుకు నా మూలంగా విడదీయడం—అంటూ మర్యాదగా ఒకరోజు పార్టీతో విడవకుండా రోజూ జలగలాగా పీడించిన అతని గురించి మీరు నాకు చెప్పనవసరం లేదులెండి!''



''మా అమ్మాయి మీకెలా వుందోగాని అబ్బాయిగారెలో వున్నారో తెలీడంలేదు బావగారూ...!''

''ఆరు నెలలు తర్వాత కన్పించినవాడు ఓనాల్గు రోజులుంటే నీకెందుకంత బాధ. నిన్నేం వండమన్నానా—వార్చమన్నానా ?''

''అలా చేసినా నాకేం బాధలేదు. సరదాగా ముగ్గురమూ కలిసి ఉండేవాళ్ళం. కానీ ఇదేమిటి...? స్నేహితులు కలిస్తే తాగితీరాలా? అదేనా స్నేహానికి లక్షణం?''

''కొంచెం తాగితేనే చిందులు వేసేస్తావ్—సరదాకి ఫ్రెండ్‌వస్తే కాస్త పుచ్చుకుంటే తప్పా ?''

''ఈ సరదాలే అలవాటుగా మారేది.''

''నా సంగతి నాకు తెల్సులే!''

ఈ విధంగా మూడోవ్యక్తి ప్రసక్తి మా జీవితాల్ని వేరుచేస్తున్నట్లుగా తోచి, రాను రానూ అతని ప్రస్తావన తీసుకురావడం తగ్గించేసాను. నేను నా నోరు తగ్గించుకుని, అతనితో ముక్తసరిగా ఎప్పుడైతే మాట్లాడటం ప్రారంభించానో, తను మా ఇంటికి రావడమూ తగ్గించాడు. కానీ— నెలకి కనీసం రెండు సార్లు రావడం, వచ్చిన ప్రతిసారీ ఆఫీసు పని అంటూ వారం రోజులు తిష్ఠవేయడం... ఇవి నాకు భరించరానివిగా తయారయ్యాయి. పుట్టింటికి అలిగి వెళ్ళిపోవటం, నా అభిమతానికి విరుద్ధం— ఇంత చిన్నచిన్న వాటిని పట్టుకుని వచ్చిపోతానని బెదిరించి అలుసు కావడం అసలే యిష్టం లేదు. వేరుగా వెళ్ళి వొంటరిగా బ్రతకటానికి ఆర్థికమైన ఇబ్బంది లేకపోయినా, మానసికంగా సమ్మతి దొరకలేదు— ఈ విధంగా సుమారు నాలుగు నెలలు గడిచాయి. పూర్వంలాగా మేము ఇద్దరమూ ఒకరిపట్ల మరొకరం చనువుగా ప్రవర్తించుకోలేక పోతున్నాం— ఏమయినా

నచ్చచెప్పబోయినా అనవసరమైన వాదనా-బాధా- ఇవే మిగుల్తాయి.

"పెద్ద-చదువుకున్నావ్...ఇంత మాత్రం కల్చర్ తెలీదా?"

"హై సొసైటీ మూవ్‌మెంట్ ఇదేనా?"

"తాగొచ్చి నిన్నేమన్నా చావగొడుతున్నానా?"

"ఇంత సంస్కారం తెలీనిదానివని తెలిస్తే పెళ్లి చేసుకోబోదును- నీకేం లోటుచేశాను? కూడా? గుడ్డా?"

కూడూ గుడ్డా కోసం ఆయన పంచన చేరినట్లు దెప్పి పొడుపు! ఈ అనవసరమైన వాగ్వివాదం ఇష్టంలేక వీలయినంత మౌనంగా గడిపేదాన్ని ఏనాడైనా కాస్త సరదాగా గడిపితే ఆ మర్నాటికే మా విషయం తెలిసిపోయిన వాడిలాగా దిగేసేవాడు కృష్ణప్రసాద్-...

శ్రీ లెరిగి వాత

మళ్లీ పాత కథే!

ఈ సమస్య వేరెవరూ వొడ్డుమీద కూర్చొని పరిష్కరించేది కాదు ... అందుకని నాకు నేనే మార్గాలు వెతకడం మొదలు పెట్టాను. ట్రాన్స్‌ఫర్ అయితే సమస్య సులభంగా పరిష్కారంఅవుతుందనిఅనుకుంటే అది చాలా తెలివితక్కువ ఆలోచనగా తోచింది. ఎందుకంటే రెండువందల మైళ్లలోపు బదిలీ అయితే ఎప్పుడూ మంచి కండిషన్‌లో ఉండే కారుంది. అంతకుమించి వెళ్లినా నెలకి రెండు సార్లు ఏదో వంకపెట్టి రావడానికి తగిన తెలివితేటలున్నాయ్-కారణం అతని హెడ్ ఆఫీస్ వైజాగే!

ఆలోచించి, ఆలోచించి వైరంపల్లా పరిస్థితులు సానుకూలపడవని గ్రహించగలిగాను.

అందుకే...కృష్ణప్రసాద్ క్యాంప్‌వంకన మా ఊరు వచ్చినప్పుడు వీలయినంత మామూలుగా మాట్లాడాను. రెండుపూటలు భోజనానికి పిలిపించాను. నాలో వచ్చిన మార్పు ఇరువురికీ సంతోషం కలిగించింది.

"ఏమిటండోయ్ ... ఇంత ఛేంజ్...నా పేరు చెప్తేనే ఎగిరిపడ్తారనే భయంతో ఉండేవాడిని..."

"నిజమేనండీ...ఆలోచించగా మారుతున్న కాలంతో మనమూ మారాలి. ముఖ్యంగా నాలాంటి ఆడవాళ్లు-నాకిష్టంలేని పని విడుటివ్యక్తి మానలేనప్పుడు — ఎందుకననసరంగా గొడవ...అతని యిష్టప్రకారం నేను మారితే సరిపోతుందికదా!"

"ఎంతయినా అన్ఫమైన భారతనారి

లాగా మాట్లాడారండి-నా మిసెస్‌ని మీ దగ్గరికి పంపిస్తాను – కాస్త బుద్ధి చెప్పకూడదూ?"

"బుద్ధి ఒకళ్ళు నేర్పితే వచ్చేదా చెప్పండి– స్వతహః ఉండాలి కానీ..." అనేసాను నవ్వేస్తూ.

"చాలా థాంక్స్ విజయా...నిజంగా చాలా సంతోషంగా ఉంది – నిజంగా ఇన్నాళ్ళకు నువ్వు నన్ను అర్థంచేసుకుని, నాకు నచ్చే విధంగా ప్రవర్తించావు. ఇన్నాళ్ళూ మనసులో ఎంత మదన పడ్డానో తెల్సా?"

"మదనపడినా మధువు మానలేకపోయారుగా."

"అదిగో మళ్ళీకోపం ... కృష్ణప్రసాద్‌కి ఇంట్లో సుఖంలేదు. వాడు వచ్చేదే దానికోసం అట్లాంటప్పుడు స్నేహితుడిగా వాడిని సంతోషపెట్టడం నా విధికదా!"

"అక్కడ దొరకదా ఈ తాగేరకం? ఇంట్లో శాంతి ఎలా ఉంటుంది ఇలాంటి మనిషిని భర్తగా పొందిన ఆడదానికి ?" ఇవన్నీ పైకి అనలేదు. మనసులో అనుకున్నాను. అనవసరమైన వాదనలు రాకుండా నన్ను నేను కంట్రోలు చేసుకుంటున్నాను.

రోజులు పైకి ప్రశాంతంగా గడుస్తున్నాయి. కృష్ణప్రసాద్ రాకపోకలు మామూలే! వచ్చిన మార్పల్లా...అదివరకు వీధుల్లోపడిన భాగోతం ఇప్పుడు ఇంట్లో ! ఏ అర్థరాత్రో తన బసకు వెళ్ళిపోయేవాడు-నాకు ఆశ్చర్యం కల్గించే విషయం ఈయన అతనితో తప్ప మరొకరితో ఇలాంటి మీటింగ్స్‌లో కలిసేవారు కాదు. దానిని బట్టి నేను గ్రహించినది అదంతా ఈ కృష్ణప్రసాద్ చలువే అని, అతనిపై ఉన్న అభిమానంతో తనకు ఇష్టం ఉన్నా లేకపోయినా ఈ విధంగా గడుపుతున్నారని !

"ఏమండోయ్...ఎక్కడికో వెళ్తున్నట్లున్నారు. మీ ఫ్రెండుగారు దిగారు. మిమ్మల్ని ఇంట్లోనే ఉండమన్నారు–" టెన్నిస్ రాకెట్ పట్టుకుని వెళ్ళబోతున్న వారితో చెప్పాను.

"అరే...చెప్పలేదేం ఇందాకే..." అంటూ స్కూటర్ తాళాలు చేతిలోకి తీసుకున్నారు.

"అతను ఒక్క పూటే ఉంటాడుట. ఏదో అర్జంట్ పనిమీద వచ్చాడుట-ఎక్కడికో వెళ్ళి వస్తానన్నాడు-సూట్ కేస్ మనింట్లోనే ఉంచి వెళ్ళాడు–"

ఏ ముహూర్తాన సూట్‌కేస్ ఒకపూట ఆగడానికి వచ్చినప్పుడు పెట్టాడోకానీ తరువాత నుండీ వచ్చినప్పుడల్లా మా ఇంట్లోనే బస చేసేవాడు.

"ఇంత ఇల్లుండి...ఒక్కడివీ అక్కడెందుకు–? ఇక్కడే ఉండు ! అని నేనే బలవంతం చేసానని" శ్రీవారి వ్యాఖ్య.

ఈవిధంగా అతని స్థానం మాయింట్లోకి మారిన తర్వాత అయిష్టంగానైనా రోజంతా అతనితో గడపవల్సి వచ్చేది. ఏం పనిమీద వచ్చేవాడో తెలియదుకానీ దరిదాపు రోజంతా యింట్లోనే ఉండేవాడు.

"వాడికి బోర్ కొట్టకుండా చూడు...నేను తొందరగానే వచ్చేస్తాను." అంటూ నామీద ఉన్న అపనమ్మకాన్ని వ్యక్తంచేసేవారు.

> **ప్రశ్న ?**
>
> వద్దన్నా వస్తుంది
> నిద్దుర — కా
> వద్దన్నా అవుతుంది
> ఆకలి — వేయ
> వద్దన్నా వేస్తుంది
> భయం — నాలుగోది
> నేను చెప్పను.
> ఇవి అందరికీ
> అన్నిటికీ, ఒకటే
> అయితే–
> ఎవడు మానవుడు ?
> ఏది జంతువు.
>
> — పైడిపాటి సుబ్బరామశాస్త్రి

"అదేమిటండీ... నేను యింత మారినా నామీద మీకు నమ్మకం కుదరలేదా? నిజం చెప్తున్నాను కదా. మొదట్లో మిమ్మల్ని అనవసరంగా దెబ్బలాడినా, ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నాను" సిగ్గుతో తల వంచేశాను.

"గుడ్..." హుషారుగా స్కూటర్ స్టార్ట్ చేసేశారు. ఎంత తెలిసిన వాడైనా రోజంతా కబుర్లు చెప్పాలంటే విసుగునా అన్పించేది. ఇంకొక మనిషి ఉనికి. అలా ఇంట్లో గెస్ట్‌గా వున్నాడనే బావన ఏదోలా ఉంటుంది. "అందుకే కాలక్షేపంగా కార్డ్స్ ఆడ్దాం" అంటే కాదనలేక పోయాను. కాస్సేపు చెస్, మరీ లోచకపోతే కబుర్లు.

"ఏమిటండీ... ఏదో ఆఫీస్ పనిమీద వస్తూంటారనుకుంటున్నాను. ఒక అరగంట వెళ్ళి వస్తారంతే. రోజంతా రెస్ట్. హాయిగా వుంది మీ జాబ్. మా వారికి రోజంతాచేసినా తరగని పని!"

"ఒక్క రోజులో పనంతా చేసేస్తే ఇక్కడ ఏ వంకన ఉండగలను చెప్పండి? మావాడంటారా– సిన్సియర్ వర్కర్– కంపెనీ మెప్పులూ, మెహర్బాణీలూ వాడికి అక్కర్లేదు. వాడు ఏడాది కష్టపడి పనిచేసి సాధించే పనిని, ఫలితాన్ని, నేను ఒక్క రోజులో ఒకగంట కబుర్లతో సాధించగలను." ఇలా సాగేవి మా సంభాషణలు–

"హాయిగా అతన్ని చూడండి. ఇంత కష్టపడి మీారు సాధించేది మంచం మీాదనుండి కదలకుండా సాధిస్తాడు.

"ఉద్యోగం అంటూ రెక్కలు ముక్కలు చేసుకోడం మూలంగా మీకు కంపెనీ ఒరగపెట్టినదేమిటి ? అతనికి తరగబెట్టిందేమిటి ?

ఇద్దరూ పేరుకి ఒకటే సంపాదనాపరులు. అతనేమో ఎంబాసిడర్‌లో ఫల్ మోహనరంగా అంటూ తిరుగుతాడు. ఈ డొక్కు స్కూటర్ ఎప్పుడు నడుస్తుందో– ఎప్పుడు ఆగుతుందో అంతా దైవాధీనం. నెల జీతంలో మూడు వంతులు దీనికి మింగబెట్టినా తృప్తి లేదు. హాయిగా అమ్మేసి మీరూ కారు కొనకూడదూ?

ప్రొద్దున్న క్యాంప్‌కి బయల్దేరితే తినో తినకుండానో చీకటిపడ్తుంటే కొంప జేర్తారు–వచ్చాక కలిగిన అలసట – ఇవే మన జీవితాలు. అతను చూడండి – టైముకి టంచన్‌గా బల్లదగ్గరికి వస్తాడు. కావల్సినవి అడిగి మరీ చేయించుకుంటాడు. సరదాగా కబుర్లు చెప్తూ తింటాడు. పేకాట ఆడ్దాం రమ్మంటాడు – సినిమాకి వెళ్దామా ? అంటాడు. ఎంతకిన్ని, ఎక్కడికి వెళ్ళినా మీరు వెంట ఉన్నట్లు ఉంటుందా? ఎక్కడికి ప్రోగ్రాం వేద్దామన్నా ఊరు వెళ్ళిన మనిషి ఏ టైముకి వస్తారో తెలీదు–ఫ్రెండ్ సరదాల కోసం పెళ్ళాన్ని వదులుకోగలిగారు కానీ పెళ్ళాంకోసం ఒక్కరోజైనా ఆఫీస్ వర్క్ మానుకోగలుగుతున్నారా ?"

నాకు తెలియకుండానే సాధింపు మాటలు వచ్చేవి. దానికి సమాధానంగా క్యాంప్‌కి వెళ్ళేముందు "చూడు విజయా. మీరు ఎక్కడి

కైనా వెళ్తే చీటి రాసిఉంచు – క్యాంప్‌నుండి వచ్చాక నేనూ వస్తాను" అనేవారు. ఆయన నమ్మకానికి మనసులో జోహారు అర్పించా లనిపించేది. కానీ ఎక్కడికీ వెళ్ళకుండా ఇంట్లోనే ఉండేదాన్ని.

"అదేం ఎక్కడికో వెళ్తారేమో ననుకున్నాను"

"అతను అలాగే అన్నారు కానీ మీరు లేకుండా వెళ్తే సరదా ఏముంటుంది చెప్పండి? అతనికేం మీరుకాకపోతే ఇంకో ఫ్రెండుతో గడుపుతాడు - అయినా పాపం ఆయనెందుకు లెండి అనవసరంగా అనడం సినిమాకి వెళ్దాం అనే అన్నారు. నాకే వెళ్ళబుద్ధి కాలేదు."

ఎక్కడికి వెళ్ళాడో కృష్ణప్రసాద్ ఇంకా రాలేదు. ఈయన అతనికోసం వెయిట్ చేస్తూ పేపర్ చూస్తున్నారు.

"ఏమండోయ్ చెప్పడం మర్చిపోయాను మీ ఫ్రెండ్ సినిమాతీస్తే నన్నే మ్యూజిక్ డైరెక్టర్‌గా పెడ్తాడుట" అన్నాను నేను. అంతకుముందు ఒకటి రెండుసార్లు నేను కూనిరాగాలు తీస్తూండగా అతను రావడం నేను పాట ఆపేయడం పాడమని అతను అనడం, ఏదోవంకన నేను తప్పించుకోవడం జరిగాయి.

"నీపాట విన్నాడా? ఎప్పుడూ పాడ లేదుగా?" ఆశ్చర్యంగా అడిగారు శ్రీవారు.

"తిరిగ్గా కూర్చొని పాడ్తేనే వినాలేమిటి? అతను తన రూమ్‌లో కూర్చున్నా, నేను

కీ తెరిగి వాత

వంటింట్లో ఉన్నా విన్పిస్తుంది కావాలను కుంటే. ఈ విషయంలో మీకంటే అతనే నయం ఎదురుగా కూర్చొని పాడినా విన బడదు మీకు!" నిష్ఠూరంగ అన్నాను.

"అయినా పరాయి మనిషి ఇంట్లో ఉంటె కూనిరాగాలెలా వస్తాయి నీకు?" కాస్త కోపం ధ్వనించింది.

"కూనిరాగాలు కావాలంటేనే వస్తా యేమిటి? అలవాటది!" వెంకిగా అన్నాను.

"మంచి అలవాటే – అతనే మనుకుం టాడు?"

"ఏమనుకుంటాడో మీరే చెప్పండి!"

"పరాయి మొగాడు ఇంట్లో ఉండగా ఒంటరిగా ఉన్న ఆడది కూనిరాగాలుతీస్తే అర్థం ఏమిటి?"

"అలాంటి అర్థాలూ, పెడర్థాలూ నాకు తెలియవులెండి!"

"అతన్ని గురించి నాకంటే నీకే బాగా తెల్సినట్లు మాట్లాడుతున్నావే!"

"ఎవరి గురించయినా అర్థమవుతుంది ఒక్క మీ గురించి తప్ప!' విసురుగా లోపలికి వెళి పోయాను...

ఇది జరిగిన ఒక పావుగంటకు కృష్ణ ప్రసాద్ కారు శబ్దం విన్పించింది.

పతిసారిలాగా మా వారు నాకోసం గావు కేకలు పెడ్తూ; అది అందించు, ఇది అందించు అంటూ హడావుడి చేయలేదు. సుమారు తొమ్మిది గంటలవు తూండగా "భోజనాలు వడ్డించు" అన్నారు ఏగోడతోనో చెప్తున్నట్లు. నాకు తెలీకుండా మరెవరైనా వచ్చారా? అని అటూ ఇటూ చూసాను. ఎవరూ లేరు. "అయితే కోపం ఇంకా తగ్గలేదన్నమాట" అనుకుంటూ డైనింగ్ హాల్‌లోకి నడిచాను.

"మిసెస్ చేస్‌లో ఎక్స్‌పర్ట్‌రా...మూడు సార్లు చిత్తుగా ఓడిపోయాను..." నన్ను చూస్తూనే సర్దుకొచ్చిన వాడిలాగా అన్నాడు కృష్ణప్రసాద్.

ఆయన ఏమీ మాట్లాడకుండా ప్లేట్ దగ్గరికి లాక్కొన్నారు.

"ఏమండీ కృష్ణప్రసాద్‌గారూ... రేపు వెళ్ళిపోతున్నానంటున్నారు .. ఈసారి ఇంత తక్కువ 'స్టే' పెట్టుకున్నారేం ?" వడ్డిం టున్నా కూరవేస్తూ అడిగాను.

"వెళ్ళిపోవాలండీ... ఎంత వద్దనుకున్నా కంపెనీ సొమ్ముతిని బ్రతుకుతున్నందుకు కాస్త పనిచేయాలి కదండీ...అయినా ఎంత... మళ్ళీ పదిరోజుల్లో ఎలాగూ రావాలి."

"నేనో చిన్న సలహా చెప్పనా...మీరు మకాం ఈవూరు మార్చి అప్పుడప్పుడు ఆ ఊరే క్యాంప్ వెళ్తేసరి. మీకూ బావుంటుంది మాకూ బావుంటుంది" అన్నాను నవ్వుతూ.

"బలేవారండీ... చూడరా...మీ ఆవిడ సలహా.. అయినా బలేమార్చేసావురా. అదృష్ట వంతుడివి. మొదటిసారి చూసి - రెండోసారి

వస్తే ముఖం పగిలేలా తలుపు లేస్తుందను కున్నాను — అలాంటిది...ఇప్పుడు...ఏవయినా మావాడు లక్కీఫెలోలెండి. అందరు ఆడ వాళ్ళూ మీలాగా ఉండరండీ! మొగుడు కాస్త ఒక్కసారి కంపెనీసేక్‌కాస్త పుచ్చు కుంటేనే కొంపలంటుకు పోయినట్లు ఏడ్చే స్తారు. అంతేనండీ...వాళ్ళకు చదువులొస్తు న్నాయి కానీ సంస్కారం అబ్బడం లేదండీ" నవ్వుతూ అన్నాడు కృష్ణప్రసాద్.

మర్నాడు కృష్ణప్రసాద్ బయర్దేరే హడా వుడిలో సూట్‌కేస్ సర్దుకుంటున్నాడు— మాటలు విన్పిస్తున్నాయి.

"మళ్ళీ ఎప్పుడు వస్తానన్నావ్?"

"ఇవాళ 'సెకండ్' కదూ... మళ్ళీ థర్టీన్త్ నాటికి వస్తాను— లేకపోతే నాకు తోచదద్దూ?"

"అదిసరే అనుకో... మేం పదిన బయ ల్దేరి గుంటూరు వెళ్దామనుకుంటున్నాం.... ఒకవేళ నువ్వు వస్తే ఇబ్బంది పడ్తావని..."

"ఐసీ. అయితే కొన్నాళ్ళు పోస్టుపోన్ చేసుకుని ఏ ఇరవైనో వస్తాను."

"తప్పనిసరి పని అయితే అలాగే రా— కానీ బహుశ నేను వన్ మన్త్ లీవ్ పెడ్తాను. విజయ ఒకటే పోరు. ఏ ఊరూ తిప్పలేదనీ— అలాగే మైద్రాస్, బెంగుళూర్ వెళ్దామని ఐడియా—"

"అలాగే... ఐతే మీరు ఊర్నుంచి వచ్చాకే కలుస్తాను. ఈలోగా కొంపలుమునిగే పన్లు ఏముంటాయి. నీకు తెల్సుగా... నేను వచ్చేదే మీకోసం!" అంటూ కారు స్టార్ట్ చేశాడు కృష్ణప్రసాద్.

ఇంక ఆ తరువాత కథ నేను రాయనవసరం లేదు. ఇంటింటా వుండే కథే— మేం గుంటూరు కాదుకదా పక్కనున్న అనకా పల్లికిగాని ఆఖరికి సింహాచలం కూడా వెళ్ల లేదు—రోజులు గడిచి పోతున్నాయి— మామూ లుగా కాదు— చాలా సరదాగా— సంతోషంగా. ఏవూళ్లు తిరగకపోయినా సంతోషంతోఎందుకు ఉప్పొంగి పోతున్నానో అని పాఠకులు ఆశ్చర్య పోవచ్చు— దానికి కారణం— మొగవాడి సంస్కారంమీద నాకున్న విశ్వాసాన్ని మావారు వృధా చేయనందుకు. కృష్ణప్రసాద్ మా యింటికి రాలేదు— ఇంక ఎప్పటికీ రాడని నాకు తెల్సు. పాపం... అమాయకుడు కృష్ణ ప్రసాద్!

చక్రపాణిగారు

చక్రపాణిగారు చాలా సన్నగా పొడుగ్గా ఉండేవారు. "ఇంత సన్నటి మనిషిలో ఏమి ఓపిక ఉంటుంది?" అనిపించేవాళ్లకి ఆయన వ్యక్తిత్వం అన్ని విధాలుగా నూ ఆశ్చర్యం కలిగిస్తూ ఉండేది. కావాలని ఒక రకం విసురు యాసతో మాట్లాడేవారు ఆయన. దీని వెనుక ఎంత చదువు, ఎంత విచక్షణతో కూడిన జ్ఞానం ఉందో క్రమంగా కానీ తెలిసేదికాదు ఆయనతో పరిచయం కలిగిన వాళ్లకి. సుమారు పాతిక సంవత్సరాల క్రింద ఈ విలేఖరి ఆయన్ని మొదటిసారిగా ఒక సినిమా 'ప్రివ్యూ' లో చూశాడు. అప్పట్లో 'సాంఘికాలు' అందులో నూ తెలుగులో సాంఘికాలు చూసే అలవాటు ఈ విలేఖరికి తక్కువగా ఉండేది. ఇప్పటిలాగ ఆ రోజుల్లో 'సినిమా వాళ్లు' ఒక అభిజాత్య వర్గం కాలేదు; చక్రపాణి గారంటే మాత్రం ఎందరో పుస్తకాలు చదివేవాళ్లలాగ ఈ విలేఖరికి గౌరవం ఉండేది. ఆయన్ని కలవటం అంటే కొంచెం గొప్పగానే కూడా తోచింది. బెంగాలీలో నుంచి చక్కగా తెలుగు చేసే చక్రపాణిగారు మధ్య సర్కారు జిల్లాల మనిషి అని తెలుసుకొబట్టి (ఆ రోజుల్లో) ఆయన పొడుగు చేతుల షర్టు, గూడకట్టు కాస్త "నిరాశ" కలిగించిన మాట నిజం. ఆయన అంత కలుపుగోలుగా మాట్లాడ లేదని కూడ అప్పుడు అనిపించింది. ఇవన్నీ ఎంత పొరపాటుగా అనుకున్నానో తర్వాత, తర్వాత తెలిసిపోయింది. అసలు ఆయన కొంచెం మొహమాటం. (ఇంగ్లీషులో దీనిని 'షయ్' అని అనువాదం చేస్తే అపార్ధాలు ఉండవు!) మనిషి అయి వుండాలి. అందుకనే విడంబనం అంత తొందరగా రాదు. ఒకసారి అవతలివాడితో చనువుగా మాట్లాడటానికి నిశ్చయించుకున్న తర్వాత ఆయన వ్యక్తిత్వం ప్రభావం బయట పడనిచ్చేవారు ఆయన — అంటే బుద్ధిపూర్వకంగా అని కాదు! అది సహజంగా బయటపడే ప్రభావమే......

ఇప్పుడు "మాండలికా" లుగా చెప్పబడు తున్న భాషలో కథలు రాయటం మంచిది కాదని చక్రపాణిగారు అనేవారు. రేడియో, సినిమాల ద్వారా ఒక రకం భాష బాగా



శ్రీ చక్రపాణిగారు సెప్టెంబరు 24 తెల్లవారు ఝామున మద్రాసులో అంతిమశ్వాస తీసుకున్నారు

ప్రచారంలోకి వచ్చింది. వస్తోంది — దాన్నే వాడాలని ఆయన అనేవారు. హాస్యంకోసం, కొన్ని సందర్భాలలో 'యాస' (ఏవరికి) భాషలు వాడచ్చు. కాని కథ చెప్పటానికి దాన్ని వాడటం బాగా ఉండదని ఆయన అభిప్రాయం. రచయితగా చక్రపాణిగారు ఈ అభిప్రాయానికి అనుగుణంగానే నడుచుకున్నారు. సినిమాలలో మొత్తం మీద అందరూ ఇదే పని చేస్తున్నారు! ("ఇదంతా వ్యాపారం వల్ల వచ్చింది!" అని అనంతపురానికి 'చెందిన' ఒకాయన ఈ విలేఖరితో వేడిగా వాదించేవారు. ఇది నిజమే కావచ్చుకాని ఫలితం మాత్రం ఒకటే!) పత్రికలు, సిని మాలు, రేడియో — వీటన్నిటిద్వారా ఒకరకం సర్కారు జిల్లాల తెలుగుకి మంచి ప్రచారం వచ్చేసింది. చక్రపాణిగారు దీనిని నిలబెట్టా లనే వాదించేవారు. (పక్షపాతం వల్లనే అయినా ఆయన వాదం ఈ విలేఖరికి బాగా నచ్చింది!) ఆయన కొన్నెప్పుడు — ఈ మాట తప్పని కొందరు అంటారు. కాని ఇదీ ఒక ఉప-ప్రాం తపు యాస భాషలో వాడేదే! — ఒకరకంగా మాట్లాడేవారు. అదీ తెచ్చి పెట్టుకున్నదేనని విన్నవాళ్లకి అనిపించేది! ఎందుకంటే, చక్రపాణిగారువాలా ఎక్కువ చదువుకున్నవారు. ఆయనకి తెలిని విషయాలు చాలా తక్కువ. ఆయనకి ఏమిటేమిటో సంగతులు జ్ఞాపకం ఉండేవి. రాజకీయాలు; సినిమాలు, పుస్తకాలు, చరిత్ర — ఒకటేమిటి దేన్నిగురించి మాట్లా డినా ఎన్నో కొత్త విషయాలు చెప్పేవారు.

(20వ పేజీ చూడండి)

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

కె. టి. ఆర్. — మాచర్ల

ఆత్మహత్య మహాపాతకం అంటారు. మనొసట ఎలా రాసివుంటే అలా జరుగుతుంది. ఒకనికి ఆత్మ హత్య చేసుకోవాలని రాసివున్నప్పుడు అది పాపమెలా అవుతుంది ?

మనలో మనమాట—ఎవరినొసటనైనా ఎప్పుడైనా ఏరాతైనా చూశారా ?!

జి. పి. ఆర్. — తెనాలి

గర్వం ఒక ఆభరణం అనుకొంటారు మీరు. అలాగే నా మంచి ప్రశ్నలకు (ఫుల్‌స్కేపు సైజంటే ఏమిటి?) జవాబివ్వక. ...

ఇంతకీ మీ సణుగుడు దేనికి ? ఫుల్‌స్కేపు కాగితం యివ్వు అంటే మీ కిరాణాకొట్టు వాడిస్తాడు దానికింత సాధించాలా ?!

పి. కె. ఎస్. — బెజవాడ

సంసార జీవితంలో నిజంగా భార్యాభర్తలు ఒకరి నొకరు అర్థం చేసుకోకుండానే తగువులాడుకుంటూనే, భరించలేం అనుకుంటూనే కాపురాలు చేస్తారు — చాలామంది అలాంటి వాళ్లు ఏం చేస్తే బాగుంటుంది?

మన సంప్రదాయంలో పెళ్లికి తరవాతే ప్రేమ. అది పెరగడానికి టైము పడుతుంది. అది చిగురించి తీగెలు సాగేవేళకు గృహిణికి బిడ్డా పాప కల్గి, బాధ్యతలు పెరిగి— ఎందుకొచ్చినదీ భారం అనిపిం చేస్తుంటుంది. అయినా బాధ్యతలు— అనుబంధా లని బలిష్టం చేస్తూంటాయి— అందుకే విసుక్కుంటూ, తగువులాడుకుంటూ కాపురాలు సాగిస్తారు భారత నారులు !

ఎల్. బి. ఎస్. — షాహబాద్

హక్కులట బోడిహక్కులు. మీ జాతి సమానంగా బ్రతక్క చస్తున్నారా ? ! కొన్నాళ్లదాకా నీ వాదన కట్టిపెట్టు.

తమ్మా లక్ష్మణా ! ఏదీ విల్లు ? తే—నీ వాదన ఖండిస్తాను . . . మేం చావడంలేదు నాయనా, చచ్చి బ్రతుకుతున్నాం. అలాంటి వారిని మీరు మనుషులుగా చూస్తారా ? చూడరు. అందుకే బ్రతకాలని సమానత్వం కావాలని అడగడం.

టి. వి. కె. ఎస్. ఆర్. — కలకత్తా

ఎన్నిపూలు పూచినా తుమ్మెదలేని పూదోటకు అందంలేదు. ఎన్ని అందాలు చిగిర్చినా గండుకోయిల కమ్మని కంఠం లేనిదే— వసంతానికి నిండుతనం రాదు. అలాగే ఎన్ని కథలతో నిండి వున్నా మీ ప్రశ్నావళి లేనిదే పత్రికకు అలంకరణలేదు. మరి మీరేమంటారు.

ఇంకేమంటాను ? పొగడ్తకి పొంగిపోని హృదయం వుంటుందా ? నిజంగా నేనింత గొప్పదాన్ని కాబోలు అని వో క్షణం అనుకోబోయి ఆగాను. పూల మధ్య తుమ్మెద ఝంకారం, వసంతంలో కోయిల గొంతులాగా అన్నిటికీ మధ్య వుంటేనే కదా ప్రశ్నావళి ప్రత్యేకత !

డి. వి. ఆర్. — సికింద్రాబాదు

మంచి గృహిణి లక్షణాలేమిటి ?

ఎన్నాళ్ల కెన్నాళ్లకని ఆహ్వానించడం, అప్పుడే వెడతారా ? అంటూ సాగనంపడం మంచి గృహిణికి లక్షణాలట.

ఎస్. ఎల్ — హన్మకొండ

నేటి వరకట్న పిశాచం రూపుమాసి పోవాలంటే ఈ నాటి యువతీ యువకులు ఏం చేయాలి ?

పెళ్లికి డబ్బు కాదు ప్రాతిపదిక అని గ్రహించి తమ కాళ్లపై ఆర్థికంగా తాము నిలబడ కల్గినప్పుడే పెళ్లికి సిద్ధపడాలి. ముఖ్యంగా అబ్బాయిలు అన్నీ ప్రగల్భాలే తీరా చివరికి వచ్చేసరికి, మా అమ్మ, మా నాన్న అంటూ పెద్దల వెనుక దాక్కుని బాధ్యతలు తప్పించుకుంటారు. అదే ఏదో సంపాదించుకుంటున్న కొడుకైతే, కాస్తలో కాస్తైనా తన అభిమతం చెప్పడని నా నమ్మకం.

పి. ఎస్. — నెల్లూరు

నీ పోక ప్రశ్నకు జవాబిస్తూ ఆడదాన్ని కొట్టే మగవాడు ధర్మాయి మనిషి అని తెలిపారు. దీనితో నీ చదువువ్యర్థమని నీకు సంస్కారం హుళక్కి అని తెలియ వస్తుంది.

కొట్టండి యింకా కొట్టి చంపండి ! అంటూ కాళ్లట్టుకుని మగవాడిని బ్రతిమాలాలనీ, అటువంటి ఆడదే ఫస్టురేటు పతివ్రత అనీ రాస్తే — నాకు సంస్కారం, నా చదువుకి సార్థక్యం వుందని అంటారని ఏమిటి నమ్మకం ?!

ఎన్. కె. ఆర్. — విశాఖపట్నం

జీవితం దండుగ ఇంతకంటే చావడం మేలు.


పొరపాటు సోదరా, ఈ జీవితం చెడు అనీ, యీ ప్రపంచం వో భ్రమఅనీ అనుకోవడం కృతజ్ఞత లేక పోవడంలా తోస్తుంది నాకు.

రూపాయి !

ముందున్న
పండుగకని
మూడు నెలలనుండి
ఓపికతో దాచుకున్న
చిరిగిన రూపాయి
తీరా వేళకు చెల్లకుంటే
ఈ రోజుకూడా
పేగులు వాగుతున్నవి కదా!


— బైస దేవదాసు





ASP/SS/754
సర్‌సిల్క్
పాలియస్టర్
సూటింగులు
మరియు షర్టింగులు

ధర్మ పథం



బులుసు వేంకట రమణయ్య

బద్ధుడైన భగవంతుడు - బద్ధులుకాని భక్తులు

జీవుడు సంసార బంధంలో చిక్కుకొని, నానావస్థలూ పడుతూ, ఆ బంధంనుంచి ఎలాగ విడుదల పొందడమో అని పరితపిస్తూ ఉంటాడు. భగవంతుడిట్టి బంధాలు లేకుండా నిర్వికారంగా ఉంటాడు. కాని, ఒక్కొక్కప్పుడు భక్తులకోసం తాను బందంలో చిక్కుకుని వారికి వాటినుంచి విడుదల కలగజేస్తూ ఉంటాడు.

నలకూబరుడూ, మణిగ్రీవుడూ నవ నిధులకూ అధిపతిఅయిన కుబేరుని కొడుకులు. పరమేశ్వరుని సేవకులలో ముఖ్యులు. అయినా ధనమందాధులు. ఒకప్పుడు వారు కైలాస గిరిపైనున్న వనంలో తాగి, యువతులతో తందనాలాడుతూ, తమ పరిధానాలు విడిపోయినా గమనించకుండా ఉండిరి. అప్పుడు ఆ ప్రాంతానికి వచ్చిన నారద మహర్షి వీరి అసభ్య ప్రవర్తనకు ఏవగించి, కోపించి భూలోకంలో జోడు మద్దిచెట్లయేటట్లు శపించాడు. తర్వాత వారు అతని కాళ్లపయి పడి ప్రార్థించగా కరుణించి, చాలాకాలం భూలోకంలో వృక్షరూపంలో వుండి, శ్రీకృష్ణుని పాదస్పర్శవల్ల తిరిగి మామూలురూపం వచ్చేటట్లు శాపవిముక్తిని అనుగ్రహించాడు. వెంటనే నలకూబర, మణిగ్రీవులు యమళార్జున వృక్షములై వ్రేపల్లెలో ఉద్భవించారు.

బాలకృష్ణుని చిలిపిచేష్టలకు విసిగి, కోపించిన యశోదాదేవి అతడు యిల్లు దాటి ఎక్కడికి వెళ్లకుండా ఉండేటందుకు చిన్ని కృష్ణుని ఉదరానికి తాడు చుట్టి, ఒక రోటికి అతనిని బంధించినది. అతడు ఆ రోటిని లాగుకొంటూ ఇల్లు దాటి సమీపంలో ఉన్న జంటమద్దుల మధ్యనుంచి ఆ రోటిని ఈడ్చుకుంటూ వెళ్లాడు. దగ్గర దగ్గరగా ఉన్న ఆ మద్దిచెట్లు రోటికి అడ్డం తగిలాయి. బాలకృష్ణుడు కోపించి ఒక్కతన్ను తన్నేసరికి ఆ రెండుచెట్లూ పెళపెళా విరిగి నేలపై పడిపోయి, ఆ పడిపోయిన వెంటనే వృక్షరూపాన్ని విడిచి, యక్షరూపంపొంది; నలకూబర, మణిగ్రీవులుగా మారిపోయాయి. వెంటనే ఆ కుబేరపుత్రులిద్దరూ శ్రీకృష్ణుని పాదాలకు నమస్కరించి, అతనిని అభినందిస్తూ, తమ నివాసానికి వెళ్లిపోయారు. ఈ విధంగా రజ్జుబద్ధుడైన భగవంతుడు శాపబద్ధులైన యక్షకుమారులను బంధ విముక్తులను చేశాడు.

భక్తుల కష్టాలను తొలగించడానికి భగవంతుడు తాను శ్రమను సహించడానికి వెనుదీయడు.


అతనికి బంధం అనేది ఒక విలాసమే కావచ్చును. అయినా — బంధం ఎట్టిదయినా బంధమే అవుతుందికదా!

ఖైదీల త్యాగం

బీహార్ వరద బాధితులకు సహాయం చేసి తీరాలని సత్‌సంకల్పంతో జహీరాబాద్ సెంట్రల్ జైలులో ఖయిదీలంతా ఒక పూట వుపవాసముండి తత్ఫలితంగా మిగిలిన సొమ్ము నలభై ఏడువేల రూపాయలను ముఖ్యమంత్రికి సమర్పించారట. ఒక పూట వుపవాసం మిగులు 47,000 రూపాయలయితే ఆ సెంట్రలు జైలు రోజు ఖర్చెంత! నెల ఖర్చెంత!!

చట్టబద్ధ వ్యభిచారం

లైంగిక వ్యాధులు చాలా భయంకర ప్రభావం కలవి. గనేరియా అనే లైంగిక వ్యాధిని అశ్రద్ధ చేస్తే ఆ మనిషికి సంతానోత్పత్తి శక్తి నశించిపోతుందట. సిఫిలిస్‌ను సకాలంలో నివారించుకోలేకపోతే గుండె జబ్బు, పక్షవాతం వంటి భయంకరమైన రోగాలొస్తాయట. లైంగిక వ్యాధులన్నీ సామాన్యంగా లైంగిక సంపర్కంవల్లనే వచ్చినా, అసహ్యంగా వుంచబడిన పాయిఖానాలవల్ల హోటళ్లలో అసభ్యకరమైన దుప్పట్లు, పరుపులూ, తదితర వాతావరణాల వల్లా కూడా వస్తాయట. సిఫిలిస్ అనే వ్యాధి చుంబనం ద్వారా కూడా సంక్రమిస్తుందట. లైంగిక వాంఛకు లొంగి సంపర్కం వల్ల సుఖవ్యాధులు కొనితెచ్చుకోడంకన్నా



హస్తప్రయోగంవంటి వుపశమనాలు అనారోగ్యకరం కాదట (అంటే చేసుకు తీరాలని కాదు). లైంగిక వాంఛ అనేది శారీరక వాంఛ. అది అణచడానికి ప్రయత్నించడం, అణిచామనుకోడం భ్రమ. కనుక ప్రభుత్వం వ్యభిచారాన్ని చట్టబద్ధం చేసి, అట్టి వనితలకు లైసెన్సులిచ్చి, డాక్టర్లతోపరీక్షలు జరిపించడం వంటివి చేయడమే శ్రేయస్కు. ఇండోనేషియావంటి దేశాలు యీ విధంగా వ్యభిచారానికి లైసెన్సులు యిచ్చాయి. వైనాట్వుయ్!

ప్లాస్టిక్ కాలువలా

వచ్చే పాతిక ఏళ్ళలో భారత దేశంలో కురిసే ప్రతి వర్షపు చినుకూ దేశంలోని వ్యవసాయానికే సరిపోతుందని, యిక త్రాగడానికి నీరు దొరకడానికి దేశం నానా అవస్థలు పడాల్సి వుంటుందనీ ఏ. డి. క్లార్కె అనే ఆయన అభిప్రాయపడ్డారట. కనుక రానున్న పాతిక సంవత్సరాలలో నీరు పంట కాలువలద్వారా పొలాలకు చేరే ఏర్పాటులో ఆ పంట కాలువలన్నీ ప్లాస్టిక్ కాలువలుగా మారుతాయని, నీరు భూమిలోకి యింకకుండా చేయడానికి యీ ప్లాస్టిక్ కాలువలు ఆధారాలవుతాయని కూడా కూడా ఆయనన్నారట. అప్పుడిహ అన్నం తిన్న చెయ్యి కడుక్కోడానికి నీళ్లులేక ''నాకెయ్యాలా''! ఏమో! వెయిటెండ్ సీ ఆఫ్టర్ 2001.

ఎలుగుబంటిని పోరులో నిర్జించిన ధీరుడు


వెంకటగిరి తాలూకా చిలమనూరు గ్రామానికి చెందిన 10 ఏళ్ళ గురవమ్మ అనే అమ్మాయి మస్తానయ్య అనే 16 ఏళ్ల కుర్రాడు గడ్డి కోసుకొస్తుండగా ఓ ఎలుగుబంటి గురవమ్మ మీద విరుచుకు పడిందట. ఇది చూసిన మస్తానయ్య ఆ ఎలుగుబంటితో కలబడి కత్తిలో దాన్ని పొడిచి చంపేశాడట. ఈ పోరాటంలో అతనికి బాగా గాయాలయ్యాయట.

ఆకస్మిక మరణం

ప్రముఖ చలనచిత్ర నిర్మాత జి. వి. ఎస్. రాజు గారి కుమారుడు 19 ఏళ్ల చంద్రశేఖర్ మద్రాసులో బస్సు ఎక్కబోతూ, జారిపడి చనిపోయాడట. ఇతనుపచ్చయప్పాస్ కాలేజీలో చదువుకుంటున్నాడట.

వచ్చింది! క్రొత్తగా విజయ్ 24-24-0

ఇస్తుంది మీకు పుట్లకొలది పంట



మన రాష్ట్రంలోని నేలల్లో భాస్వర లోపం విస్తారంగా ఉంది. అధిక దిగుబడులు రాబట్టాలంటే ఈ ప్రాంతాల్లోని పొలాల్లో నత్రజనితో పాటు హెచ్చుమోతాదుల్లో భాస్వరపు ఎరువులను కూడా వేయాల్సి ఉంటుంది. ఈ అవసరాన్ని గుర్తించి మద్రాస్ ఫర్టిలైజర్స్ సంస్థ క్రొత్తగా విజయ్ 24-24-0 ను ప్రవేశపెట్టింది.

విజయ్ 24-24-0 యూరియా, అమ్మోనియా-భాస్వరాలు కలిగియున్న రసాయనిక ఎరువు. ఇందులో నత్రజని, యూరియా, అమ్మోనియా రూపాల్లోఉంది. భాస్వరం అంతా నీటిలో పూర్తిగా కరిగే రూపంలో ఉంది. ఈ విధంగా క్రొత్త విజయ్ 24-24-0 పరిపక్వతకు తక్కువ కాలంలో పంటకువచ్చే ఇతర పైర్లకు అన్నివిధాల తగిన ఎరువు.


విజయ్ 24-24-0 వ్యవసాయ శాఖవారి సిఫార్సుల ప్రకారం అన్ని పైర్లకు అనువైనది.

విజయ్ 24-24-0, నాణ్యమైన ఎరువుల ఉత్పత్తికి పేరెన్నికగన్న మద్రాస్ ఫర్టిలైజర్స్ వారిచే తయారుచేయబడింది.

మీ హితుడు
స్నేహితుడు
విజయ్

VIJAY
MADRAS FERTILIZERS

మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్
మద్రాస్ 600 068




MFL-1061

సామాన్యంగా ఎవరికైనా పెళ్ళైన తరవాత మంచి ఉద్యోగం వస్తే పెళ్ళాం వచ్చినవేళ మంచిదనీ, పిల్లదాని అదృష్టం అనీ ఆ అమ్మాయి పరంగా చెబుతుంటారు. కాని మా సుబ్బారావు విషయంలో మాత్రం అందుకు భిన్నంగా వుద్యోగం దొరికిన అదృష్టాన మంచి భార్య దొరికిందని చెప్పుకోవాలి. ఎందుకంటే అతనికి పిల్లనిచ్చిన మేనమామకు ఈ మేనల్లుడు సుబ్బారావుమీద మొదటి నుండీ అంత గొప్ప అభిప్రాయం లేదు.

అతగాడు బి. కాం. లో చేరాడని తెలిసినపుడు కూడా తేలికగా, "ఆ, ఈరోజుల్లో డాక్టర్లకూ ఇంజనీర్లకే అంతంత మాత్రంగా ఉంటే ఈ బి. య్యేలూ, బి. కాం. లూ ఎందుకు పనికొస్తారు?" అంటూ తీసిపారేశాడు.

ఆ ధోరణి ఆయన అక్కగారు, అంటే సుబ్బారావు తల్లికి ఎక్కడ లేని రోషం కలిగించింది. "పోనీలే నాయనా! వాడికేం, మగపిల్లాడు. వాడి కున్నదేదో వాడికి చాలు' అంది తనకొడుకు మగవాడన్న విషయం, వాడికి కొంత ఆస్థి ఉన్నదన్న విషయం గుర్తు వచ్చేలా.



అయితే అప్పట్లో అతడి మగతనం, ఆ ఆస్తీకూడా తన ముద్దుల కూతురికి మొగుడయ్యేందుకు తగిన అర్హతలుగా ఆయనకి కనిపించలేదు.

పోతే, బి. కాం. అయిన మూడే మూడు నెలల్లో సుబ్బారావుకు ఉద్యోగం రావడం, అదీ బ్యాంకులో గుమస్తా ఉద్యోగం రావడం అందరితోబాటు ఆయనకు కూడ ఆశ్చర్యం కలిగించింది. పెళ్లికొడుకుల కోసం అప్పటికే ఆయన చేసిన ప్రయత్నాల్లో బ్యాంకు గుమస్తా విలువేమిటో బాగా తెలిసింది. పదిసార్లు ఇంటిచుట్టూ తిరిగి పదివేల కట్నంతో ఆయన మేనల్లుణ్ణి అల్లుడుగా పొందగలిగాడు. మొదటినుండీ తల్లీ కొడుకులు మోజుపడిన సంబంధమే కనుక ఎక్కువ బెట్టు చేయకుండానే వాళ్లు ఒప్పుకున్నారు. ఇవన్నీ అతను నాతో చెప్పిన విషయాలే.

పెళ్లికిముందు సుబ్బారావు ఆనందంచూసి నేను చాల సంతోషించాను. అతను బ్రహ్మచారిగా ఉన్న కొద్ది రోజులలోనూ మా కిద్దరికీ మంచి స్నేహం కుదిరింది. అతను వయసులో నాకంటే చిన్నవాడయినా ఆ వ్యత్యాసం మా స్నేహానికి ఏవిధంగానూ అడ్డం రాలేదు. అనేక విషయాలు నాతో చర్చిస్తూండేవాడు. యించుమించు ప్రతి ఆదివారం మా ఇంటికి వచ్చేవాడు. నా భార్యకూడ వచ్చినప్పుడల్లా అతణ్ణి భోజనానికి ఉండమని బలవంతంచేసి ఆదరిస్తూండేది. అతని అమాయకత్వం నిష్కల్మషంగా మాట్లాడే తీరు నన్ను బాగా ఆకర్షించేవి.

కొత్తగా కాపురం పెట్టిన రెండురోజులకే సుబ్బారావు సతీ సమేతంగా మా ఇంటికి వచ్చాడు. పెళ్లికి మేము వెళ్లలేకపోవడంవల్ల అదే ఆమెను చూడటం. ఆమెను చూసిన తర్వాత మరోసారి సుబ్బారావు అదృష్టాన్ని అభినందించకుండా ఉండలేకపోయాను. ఆమె రూపంలో అందగత్తె మాత్రమే కాదు చక్కటి వినయం, మాటల్లో తెలివితేటలూ, సంస్కారం — ఎవరికైనా ఆమెపట్ల మంచి అభిప్రాయాన్ని కలుగజేస్తాయి.

కొద్ది నెలలుగడిచిపోయాయి. అన్నాళ్లూ నేను ప్రత్యేకంగా గమనించకపోయినా, సుబ్బారావు ఉండవలసినంత ఉత్సాహంగా ఉండటంలేదని నాకే ఒకటి రెండు సందర్భాలలో తోచింది. మనిషిలో కొంత పరధ్యానం, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లుండటం మొదలైంది.

ఒక రోజున అన్నాను వెటకారంగా, "ఏమి టోయ్! కొత్త పెళ్లికొడుకువి. అలా "డీలా" పడి ఉంటున్నావేమిటి? అప్పుడేమీ సమాధానం చెప్ప కుండా నవ్వి ఊరుకున్నాడు. తరవాత సాధ్యమైనంత సహజంగా ఉండటానికి అతను ప్రయత్నించేవాడు.

ఒక రోజున మేమిద్దరమే నడుచుకొంటూ షికారుగా చాల దూరం వెళ్లాం. పిచ్చాపాటీ మాట్లాడుకొంటున్నాం. ఏదో మాటల ధోరణిలో అడిగాడు, "గురువుగారూ, ఏదైనా సినిమాలోగానీ, నిజంగాగానీ అందమైన ఆడవాళ్లను చూసినపుడు మనకు రకరకాల ఆలోచనలు కలుగుతాయి గదా! స్నేహితుల మధ్యనయితే మనం అటువంటి విష యాలు దాచుకోం కూడా. ఫ్రీగా మాట్లాడు కుంటాం. ఈ విషయంలో ఆడవాళ్ల తత్వాలు ఎలా ఉంటాయంటారు? ఎవరైనా అందమైన మగాళ్లను చూసినపుడు వాళ్లెలా 'ఫీల్' అవుతారు? మనంత విశృంఖలంగా వాళ్ల ఆలోచనలు కూడా పోతాయంటారా?"

చాలా పెద్ద ప్రశ్న అడిగాడు. ఆ విషయంలో నా పరిజ్ఞానం సంగతి ఎలా ఉన్నా అతనికి అప్పుడు అటువంటి సందేహం రావడం నా కాశ్చర్యం కలిగిం చింది. నాకు కావలసిన జవాబేదో అతని ప్రశ్న చెప్పినట్లనిపించింది. అతనికి సూటిగా సమాధాన మివ్వకుండా, "అయితే మగాళ్లందరూ ఒకేలా ప్రవ ర్తిస్తారని ఎలా చెప్పగలవు? అందమైన ఆడవాళ్లను చూసినంత మాత్రాన అందరూ చలిస్తారనుకోవడం పొరపాటు. అలాగే ఆడాళ్లలోనూ అన్ని రకాలవాళ్లూ ఉంటారు. 'జనరల్'గా ఏదీ చెప్పలేం. అంతా వ్యక్తిగతం" అన్నాను.

"పోనీ అదలా ఉంచండి. మన సంగతే తీసు కోండి. మనం ఏమీ చెడ్డవాళ్లం కాము. కాని ఏదో ఒక సందర్భంలో మనకు పర స్త్రీ వ్యామోహం కలగటంలేదా? అంతమాత్రం మానసిక బలహీనత కూడా లేనివాళ్లు ఎందరుంటారు?"

తన ప్రశ్నల స్వరూపం ఇదమిద్ధంగా తేల్చ కుండా ఏదో చర్చించాలని చూస్తున్నాడు. ఏదో సమాధానం యివ్వాలిగనుక, "ఆ మాత్రం బలహీనత ఉన్నా మనం చెడ్డవాళ్లం కాదనేగదా నీ ఉద్దేశ్యం? అటువంటప్పుడు అలాంటి భావాలు ఆడవాళ్లకు మాత్రం వస్తే తప్పేమిటి?" అన్నాను. ఆ తరువాత ప్రసంగం మరొక వైపుకు మళ్లింది.

సుబ్బారావు లాంటివాడు ఈ రకం ప్రశ్న అడగటం నాకు కొత్తగానే ఉంది. అదీ చాల 'సిన్సియర్'గానే అడిగాడని నా ఉద్దేశ్యం. అంతకు ముందెపుడైనా మా స్నేహితుల మధ్య సంభాషణల్లో అటువంటి సమస్యలు వస్తే సుబ్బారావే ముందుగా సమాధానాలు చెప్పేవాడు. ఇంచుమించుగా ఒక "స్టేట్‌మెంట్" ఉపన్యాస ధోరణిలో యిచ్చి ఉండే వాడు. ముఖ్యంగా స్త్రీ పురుష విషయాల్లో, అనుభవం లేనివాడైనా తనొక 'అథారిటీ' లాగే మాట్లాడేవాడు.

"బ్రహ్మచారిగాడివి. నీకీ విషయాలేం తెలు స్తాయి?" అని ఎవరైనా నవ్వితే,

"మాస్టారూ! విషయాలు తెలుసుకోవాలంటే అన్నీ అనుభవించే తెలుసుకోవాలటండీ? విస్తృతంగా చదవటం, హేతువాదంతో ఆలోచించటం, ఇవి ముఖ్యం." అనవాడు. కుర్రవాడు బాగా చదువు కున్నా డనిపించేటట్లు.

అందుకే మా సంభాషణనుబట్టి సుబ్బారావు మనఃస్థితిని అంచనా వేయడం కష్టం. కాని అతని బాధ ఏదో చూచాయగా అర్థమైనట్లనిపించింది. బహుశా తన భార్య తనకంటె అందగత్తె కావటం వల్ల "ఇన్ఫీరియారిటీ" కాంప్లెక్స్ కావచ్చు. ఆమెకు తనకంటె గొప్పవాడెవడి మీదనయినా ఇష్టం ఉందేమోనన్న అనుమానమో లేక కలగవచ్చునన్న భయమో కావచ్చు.

కాని అతని మనోవ్యాధి అంతకంటె తీవ్రమైన దని తరవాత తెలిసింది. ఒక రోజు నేనూ, మా శ్రీమతీ, పిల్లలూ సినిమా కెళ్లాం.

సినిమా పాతది కావటంవల్ల జనం అంతగా లేరు. ఆట మొదలైన తరవాత మా వెనక వరసలో ఎవరో వచ్చి కూర్చున్నారు. గుసగుసగా మాట్లాడు కొనే మాటల్లోకూడ సుబ్బారావు కంఠ స్వరం పోల్చగలిగాను. ఇంటర్వెల్‌లో పలకరించవచ్చునని ఊరుకున్నాను. వద్దనుకున్నా వాళ్ల సంభాషణ మా చెవుల్లో పడుతోంది. ఏదో సన్నివేశంలో ఆమె, "అబ్బ! ఎంత బాగా చేశాడు?" అంది ఆ సినిమాలో హీరోని ఉద్దేశించి.

"బాగా చేశాడా? బాగున్నాడా?" అడిగాడు సుబ్బారావు.

"రెండూను" అంది ఆమె యధాలాపంగా.

"ఓహో! అయితే వాడు నీకు నచ్చాడన్న మాట. పాపం, నీకు అటువంటివాడు దొరికితే బావుండేది కదూ?"

"ఛ! ఛ! ఏం మాటలండీ? ఏదో ఏక్షన్ గురించి అంటే అదేం అర్థాలు తీయడం?"

"అర్థాలు తీయడం కాదు. అర్థాలు చెప్పడం అను. నీలాంటివాళ్ల సైకాలజీలన్నీ నాకు బాగా తెలుసు. ఏం చూస్తే ఏం అనుకొంటారో, ఎలా ఆలోచిస్తారో... ఆ! యింతకీ నీ సంగతి చెప్ప. నీకు అల్లా ఉన్నవాళ్లంటే మోజు కదూ! వాడు కాకపోతే అలాంటి మరొకడు..." పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు. ఆమెకి కళ్లనీళ్ల పర్యంత మైనట్లుంది. ఏమీ సమాధానం కూడ చెప్పలేదు.

తరవాత విశ్రాంతి సమయంలో మమ్మల్ని చూసి కొంచెం కంగారు పడ్డట్లు కనిపించాడు. మేము మాత్రం ఏమీ తెలియనట్లే పలకరించాం. ఆ అమ్మాయిని చూస్తుంటే నాకు చాల జాలేసింది. నిష్కారణంగా ఇతని అనుమాన స్వభావానికి గురవు తున్నదని బాధ పడ్డాను.

ఈ మధ్య సుబ్బారావు రోజూ మధ్యాహ్నం 'రీసెస్' టైములో ఇంటికి వెళ్లివస్తున్నాడు. సామాన్యంగా ఆ కాస్సేపట్లో మే మెవళ్లం ఇళ్లకు వెళ్లం. కొత్త పెళ్లికొడుకు భార్యమీద 'విరహం'తో వెడుతున్నాడని అనుకొన్నాం. సినిమాహాల్లో సంభా షణ విన్న కొద్ది రోజులకే ఆ కారణం కూడ తెలిసి పోయింది.

ఆ రోజు మా యింట్లో ఏదో పేరంటానికి సుబ్బారావు భార్యనీ, వాళ్లుంటున్న యింటావిడనీ పిలిచి వచ్చిందిట నా భార్య. ఇంటావిడ ఒక్కర్తే రావడం చూసి, "శకుంతల రాలేదేమండీ?" అనడి గిందిట మా ఆవిడ.

పై వారం


గలుపు నా దే


కొత్త సీరియల్

"ఆవిడను పేరంటానికి కూడ రానిస్తాడటండీ వాళ్లాయన! ఇంకా నయం. ఇంట్లో పెట్టి తాళం మాత్రం వేయటంలేదు ఇప్పటివరకూ" అంటూ ఆవిడ చెప్పిన విషయాలన్నీ ఆ రోజు రాత్రి నా భార్య ద్వారా విని నిశ్చేష్టుణ్ణయ్యాను. సుబ్బారావు అను మానం సంగతి అందరికీ తెలిసిందన్నమాట. అతడి ఆంక్షలు ఎంతవరకూ వెళ్లాయంటే రోజూ ఇంటికి వచ్చే పాలవాడితోనూ, చాకలివాడితోనూ ఎందుకలా మాట్లాడతావని తిడతాడట. ఆ ముసలి యింటా యనా, ఆయన కొడుకూ కూడ అతని దృష్టిలో దోషులే. వాళ్లెపుడైనా ఆమెను పలకరిస్తే, "నువ్వు అందరికీ చనువివ్వకపోతే వాళ్లెందుకు నిన్ను పలక రిస్తా" రని ప్రశ్నించడం. ఆ మధ్య శకుంతల పినతల్లి కొడుకు ఏదో పనిమీద ఆ ఊరొచ్చి వాళ్ల యింటికి వచ్చాడుట. అతను రైలుకు బయలుదేరి వెళ్లేదాకా సుబ్బారావు ఇల్లు కదలలేదట. ఈ వివరా లన్నీ చెప్పి ఆమె, "ఏ మాట కామాటే చెప్పకోవా లండీ! ఆ పిల్ల మాత్రం చాల గుణవంతురాలు. మొదట్లో ఎంతో తెలివిగా సమాధానం చెప్పి ఇతణ్ణి మార్చాలని చూసింది. ఆ పాటి సరసం కూడానా ఈ మనిషికి" అంటూ బాధ పడిందిట.

ఇవన్నీ విన్న తరవాత సుబ్బారావు మనస్సు యింతగా అనుమాన పిశాచాని కెందు కెర అయిందా అని ఆలోచించసాగాను. నాకు అతనితో గల సన్నిహిత పరిచయాన్ని బట్టి ఆకారణం కొంతవరకు గ్రహించ గలిగా ననుకొన్నాను.

అనేకసార్లు తను చదివిన సాహిత్యాలను గురించి చెప్పే సుబ్బారావు మాటలు మననం చేసుకొంటే జ్ఞాపకం వస్తున్నది. అతను చదువుకొనే రోజుల్లో తన రూములో ఒక స్నేహితుడితో కలసి ఉండే వాడట. ఆ స్నేహితుడు మహా శృంగార సాహిత్య ప్రియుడు. అంటే వివిధ రకాల సెక్స్ కథల పుస్తకా లతో రూము కళ కళ లాడుతుండే దన్నమాట. వద్దనుకుంటూనే ఆ కథా పారాయణం సుబ్బారావుకు కూడ అలవాటయింది. ఆ స్నేహితుడు అపుడపుడు తన అనుభవాలంటూ వశీకరణ రంగంలోని విష యాల నెన్నో వివరిస్తుండేవాడట. ఎంత తేలికగా ఆడవాళ్ల మనస్సులు హరించవచ్చో అతను చెబు తుంటే ఆ పుస్తకాలలో సంఘటనలు చదివిన సుబ్బారావుకు అదేమీ అసంభవం కాదనిపించేదట. ఆ రోజుల్లో మనిషి 'సుఖం' ఎలా అనుభవించివా





తప్ప లేదన్న సిద్ధాంతం నచ్చేదట కాని సహజమైన పిరికితనం వల్ల ఏ ప్రయత్నాలూ చేయలేదన్నమాట.

పోతే అతను చెప్పే 'థియరీ' ఏమంటే, మనిషి ఏ విషయాలు చదివినా అందులో మంచిని గ్రహించ గలిగితే ఏమీ ఫరవాలేదని, ఇప్పుడు ఆలోచిస్తుంటే అనిపిస్తోంది. చదివిన విషయంలో మంచినే గ్రహించడం, చెడును వదిలిపెట్టడం అసాధ్యం కాదేమో గాని, ఆ వయసుకు ఆచరణ సాధ్యమా ?

అవినీతిని, అక్రమ శృంగారాన్ని పచ్చిగా వర్ణిస్తున్న పుస్తకాలను ఎవరైనా ఎందుకు చదువుతారు ? దాని చివర చెప్పబడే ఒక నీతికోసమా ? మనుష్యుల ప్రవర్తనపట్ల అవి ఏర్పరచే భావాలు అందరినీ ఆ దృష్టితో చూడ్డం అలవాటు చెయ్యవా?

సందేహం లేదు. అదే బాగా చదివాడు — విచ్చలవిడి శృంగార కథలు. బావగార్లతోనూ, భర్త స్నేహితులతోనూ శృంగారం సాగించేవాళ్ళూ, పని వాళ్లతో సంబంధం పెట్టుకొనేవాళ్ళూ... అతని దృష్టిలో ఎన్ని రకాల కల్పిత పాత్రలలో యువతీ లోకం దర్శన మిస్తున్నదో! ఆ విష బీజాలు మొలకలెత్తి అతని జీవితం మీద ప్రభావం చూపుతున్నా యంటే నమ్ముతాడా? ఎలా అతని దృష్టి మార్చడం ?

ఒకసారి అతను ఆఫీసు టైములో బయలు దేరుతుంటే నేను కూడ ఏదో పని ఉన్నట్లు లేచి,

"ఎక్కడికోయ్ సుబ్బారావ్ ?" అడిగాను.

"ఇంటికే సార్" అన్నాడు.

"యీ వేళ మహ బోరుగా ఉందోయ్. నేను కూడ వస్తాను పద. మా చెల్లెలు చేతి కాఫీ రుచి చూడాలి." ఆ మాటకు అతను మామూలుగా అయితే చాల సంతోషించాలి. లేని నవ్వు తెచ్చిపెట్టుకొని, "కాఫీకి కాదులెండి. అయినా మీరు వస్తే కాఫీ కేం భాగ్యం ? రండి" అన్నాడు.

యింటికి వెళ్లడంతోనే నేను సైకిలు చైను ఊడినట్లు ఏదో సరిచేస్తూ కొంచెం వెనక ఆగాను. అతను వెళ్లి కిటికీలోనుంచి లోపలకు చూసి తరవాత తలుపు తట్టాడు. అతని భార్య వచ్చి తలుపు తీసి

కారణభూతం

లోనికెళ్లిపోయింది. నన్ను రమ్మని పిలిచి కూర్చో బెట్టాడు.

"ఇప్పుడు కాఫీ కేం ఇబ్బంది పెట్టకోయ్. మనం హోటలుకి పోదాం. నీ పని చూసుకొని వచ్చెయ్" అన్నాను.

"అలాగే" నని రెండు నిమిషాలు లోపలికి వెళ్లి తిరిగి వచ్చాడు, "రండి సార్...పోదాం..." అంటూ.

హోటల్లో కూర్చున్న తరవాత, గొంతు సవరించుకొని అన్నాను.

"సుబ్బారావ్! నిన్నొక విషయం అడగాలనుకొంటున్నాను. నీ వ్యక్తిగత విషయాలలో కలుగజేసుకొంటున్నానని ఏమీ అనుకోకపోతే అడుగుతాను."

"అదేమిటి మేస్టారూ! మీరంటే నా కెంత గౌరవమో ఎలా చెప్పను ? మీతో స్నేహం కలిగి ఉన్నందుకు నేను గర్విస్తూంటాను అడగండి" అన్నాడు.

"అయితే చెప్పు. కారణం లేకుండా ఎవరినైనా అనుమానించడం అన్యాయం కాదూ ? అవమానించడం అమానుషం కాదూ ?"

అతని ముఖం ఎఱ్ఱబడింది.

"ఏ విషయం సార్ మీరంటున్నది ?"

"ఏ కారణం వల్ల నేనుకూడ మీ యింటికి రావడానికి భయపడుతున్నానో ఆ విషయమేనోయ్."

"మీరు మా యింటికి రావడానికి భయపడుతున్నారా ? అది నిజంగా నా దురదృష్టం సార్. కలలో కూడ నాకు మీమీద ఏ అనుమానమూ లేదు" బాధపడ్డాడు.

"మరి అందరికంటె నీకు ఆత్మీయురాలైన వ్యక్తిమీద అనుమానానికి ఆమె ఏ పాపం చేసుకుందోయ్ ? సూటిగా అడుగుతున్నాను. నువ్వు ఎందుకు రోజూ అన్నిసార్లు యింటికి వెళ్లివస్తున్నావ్ ? నీ గురించి ప్రక్కవాళ్లు ఏమనుకొంటున్నారో గ్రహించావా ?"

"మేస్టారూ ! నాకేవో కొన్ని అనుమానాలున్న మాట నిజమే. కాని నేను శుద్ధ మూర్ఖుడిని కాదు సార్ ! నా కారణాలు నా కున్నాయి."

"నన్నొక ఆత్మీయుడిగా భావించి ఆ కారణాలు ఏవో చెప్పగలవా ? శకుంతలను నువ్వెంతగానో ప్రేమిస్తున్నావని నాకు తెలుసు. అంతగా నిన్నామె ప్రేమించడం లేదేమోనని నీ అనుమానం. అవునా? నువ్వు యింట్లో లేనపుడు ఆమె ఎలా ప్రవర్తిస్తుందో నన్న అనుమానం నిన్ను అనుక్షణం బాధిస్తుంది. కాదూ ?"

"ఆ విషయం నిర్ధారించుకోవటం తప్పంటారా ?" అడిగాడు.

"అనను. అసలు అలా అనుమానించడానికి ఆధారాలుండాలిగదా ?"

"నేను సైకాలజీ గురించి బాగా తెలుసుకున్నావనే అనుకొంటున్నాను మేష్టారూ ! నాకు మంచి ఉద్యోగం వచ్చేదాకా అసలు శకుంతలను యిచ్చే ఉద్దేశ్యమే లేదు వాళ్ల నాన్నకు. ఎన్నో సంబంధాలు చూశాడు. ఆమె నన్నే చేసుకుంటాననీ ఏమీ పట్టుపట్టలేదు. అటువంటప్పుడు ఆమె నన్నే ప్రేమిస్తున్నదని ఎలా అనుకోగలను ? అయినా నేను వూరకే పరీక్షిస్తున్నానుగాని ఆమెనేమీ అన్యాయం చెయ్యటంలేదుగదా ?"

"అన్యాయం చేయటంలేదా ? నువ్వు యింటి మీద సాగించే 'మెరుపు దాడు'ల ఉద్దేశ్యం ఆమె గ్రహించలేదనుకున్నావా ? నువు చేసే ప్రతీ పరీక్ష యితరుల దృష్టిలో పడుతుందని గ్రహించలేవా ?"

"ఎవరైనా ఏదో అనుకుంటారని మనస్సును సరిపెట్టుకోకుండా ఎలా వుండమంటారండీ ?"

"నీమీద ఆమె కెంత ప్రేమ వుందో ఎలా నిర్ధారణ చేసుకోగలవోయ్? నీకేదో పెద్ద సైకాలజీ తెలుసని నువ్వు అనుకొంటున్నావ్. కాని అదంతా నువ్వు చదివిన పుస్తకాలు నీలో కలిగించిన అభిప్రాయం తప్ప వేరుకాదు. నువ్వు జీవితాన్ని ఏం చూశావోయ్ ? ఏ స్త్రీ కోసమైనా నువ్వు ప్రయత్నించావా ? ఆడది అంత తేలికగా మగవాడికి లొంగిపోతుందన్న అభిప్రాయం తప్ప నీకు తెలిసిన సైకాలజీ ఏమిటో నాకు తెలీటంలేదు."

(34 వ పేజీ చూడండి)

(గత సంచిక తరువాయి)

సీరియల్

జీవనది

— పోతాప్రగడ రాజ్యలక్ష్మి —

రెండు రోజులు పోయాక పోస్టులో ఉషా, మాధవ్‌ల పెళ్ళి శుభలేఖ వచ్చింది. దాంతోపాటు ఓ చిన్న వుత్తరం, 'పెళ్ళికేనా వచ్చి ఆశీర్వదిస్తే సంతోషిస్తా'నని. జీవంలేని నవ్వు ప్రభాకరం పెదవులమీద కనిపించి మాయం అయింది. లీల వుద్వేగంతో "ఏవిటిది అన్నయ్యా! ఉష ఎవరినో పెళ్ళి చేసుకోవడం ఏమిటి? ఉష మళ్ళీ మా వదిన అవుతుందని నేనిన్నాళ్ళూ వువ్విళ్ళూరుతూంటే యిలా అయిందేవిటి? నువ్వు ఉషని వద్దన్నావా, ఉష నిన్ను వద్దందా?" అంది. "ఇలా జరగడానికి నేనేలే కారణం. వివరాలు తర్వాత చెప్తా" అని అప్పటికి అది సర్దేశాడు ప్రభాకరం.

ఉష దగ్గర్నుంచి వచ్చిన వుత్తరం, శుభలేఖా చూసేసరికి మతిపోయింది మురళికి. ఈ మాధవ్ ఎవరు? ఉషకి అతనితో పెళ్ళేమిటి, పెళ్ళి అయిన వారం పదిరోజులకి యూరోప్ వెళ్ళిపోవడం ఏమిటి, అతనితో కలిసి? ఏవిటిదంతా? ప్రభాకరం ప్రస్తావన లేదేమిటి ఈ వుత్తరంలో? 'అన్నయ్యా! నా పెళ్ళికి వదిన్ని తీసుకుని వెంటనే వచ్చెయ్యి. పెళ్ళయ్యాక మేం ఇండియాలో వారం పదిరోజుల కంటే వుండం. ఆ పదిరోజులూ అయినా నేనూ, వదినా నువ్వూ అందరం సరదాగా వుండాలి ...' అని రాసింది. ఇప్పుడు చెల్లాయి పెళ్ళికని పౌరుషం ఎక్కడ చంపుకొని లీలని తీసుకురాను ... ఒకవేళ వెళదాం అన్నా ఢిల్లీ వెళ్ళి తీసుకురావడానికి టైం లేదే!

ఇలా మురళి ఏక గుంజాటన పడుతున్న సమయంతో 'ఒక ముఖ్యమైన పని వుంది. వెంటనే రావలసింది' అని ప్రభాకరం దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది. ఇదీ బాగానేవుంది. అసలు ఉష పెళ్ళి యిలా ఎందుకు అవుతోందో, అతనికేమైనా తెలుసేమో వాకబు చేసినట్లూ వుంటుంది, అతన్ని కూడా విశాఖపట్నం పెళ్ళికి తీసికెళ్ళినట్లూ వుంటుందని, తను పని చేస్తున్న స్కూల్ ఆఫ్ ఆర్ట్సుకి శలవుచీటీ పంపించి రైలెక్కాడు మురళి.

ప్రభాకరం యింట్లో అడుగు పెడుతూండగానే, హాల్లో తొట్టెలో పడుకున్న పసివాడు తన బోసినవ్వుతో మురళిని పలకరించాడు. ఆ చంటాడు ముద్దొచ్చి, చటుక్కున మురళి వాడిని ఎత్తుకున్నాడు. ఆ సంఘటనని మేడమీంచి దిగివస్తూ చూసిన ప్రభాకరం, "ఏం మురళీ! ఆ బాబు ముద్దొస్తున్నాడా? యిదేనా, రావడం?" అంటూ పలకరించాడు.

"అవునోయ్! ఎవరబ్బాయి?"

"ఎవరబ్బాయేమిటి మీ అబ్బాయే!"

మురళి ఏదో అనబోయాడు. లోపలి గది లోంచి వస్తూన్న లీల కనిపించి ఆగిపోయాడు. ఇన్నాళ్ళకి మురళి కనిపించినందుకూ, ఆ కనిపించడం కూడా కొడుకుని ఎత్తుకుని మరీ కనిపించినందుకూ, చెప్పలేని సంతోష భారంతో లీల కళ్ళు రెండూ చెరువులయ్యాయి. ప్రభాకరం, లీలనీ మురళినీ ఒక చోట చేర్చి కబుర్లుచెప్పి ఎలాగైతేనేం సాయంత్రం అయేటప్పటికి, వాళ్ళమధ్య పొరపొచ్చాలు లేకుండా చేశాడు.

"ఎల్లుండే ఉష పెళ్ళి. మనం వెళ్ళొద్దూ!" అన్నాడు మురళి.

"ముందు రేపు నీ పెళ్ళి కానియ్యవోయ్! ఉష పెళ్ళికి రేపు సాయంత్రం బయలుదేరి వెళ్ళొచ్చు" అన్నాడు ప్రభాకరం.

అన్నప్రకారం మర్నాడు వుదయం తన హాల్లో సింపుల్‌గా లీలా మురళీ పెళ్ళి జరిపించాడు ప్రభాకరం.

వళ్ళో పిల్లాడితో పెళ్ళి పీటల మీద కూర్చో డానికి లీల సిగ్గుపడింది... "ఇప్పుడీ పెళ్ళి ఏమిటోయ్!" అంటూ విసుక్కున్నాడు మురళి... "మాట్లాడడానికి వీలులేదు... ఇద్దరూ నేను చెప్పినట్లు వినవలసిందే... కానియ్యండి శాస్త్రుర్లుగారూ— మంత్రాలు కానియ్యండి" అన్నాడు ప్రభాకరం...

"పెళ్ళి మంత్రాలా, బారసాల మంత్రాలా?" అని మనస్సులో ఓ మారు అనుకుని నవ్వుకున్నాడు శాస్త్రుర్లు — అలా ఒక్క శాస్త్రుర్లే కాదు, రావుడూ, సీతాలూ, వంటావిడతోసహా మొత్తం ఆ ఇంట్లోనూ హాస్పటల్‌లోనూ పని చేస్తున్నవారంతా అనుకున్నారు, ఒక్క జానీ తప్ప.

మురళీ లీలా పెళ్ళి అయ్యాక, ఆ సాయంత్రమే ఉష పెళ్ళికి బయలుదేరాలి అనుకున్నారంతా. కాని ఆ మధ్యాహ్నానికే జోగమ్మకి ఎక్కువయి, సాయంత్రం సూర్యాస్తమయం అవుతూన్న సమయంలో, దూరాన్నుంచి వేణుమాధవస్వామి గుళ్ళో గంటలు వినిపిస్తూండగా, భర్త సంపాదించిన ఆ ఆస్తినీ, ఇంటినీ, కంటికి రెప్పలా పెంచుకొన్న కొడుకునీ, కొడుకు పెళ్ళి చూడాలని హృదయంనిండా పరుచుకున్న కోరికనీ, సర్వస్వాన్నీ, విడిచి వెళ్ళిపోయింది.

"అమ్మా" అంటూ పసివాడిలా తల్లి శవం మీద వాలిపోయాడు ప్రభాకరం... అందరి మనస్సులూ వికలం అయిపోయాయి.

ఇప్పుడు ఏమిటి చెయ్యాలి?... ఉష పెళ్ళికి వెళ్ళడమా, మానడమా?... ప్రభాకరానికి ఈ కష్టంలో తోడుగా, పోనీ, లీలని వదిలేసి తను ఒక్కడేనా వెళితే... తనూ వెళ్ళకపోతే ఉష బాధ పడదూ?... కాని ఇంత కష్టంలో ప్రభాకరాన్ని వదిలేసి చెల్లెలు పెళ్ళికంటూ తను మాత్రం వెళ్ళడం ఎలా?...

మర్నాడు ఉదయం శ్మశానంలో జోగమ్మ శవం కాలుతూ ఉండగా, ప్రభాకరం వెన్నుమీద చెయ్యివేసి "ఏం చేస్తాం ప్రభాకరం బాధ పడకు" అంటూన్నప్పుడు మురళి గొంతు గద్గదికమైంది. వెంటనే, ఈ పాటికి విశాఖపట్నంలో చెల్లెలి పెళ్ళి అయిపోయి ఉంటుంది అనే ఆలోచన వచ్చి, పెళ్ళికి వెళ్ళలేక పోయామే అనే బాధతో మనస్సు విలవిల్లాడిపోయి, కళ్ళల్లో నిలిచిన నీటిని గోళ్ళతో మీటుకున్నాడు మురళి...

అక్కడ ఎప్పుడో జోగమ్మగారు తనకిచ్చిన పాల పిట్ట రంగు జరీచీర కట్టుకుని పెళ్ళిపీటల మీద విచారంగా కూచున్న ఉష "చూశావా మాధవ్... ప్రభాకరం రాలేదు. సరే... మా అన్నయ్య కూడా రాలేదు చూడు పెళ్ళికి" అంటూ కన్నీళ్ళు పెట్టు

జరిగిన కథ 14: భద్రయ్యగారి పిల్లలు మురళి, ఉషలు. భద్రయ్యగారి ఆస్తంతా దాన ధర్మాలతో హరించిపోయింది. భద్రయ్యగారి కుటుంబాన్ని కనిపెట్టి వుండమని కొడుకు ప్రభాకరానికి చెప్తారు జోగమ్మగారు. ఉషని చెరచ ప్రయత్నిస్తాడు అంకరాజు. భద్రయ్యగారు మరణిస్తారు. ఢిల్లీ చిత్ర కళా ప్రదర్శనలో బహుమతి సంపాదిస్తాడు మురళి. ఉషని మద్రాసులోని ఆంధ్ర మహిళా సభలో చేర్పిస్తాడు ప్రభాకరం. దొడ్డమ్మ జోగమ్మగార్ని చూడాలని వస్తుంది లీల. మురళితో కలసి విహార యాత్రలకి బయల్దేరుతుంది లీల. పెళ్ళనే తంతు లేకుండానే దంపతు లౌతారు లీల మురళిలు. మెడిసిన్ పూర్తయ్యాకే పెళ్ళి అన్న ప్రభాకరం అంటే యేవగింపు కలుగుతుంది ఉషకి. లీల మురళిలను చూడాలని వచ్చిన ఉష, ప్రభాకరాన్నీ కలుస్తుంది. ప్రమాదవశాత్తు మేడమీదనుంచి పడిన జోగమ్మగారి వెన్నెముక దెబ్బతింటుంది. ప్రభాకరం సహాయాన్ని తిరస్కరిస్తుంది ఉష. తల్లి కాబోతున్న లీల, తండ్రి దగ్గరికి వెళ్ళిపోతుంది. ప్రొఫెసర్ గురుమూర్తిగారి బావమరది మాధవ్‌తో పరిచయ మవుతుంది ఉషకి. ఉషా మాధవ్‌ల పరిచయం పెళ్ళివరకూ వెళుతుంది. తను ఉషా పెళ్ళి చేసుకోబోతున్నట్లు ప్రభాకరానికి చెప్తాడు మాధవ్. తనను మురళితో కలపమని ప్రభాకరాన్ని కోరుతుంది లీల.

కుంటే, "ఛ... పెళ్లిలో ఏడవకూడదు" అంటూ కండువాతో కళ్ళు తుడిచాడు మాధవ్. తుడుస్తూ, "ఊళ్ళోలేని మీవాళ్ళు సరే, యిన్నిమార్లు వెళ్ళి బతిమాలివస్తే, ఊళ్ళో వుండి మా అక్కయ్యా బావా రాలేదు చూడు ... రాధని చేసుకోలేదని కోపం. ఎవరు రాకపోతే ఏం? మన పెళ్లికి మనమే పెద్దలం. అదిగో నీ ఫ్రెండ్సు అంతా వచ్చారుగా? వాళ్ళే పెళ్లివారు..." అంటూ వూరుకోబెట్టాడు. పెళ్లి అయినతర్వాత హౌస్ సర్జన్ పూర్తిచెయ్యకుండా అతనితో ఫారిన్ వెళ్ళి పోడానికి నిశ్చయించుకుంది ఉష.

ప్రపంచం అంతా చీకటైపోయినట్లూ, తన సర్వస్వాన్నీ కోల్పోయినట్లూ, విచారంగా బాధగా విరక్తిగా, ఎక్కడ కూచున్న వాడక్కడే కూచుంటూ, ఎటు చూస్తున్నవాడటే చూస్తూ ప్రభాకరం వెర్రివాడిలా వుంటూవుంటే. అతన్ని చూడలేక కడుపు తరుక్కుపోతే, రహస్యంగా కన్నీళ్ళు కారుస్తూ, ఇటు యింట్లోనూ అటు హాస్పటల్‌లోనూ మొత్తం అంతా అన్ని పనులూ తనే పురమాయించి నిర్వహించసాగింది జానీ.

కొత్తకనక ఏం చెయ్యాలో తెలియక మురళీ లీలా కూడా ప్రతిదానికీ జానీ సలహాయే తీసుకుని ఆమె చెప్పినట్లే చేసేవారు.

జోగమ్మ పోయిన మూడోరోజున విశాఖపట్నం వెళ్ళి ఓమారు చెల్లెల్ని చూసివస్తానన్నాడు మురళి. కాని జానీ "ఈ స్థితిలో డాక్టరుగారిని వదిలి వెళతారా? ఈ పదిరోజులూ కానియ్యండి. తర్వాత ఆయన్నికూడా తీసుకుని ముగ్గురూ వెళ్ళి, వాళ్ళు ఫారిన్ వెళుతూన్నప్పుడు 'సెండాఫ్' యిచ్చిరావచ్చు. పైగా యిప్పుడు మీరు వెళితే కొత్త పెళ్లికూతురు భర్తతో సరదాగావున్న సమయంలో, జోగమ్మగారి మరణవార్త చెప్పి ఆ అమ్మాయి మనస్సు కలత పెట్టడమేకదా! వాళ్ళింక ఫారిన్ వెళుతూండగా తెలిసినా ఫరవాలేదు. మీతో కలిసి అలా ప్రయాణం చేసివస్తే డాక్టరుగారుకూడా కొంచెం బెంగ మర్చి పోడానికి వీలుంటుంది" అంది.

ఆమె సలహా, ఆ సలహా యిస్తూన్న తీరూ, చూసేసరికి మురళికి ఉష జ్ఞాపకంవచ్చి, 'ఉష కూడా సరిగ్గా సమయానికి యిలాగే తక్కువ సరియైన సలహా యిచ్చేది' అనుకున్నాడు.

జోగమ్మకి ధర్మోదకాలూ, వుత్తర క్రియలూ పూర్తిచేసి, ఆమె పోయిన పన్నెండోరోజున, ప్రభాకరం కారులో, చంటివాడినీ ప్రభాకరాన్నీ కూడా తీసుకుని మురళీ లీలా విశాఖపట్నం బయలుదేరారు.

గురుమూర్తిగారి ఇంటిముందు కారు ఆగింది. ఆయన బైటకి వచ్చి "అరే! యిప్పుడొచ్చారా? ఉషా మాధవ్, ఇప్పుడే వచ్చి "వెళుతున్నాం" అని మాకు చెప్పి, ఎయిర్‌పోర్టుకి వెళ్లారు. వాళ్ళతో ఎయిర్‌పోర్టు దాకా వెళ్ళి విమానంలో వాళ్ళని పంపించి మరీ వద్దామనుకున్నాను. కాని మాఆవిడకి కోపం వస్తుందని మానేశాను. మీరేనా చప్పున వెళ్ళండి. పాపం వాళ్ళకి సెండాఫ్ యిచ్చేవాళ్ళు ఎవరూ లేరు. విమానంలో వెళ్ళేవాళ్ళందరికీ ఎంతమందో వుంటారు అలా సెండాఫ్ యిచ్చేవాళ్ళు. కాని పాపం వీళ్ళకి..." గురుమూర్తి యింకా చెప్తూనేవున్నాడు. మురళి డ్రైవర్‌ని "తొందరగా ఎయిరోడ్రమ్‌కి పోనియ్యవోయ్" అన్నాడు.

కారు దూసుకుని వెళ్లిపోయింది.

విమానం బయలుదేరుతోందనే వార్తని మైక్‌లో చెప్తున్నారు. ప్రభాకరం యాంత్రికంగా బొమ్మలా నడుస్తూన్నా, మురళీ లీలా మాత్రం చంటాడిని తీసుకుని పరుగు పరుగున లోపలికి వెళ్లబోయారు. కాని అప్పటికే గేటు వేసెయ్యడం వల్ల ముగ్గురూ కటకటాల యివతల వుండి పోయారు.

కటకటాల అవతలగా వందగజాల దూరంలో బయలుదేరడానికి సిద్ధంగా వున్న విమానం...

"నేను వచ్చాను చెల్లాయ్!" అంటూ పిచ్చిగా అరిచాడు మురళి.

చంటాడి చెయ్యి పుచ్చుకుని "టా...టా" చెప్పించింది లీల.

నీళ్ళు నిండిన కళ్లతో కదలబోతూన్న విమానాన్ని చూస్తూ నుంచున్నాడు ప్రభాకరం.

అన్నగారి కేక వినిపించిందో!

మేనల్లుడి వీడ్కోలుకి సంతోషించిందో!

ప్రభాకరం కన్నీళ్ళు చూసి కలత చెందిందో!

అసలు ఉష దాకా ఈ కేకా, వీడ్కోలూ, కన్నీళ్లూ చేరాయో లేదో ఉషకి వీళ్లంతా జ్ఞాపకం వచ్చి హృదయం భారంగా అవుతోందో – లేక అపురూపమైన వరుడు లభించడంతో ఆనంద లోకాలవైపు ఆ విమానంలాగే హాయిగా, మెత్తగా, మధురంగా తేలిపోతోందో! ...

కనుమరుగవుతూన్న విమానాన్ని చూసి హఠాత్తుగా మురళి చెయ్యి పట్టుకుని డగ్గుత్తికతో అన్నాడు ప్రభాకరం.

రాలిన ముత్యాలు


శ్రీ సోమసుందర్

ఈ దేశవాసు లెంత
 ప్లాటోనిక కుటుంబీకులు
ఎంత నిరాడంబరులు
 భూద్యుక్ భూషణులు!

"మురళీ! ఆడదాన్ని అందుకోవడం ఎలాగో నాకు తెలియలేదు. అందిన స్వర్గాన్ని స్వంతం చేసుకోవడం నీకు అర్థంకాలేదు. ఈ విషయంలో మన యిద్దరికంటే మాధవ్ తెలివైనవాడు. స్త్రీ హృదయం, నిజమే, గాజుమేడ లాంటిది. దాన్ని అదను ఎరిగి ఆక్రమించి, అందంగా అలంకరించి ప్రమాదాలకి గురికాకుండా రక్షించుకోవడం ఎలాగో అతనికి తెలుసు. అందమైన గాజుమేడల్ని మనం అందుకోలేకపోతే మరొకళ్ళు ఆక్రమించేసి స్వంతం చేసుకుంటారు. సామర్థ్యం, తెలివీ, గడుసుదనం లేకపోతే స్వంతం చేసుకున్నా నీలాగ కొందరు పోగొట్టుకొనే ప్రమాదంలో పడతారు. గాజుమేడలో వున్నవాడు ఎంత జాగ్రత్తగా వుండాలి! తనేకాదు, యితరులు కూడా రాయి విసరకుండా, విసిరిన రాయి ఏదీ ఆ మేడకి తగలకుండా చూసుకోవాలి. అంత తెలివీ, అదృష్టం మనకి వుందా మురళీ నీకు అదృష్టం అయినా వుంది. నాకు అదీలేదు" అంటూ అక్కడే కూర్చుండిపోయాడు ప్రభాకరం.

అతని కళ్ళ చివర నిల్చిన కన్నీళ్ళలో ఎన్ని కాంతిమందిరాలు కరిగిపోయాయో!!

(అయిపోయింది)





"ఎదురులేని మనిషి"లో ఒక దృశ్యం

శ్రీధర్ బెదిరింపు - మంజు భయం

మద్రాస్‌లోని ప్రసాద్ స్టుడియోలో ఒక ఫ్లోర్‌లో, నటుడు శ్రీధర్, చేతిలో కొరడా పట్టుకుని నటి మంజుభార్గవిని బెదిరిస్తున్నాడు. చెయ్యకూడని పెద్ద నేరమేదో చేసినట్టుంది మంజుభార్గవి అందుకే "నిజం చెప్పు! ఎందుకు చేశావో ఈ తప్పు? చెప్పకపోయావో చావు తప్పదు" అంటూ కర్కశంగా పలికాడు శ్రీధర్ "నిజం చెప్పి ఆ నీచుడి చేతిలో చావడంకన్నా, నేరం ఒప్పుకుని ధర్మ ప్రభువుల ముందు నిలబడ్డం మంచిది" అంటుంది భార్గవి దీన్నిబట్టి చూస్తే, బలవంతంగా ఏదో ఒక అజ్ఞాత శక్తి ఒక పెద్ద నేరాన్ని మంజుభార్గవిచేత చేయించినట్టు బోధపడుతుంది మనకు

చేసిన నేరం చెబితే చేయించిన వ్యక్తి చంపేస్తాడు చెప్పకపోతే రాజ్యాధికారులు చంపేస్తారు. ఒకవేళ అందుకేనేమో ఇక్కడ మంజుభార్గవి కత్తితో ఆత్మహత్య చేసుకోబోతుంది కానీ శ్రీధర్ ఆవిడ్ని వారించి, 'నీ ప్రాణాన్ని సంరక్షించుకోవాలంటే, నిన్ను ఈ దుష్కార్యానికి పురికొల్పిందెవరో చెప్పు, నిన్ను మన్నించి వదిలివేస్తాం' అంటాడు భార్గవితో. ఇంతలో కట్ అన్నారు దర్శకుడు కె. ఎస్. ఆర్. దాస్.

సుందరం మూవీస్ పతాకం క్రింద మల్లెమాల సుందరరామిరెడ్డి నిర్మిస్తున్న "దొరలు–దొంగలు" చిత్రంలో న్యాయాన్ని విచారించే ఒక సైనికాధికారిగా శ్రీధర్, నేరం చేసిన ఒక నేరస్థురాలిగా మంజుభార్గవి పై సన్నివేశాల్లో అగుపిస్తారు

రంగిగా అగ్రనటి, రాణిగా కళాభినేత్రి ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో రామకృష్ణ, రంగనాథ్, నాయకులుగా నటిస్తున్నారు విజయా విడుదల చేసే ఈ చిత్రానికి కె. ఎస్ ప్రసాద్ ఛాయ, సత్యం సంగీతం, ఏ. కె. శేఖర్ కళ, మల్లెమాల కథను సమకూరుస్తున్నారు

కాఫీ గుక్కలోకి పాలసుక్క

ఓ గ్రామంలో పాలమ్ముకుని బ్రతుకుతుంటుంది జయప్రద ఒకనాడు జయప్రద ఇంటికి ఓ బిక్షగత్తె వస్తుంది. ఆ ముసలిదానికి కాసిని బిక్షం వేసి పంపిస్తుంది జయప్రద. ముసిల్ది (ఆనందంతో) పిల్లాపాపల్ని గని సుఖంగా వుండమ్మా అని జయప్రదను ఆశీర్వదిస్తుంది. ఈ మాటలు అల్లు రామలింగయ్య చెవిన బడ్డాయి. ఈ చెవితో విని ఆ చెవితో వదిలేసే మనిషి కాదు రామలింగయ్య. జయప్రదను సమీపించి "ఏం బుల్లెమ్మా! మునల్ది పిల్లల్ని కనమని సెప్పుద్ది? మొగుడు లేకుండా ఎట్టానమ్మా పాడు. ఇదుగో! సందమామలాంటి మొగుడ్ని సూసుకో" అంటాడు అల్లు రామలింగయ్య. "నువ్వు సెప్పలేదనే వూరకున్నాను" అని వ్యంగ్య ధోరణిలో బదులిస్తుంది జయప్రద. మరి అంతటితో ఆపాడా అంటే లేదు. సంభాషణాన్ని ఇలా పొడిగించాడు ఇంకా. "నువ్వూరుకున్నా, వూళ్లో బుల్లోళ్ల వూరుకోనీయరే బుల్లెమ్మా"

"అహ! ఏంచేస్తారేం?" అంటూ మొండిగా పలికింది జయప్రద.

"ముక్కుట్టుకు లాక్కుపోయి ముద్దెట్టుకుంటారు. మాంచి లగ్గం సూసి మూడు ముల్లు యేత్తారు. ఏడాది తిరక్కుండానే పిల్లను సంకనెక్కిత్తారు" అంటూ హాస్యంగా పలుకుతాడు రామలింగయ్య.

అంతవరకూ మొండిగా వున్న జయప్రద సిగ్గు ముంచుకు రాగా "ఛీపో" అంటూ బిడియంతో పలుకుతుంది. "సరే పోతాలే! కాఫీగుక్కలో ఇన్ని పాలసుక్క" అంటాడు రామలింగయ్య. ఇంతలో కట్ అన్నారు దర్శకుడు పి. సుబ్రమణ్యం. శ్రీ మాధవి ఎంటర్ ప్రైజస్‌వారి "మనిషిలో మనిషి" చిత్రంలో పై వ్యంగ్య సంభాషణం వినిపిస్తుంది మనకు. పి. చిన్నపరెడ్డి నిర్మిస్తున్న పై చిత్రంలో రంగనాథ్, ప్రభాకరరెడ్డి, రమాప్రభ మున్నగువారు ప్రధాన పాత్రధారులు.

"విప్లవం క్రిందనుంచీ రావాలేగానీ, పైనుంచీ దిగుమతి అయ్యేది కాదు. ప్రతి మనిషిలో సామాజిక స్పృహ, సామాజిక చైతన్యం కలిగినపుడు అక్కడి నుండే విప్లవం ప్రారంభమౌతుంది" అనే సందేశంతో నిర్మింపబడుతున్న చిత్రమే "మనిషిలో మనిషి". ఈ చిత్రానికి పి. సుబ్రమణ్యం దర్శకుడు.

"మనిషిలో మనిషి" చిత్రానికి సంభాషణలు వ్రాసాడొక వ్యక్తి. అతని పేరు శ్రీకాంత్. శ్రీకాంత్ చక్కటి రచనాశైలి చేయగల సమర్థుడు. పాత్రల కనుగుణంగా మాటలను చిత్రించగల వివేకి, "మనిషిలో మనిషి" చిత్రంలోని మాటలను వింటే, ఈతని హై పవర్ ఆఫ్ థింకింగ్ అర్థమౌతోంది. గ్రామీణ వాతావరణానికి సంబంధించిన పాత్రలతో నడిచే పై చిత్రంలో, ఆయా పాత్రలకు సంభాషణలు వ్రాయడంలో శ్రీకాంత్ తన ప్రతిభనంతా చూపెట్టారంటే అతిశయోక్తి కాదు.

ఇటీవల ఈ చిత్రం డబ్బింగ్ అరుణాచలం స్టుడియోలో జరిగింది. ఆరోజు అల్లు రామలింగయ్య గారి వాయిస్ డబ్బింగ్ జరుగుతుంది. తెరమీద బొమ్మవేసి అసిస్టెంట్ డైలాగులు చెబుతుంటే, ఎంతో జాగ్రత్తగా విని, ఒక్క మాటకూడా పొల్లుపోకుండా శ్రీకాంత్ వ్రాసిన మాటలను చక్కగా తగురీతిలో ఉచ్చరించారు అల్లు రామలింగయ్య. ఈ చిత్రంలో వారిదొక గమ్మత్తైన పాత్ర. చిత్రంలోని ప్రతి పాత్రతో ఈ పాత్రకు సంబంధం వుంటుంది. అంతేగాక తెరపై ఈ పాత్ర కన్పించినపుడల్లా నవ్వు పుట్టుకొస్తుంది. అలాంటి పాత్రకు ఎలాంటి డైలాగులు వ్రాస్తే బాగుంటుందో నని బాగా ఆలోచించి వ్రాసారు మాటలు శ్రీకాంత్. రామలింగయ్య శ్రీకాంత్‌గారి రచనపట్ల ఎంతో ఆనందాన్ని వ్యక్తంచేసి, చాలా బాగా వ్రాసారని నాతో అన్నారు. వారన్న మాటలు నూటికి నూరుపాళ్ళు నిజమే అన్పించింది డబ్బింగ్ చూచినపుడు.

కామెడీ వ్రాయడంలో ప్రత్యేక ఒరవడిని అనుసరించారు శ్రీకాంత్. వర్థుకున్న శ్రీకాంత్ లాంటి సమర్థులను సక్రమంగా ఉపయోగించుకుంటే సంభాషణల వావర్టీ తగ్గదు. క్వాలిటీ అంతకన్న తగ్గదు. "మనిషిలో మనిషి" విడుదలైన తర్వాత అందరూ కాకపోయినా, కొందరైనా నామాట నిజం అనక మానరు. ప్రస్తుతం శ్రీకాంత్ "కొల్లేటి కాపురం" చిత్రంలోని కొన్ని పాటలు, "పూర్ణమ్మ కథ"లో కొన్ని పాటలు వ్రాస్తున్నారు.



నవంబరులో వింత ఇల్లు-సంతగోల

రమాప్రభ సమర్పించు కరుణ చిత్ర వారి "వింత ఇల్లు – సంతగోల" చిత్రం అక్టోబరు 20 నాటికి పూర్తవుతుంది. ఇప్పటికే 3 పాటల చిత్రీకరణ కూడా జరిగింది. మిగతా 2 పాటలను కూడా అక్టోబరులో చిత్రీకరించడం జరుగుతుంది. చిత్రాన్ని నవంబరులో విడుదల చేయాలనుకుంటున్నారు నిర్మాత కమలాకరరావు, సహనిర్మాత దయానంద్.

హాస్యం ప్రధాన పాత్రను వహిస్తున్న యీ చిత్రంలో దాదాపు తెలుగు తెర కమెడియన్లు అందరూ ఏదో ఒక వింత పాత్రలో కన్పిస్తారు. విభిన్న ప్రవృత్తులు గల వింత మనుష్యుల మధ్య జీవిత మెలా సాగుతుందనే ప్రశ్నకు ప్రతీకగా నిలుస్తుంది "వింత ఇల్లు – సంత గోల" చిత్రం. ఇందులో ప్రతి ఒక్క నటుడికి ప్రత్యేక తరహా పాత్ర ఇవ్వబడింది. క్యారెక్టర్ యాక్టర్ సత్యనారాయణ వెరైటీ పాత్రలో కన్పిస్తారీ చిత్రంలో. రాజబాబు, రమాప్రభ, శరత్‌బాబు, ప్రభ, చంద్రమోహన్, జయమాలిని, అల్లు రామలింగయ్య, నాగభూషణం, శుభ, నిర్మల, జ్యోతిలక్ష్మి చిత్రంలోని ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు.

లక్ష్మీదీపక్ దర్శకత్వంలో తయారవుతున్న తొలి హాస్యభరిత చిత్రం ఇదే కావొచ్చు. దేవరాజ్ ఛాయ, శంకర్ సంగీతం, అప్పలాచార్య మాటలు, తోట కళ, వెంకటరత్నం కూర్పు, వెంకన్నబాబు ప్రొడక్షన్ నిర్వహణ చేస్తున్న ఈ చిత్రానికి తారకరామా పంపిణీదారులు.

సంగీతం మేష్టారుగా కృష్ణకుమారి

కృష్ణకుమారి ఓ వ్యక్తిని ప్రేమించింది. అతగాడుకూడా ఆమెను గాఢంగా ప్రేమించాడు. కానీ పరిస్థితుల ప్రేరేపణవల్లనో, లేక స్వయంకృతాపరాధం వల్లనో వారిద్దరి జీవితాలమధ్య అగాధమేర్పడుతుంది. ప్రియు డొకచోట, ప్రేయసి ఒకచోట కాలాన్ని గడుపుతుంటారు. కృష్ణను ప్రేమించిన వ్యక్తే మరొక స్త్రీని పెండ్లి చేసుకుంటాడు. కృష్ణకు తన ప్రియుడివల్ల ఒక పుత్రుడు పుడతాడు. అతనే శోభన్‌బాబు. తన బిడ్డడు పెరిగి పెద్దవాడు కావాలనే దీక్షతో సంగీత పాఠాలు నేర్పే ఒక మేష్టారుగా పని చేస్తుంటుంది కృష్ణకుమారి. సంగీతం మూలంగా కృష్ణకుమారికి, మంజులకు పరిచయం ఏర్పడుతుంది. సద్గుణవంతుడు శోభన్ మంజుల మనస్సును ఆకర్షించాడు. తన కళ్ళయెదుట తన కొడుకు, కోడలు పిల్ల (మంజుల) సుఖంగా కాలం గడుపుతుంటే చూచి ఆనందించాలని ఉబలాటపడుతుంది కృష్ణకుమారి. కానీ వూహించనివిధంగా శోభన్ అంతర్ధానమవడంతో కథ అంతా అడ్డంతిరుగుతుంది.



కృష్ణకుమారిని ప్రేమించి, పరిత్యజించిన ఆ వ్యక్తి ఎవరు ? ఎందుకలా చేశాడు ? మంజుల శోభన్‌ల పెళ్ళి జరిగిందా ? ఈ ప్రశ్నలకు సమాధానమే శ్రీ విజయభట్ ప్రొడక్షన్స్‌వారు నిర్మించిన రంగుల చిత్రం "గుణవంతుడు." యన్. యన్. భట్, యన్. యస్. మూర్తిగార్లు నిర్మించిన ఈ చిత్రానికి ఆదుర్తి దర్శకత్వం పెద్ద హైలైట్. మహదేవన్ సంగీతం, సత్యానంద్ మాటలు, కన్నప్ప ఛాయాగ్రహణం, జి. వి. సుబ్బారావు కళ, ఆదుర్తి హరనాధ్ కూర్పు సమకూర్చిన ఈ చిత్రం అక్టోబరులో అన్నపూర్ణ ద్వారా విడుదలౌతుంది.

జమున కూతురుగా హేమ

శ్రీ గౌతమ్ పిక్చర్స్ నిర్మిస్తున్న "ఈకాలం దంపతులు" చిత్రంలో జమున కూతురిగా హేమా చౌదరి నటిస్తోంది. భార్యాభర్తల మధ్య సమరసం, సర్దుబాటులేని కారణంగా, తాళి కట్టిన భర్తకు దూరమైంది జమున. భార్య అంతరంగాన్ని అర్థం చేసుకోలేక అనవసరంగా విడాకులిచ్చి వేదనకు గురి అవుతాడు సత్యనారాయణ. భార్యాభర్తల సంబంధం తాత్కాలికంగా తెగిపోయినా, ఒకనాడు మళ్ళీ ఆ బంధం కలుసుకునే అవకాశం వుందనడానికి నిదర్శనంగా, జమున, సత్యనారాయణలకు పుట్టిన బిడ్డే హేమాచౌదరి. విచిత్రమేమిటంటే హేమ తన కూతురని జమునకు చివరిదాకా తెలియదు. హేమ తన కూతురే అని మధ్యలో తెల్సుకున్న సత్యనారాయణ ఈ నిజాన్ని కూతురుతో చెప్పడు.

తల్లీ, తండ్రీ వుండికూడా ఎక్కడో పెరుగుతుంది హేమ. ప్రేమ, భక్తి, గౌరవం అనే సద్గుణాల నలవరచుకుంటుంది. చివరకెలాగో తండ్రిని చేరుకుంటుంది. కానీ అతనే తన తండ్రి అని హేమకు తెలియదు. తండ్రి చెప్పడు. ఇలా అడుగడుగునా ఆసక్తిని కల్గించే సన్నివేశాలతో నిండిన చిత్రమే "ఈకాలం దంపతులు."

యన్. రామబ్రహ్మం నిర్మిస్తున్న యీ చిత్రానికి డి. వి. నరసరాజు మాటలను, సత్యం సంగీతాన్ని, పి. భాస్కరరావు కెమెరాను, కృష్ణారావు కళను, బి.కందస్వామి కూర్పును సమకూరుస్తున్నారు. ఈ చిత్రంలో రావికొండలరావు, మిక్కిలినేని, సి. హెచ్. కృష్ణమూర్తి, ఎం. పి. ప్రసాద్, గోకిన రామారావు, మురళీమోహన్ ముఖ్య పాత్రధారులు. డి. యోగానంద్‌గారి దర్శకత్వంలో రస



"ఆడవాళ్ళు అపనిందలు"లో కృష్ణంరాజు, శుభ

వత్తరంగా తయారౌతున్న యీ చిత్రానికి వెంకటరత్నం నిర్వహణ.

డిశంబరు నుంచి జ్యోతి

శ్రీ అన్నపూర్ణ సినీ ఎంటర్‌ప్రైజస్ పతాకం క్రింద క్రాంతికుమార్ నిర్మిస్తున్న పూర్తి అవుట్‌డోర్ చిత్రానికి "జ్యోతి" అనే పేరు పెట్టారు. డిశంబరునుంచీ ఈ చిత్రం షూటింగ్ వుండగలదని తెలుస్తోంది. చిత్రానికి "జ్యోతి" అనే పేరు ఎందుకు పెట్టారని క్రాంతిగార్ని అడిగాను. "తన జీవితం విషాదమైనా, తనవారి జీవితంలో వసంతం విరియాలని, ఎన్నో త్యాగాలను చేసిన ఒక స్త్రీ కరుణామయ గాధే చిత్ర మూలకథ. మైనపొత్తి తాను కరిగిపోతున్నా, కర్పూరం తాను దహించుకుపోతున్నా, తమ పరిసర ప్రాంతాలకు వెలుగునెలా ప్రసరింపచేస్తాయో, అలాగే ఓ స్త్రీమూర్తి తన బ్రతుకులో నిప్పులు కురిసినా, మరొకరి బ్రతుకులో నవ్వులు చిందాలని అడుగడుగునా ఆత్మత్యాగానికి పూనుకుంటుంది. అందుకే చిత్రానికి "జ్యోతి" అనే పేరు పెట్టాం అన్నారు నిర్మాత క్రాంతికుమార్.

జ్యోతి పాత్రకు జయసుధను ఎన్నుకున్నారు. కవిత (లక్ష్మణరేఖ) పాత్రలో జయసుధ జయించిందనే చెప్పాలి. జ్యోతి పాత్రతో ఆ జయాన్ని మరింత పటిష్టం చేసుకుంటుందనడానికి వీలుగా ఆ పాత్ర మలచబడింది. కనిపించే నవ్వుతో, కనిపించని వేదనను కడుపులోనే దాచుకుని కృంగిపోయే వ్యక్తిగా సత్యనారాయణ ఈ చిత్రంలో కన్పిస్తారు. రావుగోపాలరావు, మురళీమోహన్, గిరిబాబు చిత్రంలోని తదితర ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు.

షూటింగ్‌కు ముందు పాటల రికార్డింగ్ చేయాలనే ఆలోచనలో వున్నారు క్రాంతికుమార్. సత్యానంద్ మాటలు, చక్రవర్తి సంగీతం, విన్సెంట్ ఛాయాగ్రహణం సమకూర్చే ఈ చిత్రానికి కె.ఎస్.పి. తనయుడు కె. రాఘవేంద్రరావు దర్శకుడు.



"తోటరాముడు"లో ఒక దృశ్యం

వీటూరికి కొత్త చిత్రం

మాటల రచయితగా, పాటల రచయితగా పేరు గడించిన వీటూరి "భారతి" చిత్రానికి ప్రధమంగా దర్శకత్వం వహించారు. కానీ దురదృష్టవశాత్తు ఆ చిత్రం ఆర్థికంగా విజయాన్ని సాధించలేకపోయింది. ఒక చిత్రం దెబ్బతిందని వర్తు వున్న వ్యక్తులను తక్కువగా అంచనా వేయడం పొరబాటు. వీటూరి దీర్ఘాలోచన చేయగల సమర్థుడు. భావయుక్తంగా, సంగీతపరంగా పాటలను మలచగల నేర్పరి. పటిష్టమైన సంభాషణలను లిఖించగల ప్రతిభావంతుడు.

ఒకసారి ఓటమి సంభవించిందని వెనకడుగు వేసే స్వభావం కాదు వీటూరిది. నమ్మకంతో నడుంకట్టి ముందుకు సాగే వ్యక్తి వీటూరి. ప్రస్తుతం శ్రీ కళామందిర్ కంబైన్స్ బ్యానరుపై వి. నారాయణమూర్తి నిర్మిస్తున్న "సత్యం—శివం—సుందరం" చిత్రానికి రచన్ను, దర్శకత్వాన్ని వీటూరే నిర్వహిస్తున్నారు. పూర్తి అవుట్‌డోర్‌లో నిర్మింపబడే ఈ చిత్రానికి చక్రవర్తి సంగీతం, ప్రకాష్ ఛాయ, వీరప్ప కూర్పు సమకూరుస్తున్నారు. అక్టోబరులో పాటల రికార్డింగ్, నవంబరు నుంచీ షూటింగ్ వుండగలదని, దర్శకుడు వీటూరి చెప్పారు. క్రొత్త, పాత తారల సమ్మేళనంతో తయారుకానున్న ఈ చిత్రం దర్శకుడిగా వీటూరి అంతస్తును పెంచాలని ఆశిద్దాం.

"నవ్నాక రచయితగా పరిశ్రమచే ప్రజలచే గుర్తింపచేసింది నా పాటలు, నా మాటలే. నేడు దర్శకుడ్ని అయ్యానే అని పాటలు వ్రాయడానికి, మాటలు కూర్చడానికి విముఖతను వెల్లడించే అవివేకిని కాను నేను. పాటల, మాటల రచయితగా పరిచయమైన నేను ఆ శాఖను వదలి కృతఘ్నుడను కాలేను. అలాగని క్రొత్త బాధ్యతలను స్వీకరించకుండా వుండను. దర్శకత్వం చేసినా, పాటలు వ్రాయడానికి, మాటలు లిఖించడానికి నేనెప్పుడూ సంసిద్ధుడనే. రచయితగా కాస్త పేరు సంపాయించుకున్న నేను దర్శకుడిగా కూడా కాస్త పేరు తెచ్చుకోవాలనుకుంటానేగానీ శాశ్వతంగా దర్శకుడ్ని అయిపోవాలనే పేరాశ నాకు లేదు." అంటారు వీటూరి. ప్రస్తుతం వీరు శ్యాంప్రసాద్ ఆర్ట్స్ పిక్చర్స్ వారి చిత్రానికి ఒక పాటను, మహేష్‌గారి "ముగ్గురు మూర్ఖులు" చిత్రానికి ఒక పాటను, చక్రపాణి ఆర్ట్స్ పిక్చర్స్ వారి "పెళ్ళికాని తండ్రి" చిత్రానికి మాటలను, జయవాణీ ఆర్ట్స్ వారి "అదృష్టవంతులు" చిత్రానికి మాటలను వ్రాస్తున్నారు.

క్షేత్రయ్య ప్రతిభ !

సెప్టెంబరు యిరవైఎనిమిదినాడు, బెంగుళూరు చాముండేశ్వరీ స్టుడియోకు వెళ్లాను.

విజయ రాఘవ నాయకుడు కవితా గోష్ఠి జరుపుతున్నాడు. ఆయన ఆస్థాన పండితులు ప్రగల్భాలు పలుకుతున్న వేళ, క్షేత్రయ్య ఒక సమస్య విచ్చి పూరించమన్నాడు. కొలువు చేరిన పండితులు పూరించలేక దిగ్భ్రమ చెందారు.

అట్టి సమయాన క్షేత్రయ్య తానిచ్చిన సమస్యను తనే పూరించాడు.

"వదరక... పో. పోవే

వద్దురా వద్దనీ" అంటూ అష్టవిధ నాయికా లక్షణాలను అభినయిస్తూ అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేశాడు.

"వదరక... పో. పోవే" అనెడి క్షేత్రయ్య పదానికి అక్కినేని ప్రదర్శించిన నవరసభరితమైన ఆంగిక అభినయం, కూచిపూడి నాట్యాచార్యుడు వెంపటి సత్యంగారినే పరవశింపచేసిందంటె, ప్రేక్షకుల ఆనందపారవశ్యం అదుపులో వుండగలదా ? క్షేత్రయ్యా, నీకు తిరుగులేదయ్యా అని ప్రేక్షకులు ఆశీర్వదించగలరు.

లక్షన్నర ఖర్చుపెట్టి, విజయరాఘవనాయకుని సభా మందిరాన్ని నిర్మించిన కళా దర్శకుడు శేఖర్ ఆనాటి రాజస వైభవాన్ని మనోజ్ఞంగా చూపెట్టారు.

కవయిత్రి రంగాజమ్మకు (విజయరాఘవుని ద్వితీయ కళత్రం) క్షేత్రయ్య సమక్షాన కనకాభిషేకం జరగడం, కవి పండితులు పాల్గొని ఆశీర్వదించడం, తండ్రిని ధిక్కరించిన మన్నారును నిరాజ్యుడ్ని చెయ్యడం, మన్నారుడి తనయుడికి జన్మదినోత్సవ సంరంభం జరపడం" లాంటి ముఖ్యమైన సన్నివేశాలను హృద్యమంగా చిత్రీకరించారు, ఘనకీర్తి వహించిన ఆదుర్తి. సంగీతం మధుర మనోహరంగా వుందనడానికి ఆదినారాయణరావు, సాహిత్యం సారస్యంగా వుండడానికి ఆరుద్ర, చిత్రం అందంగా వుండడానికి స్వామి పోటీపడి కృషి చేస్తున్నారు.

"మహాకవి క్షేత్రయ్య" వర్ణ చిత్రంలో ఎవరు ఏ పాత్రను పోషిస్తున్నారో పాఠకులకు తెలపాలిగా.

క్షేత్రయ్య : 'నటసామ్రాట్' నాగేశ్వరరావు; రంగాజమ్మ : అంజలీదేవి; విజయరాఘవనాయకుడు : కాంతారావు; మన్నారుదేవుడు : గిరిబాబు; క్షేత్రయ్య మేనత్త : రాధాకుమారి; తానీషా ; ప్రభాకరరెడ్డి; మేనమామ : ధూళిపాళ; క్షేత్రయ్య సహచరుడు : రాజబాబు; భామ : మంజుల; తారామతి : జయసుధ; క్షేత్రయ్య మేనకోడలు : ప్రభ; క్షేత్రయ్య తల్లి : హేమలత. వీరుగాక రావి కొండలరావు, సాక్షి, బగ్గారావు వున్నారు.



"అమ్మా—నాన్న"లో ప్రభ, బేబీ రోహిణి

"ఆ మొదటిరాత్రి లాగానే
ృనుంచీ అన్ని రాత్రులనూ
ర స్మృతులుగానే మలుచు
ం. ఇకముందు కూడా మన
ళ్లో ప్రతిరోజూ పున్నమినాటి
రే శాంతీ! నాకోసం నువ్వూ,
ం నేమా బ్రతకాలి. ముందు
అలాగే బ్రతుకుతాం ...
క్రితం! గుర్తుందా!"

"ఏమిటండీ!"

"అదే!ఆనాటిఇదేరాత్రిన..."

"ఇదే రాత్రిన..."

"ఓస్! అప్పుడే మర్చి
ావా? తొలిరాత్రి అనుభవాలు
ేళ్ళు జ్ఞాపకం వుంటా
ారు. ఆ నా టి రా త్రి
ికి...ఏమైంది!"

"ఛీ. పొండి! మీ చిలిపి
ాలూ మీరూనూ."

సిగ్గుతో మొహాన్ని రెండు
ులమధ్య దాచుకుంది శాంతి.
రచేతుల్ని మృదువుగా తొల
ఆమె కళ్లల్లోకి కొంటెగా
ు — చెవిలో ఏదో అన్నాడు
ోహన్.

ర్త మాటల్లోని చిలిపి
, వొళ్లంతా గగుర్పొడవగా,
ుద వాలిపోయింది.

"శాంతీ! .."



క్షామ నివారణ నిధి కోసం మంజుల భరతం

కర్పగం స్టుడియోకు వెళ్లిన వేళ, ఆదిత్య చిత్రవారి ''మనుషులంతా ఒక్కటే'' వర్ణ చిత్రం షూటింగు జరుగుతూ వుందని తెలిసింది.

సెట్లోకి అడుగు పెట్టాను. నా కళ్లకు ఒక ఫలకం కనిపించింది. ''క్షామ నివారణ నిధి'' అని రాసుంది. ఆ బోర్డువంక చూస్తున్న తరుణాన, జగన్మోహనాకారిణివలె సాక్షాత్కరించింది మంజుల.

స్టేజిమీదికి వెళ్లింది. సౌండ్ ఆన్ అన్నారు దర్శకుడు దాసరి. పాట ప్రారంభమైంది. మంజుల మనోజ్ఞంగా భరతనాట్యం చేసింది.

ఆమె భరతం చేసిన పాటలో రవ్వంత రాస్తాను.

''నిన్నే పెళ్లాడుతా, రాముడు—భీముడు;
రాముని మించిన రాముడు, పిడుగు;
రాముడు, అగ్గిరాముడు, టైగర్;
రాముడు, శభాష్‌రాముడు, నిన్నే పెళ్లాడుతా''

అనెడి జావళిని గడుసరి రాశారు. దాసరి రాసిన మొదటి పాట ''నటరత్న'' చిత్రావళి మీద గావడం విశేషం.

''మనుషులంతా ఒక్కటే'' చిత్రంలో ఎన్టీఆర్ నటన అద్వితీయమా లేక అపూర్వమా అని ప్రశ్నిస్తే, అద్భుతము అని సమాధానం వస్తుంది. జమున, సత్యనారాయణ, రమాప్రభ, నాగేష్, అల్లు ప్రధాన తారాగణం.

ప్రజాదర్శకుడు - ప్రజానటుడు కలిసిన యీ తొలి చిత్రం ప్రేక్షకుల ప్రశంసలను పొంద గలిగే అర్హతను బడసియుంది. నిర్మాతలు దుడ్డు వెంకటేశ్వరరావు, మహేష్. సమర్పకుడు రాజేంద్ర కుమార్‌కు ఘనవిజయాన్ని తేగలదు.

ప్రజల్లో మంజుల స్థానం

ఆంధ్ర ప్రేక్షకులు మంజులకు ద్వితీయ స్థానం యివ్వడానికి సుముఖంగా వున్న నిజాన్ని నా చెవులారా విన్నాను.



''దేవుడు యిచ్చిన చెల్లెలు''లో అల్లు

సినిమా

గ్లామర్ పాత్రలకు మంజుల సరితూగినట్టుగా మరెవ్వరూ లేరన్నది ప్రజా వాక్యం.

ప్రజా వాక్యం అట్టిది గాబట్టే, మంజులకు పరిశ్రమలో విపరీతమైన డిమాండు.

ప్రస్తుతం మంజుల నటిస్తున్న చిత్రాలన్నీ వర్ణ చిత్రాలే. హీరో లందరితో నటిస్తున్నదికూడా మంజులే.

''అక్కినేనితో క్షేత్రయ్య, బంగారు బొమ్మలు; నందమూరితో మనుషులంతా ఒక్కటే, దీవార్, రోటీ; శోభన్‌తో పిచ్చిమారాజు, ఇద్దరూ యిద్దరే, విజయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్, గుణవంతుడు; రామకృష్ణతో ధర్మా'' చిత్రాలలో మంజుల ముగ్ధమోహన కాంతగా నటిస్తున్నది. హీరో కృష్ణతో ''దేవుడులాంటి మనిషి'' చిత్రంలో నటించింది.

హిందీలో ఒక చిత్రం, తమిళంలో శివాజీతో మూడు చిత్రాలు మంజులకు వున్నాయి.

రోజా సగటున ఒక చిత్రం కోసం మంజులను అడగడం జరుగుతూ వుంది. అందరినీ అంగీకరించడం సాధ్యమా?

భమిడిపాటి కథలు

భమిడిపాటి రాధాకృష్ణగారి కలానికి ఒక ప్రత్యేకమైన కమ్మదనం వుంది. తన కమ్మదనాన్ని ఎక్కువగా అమ్మడం యిష్టంలేని కారణంగా, తక్కువ చిత్రాలకు మాత్రమే రాయడం జరుగుతూ వుంది.

ఈ ఏడు భమిడిపాటి కలానికి ఎక్కువ పని తగిలింది. ''వై జయంతీ మూవీస్ వారి ఎదురులేని మనిషి, అనిల్ ప్రొడక్షన్స్ వారి చిత్రం, ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి చిత్రం, రామకృష్ణారెడ్డిగారి చిత్రం, ప్రత్యగాత్మగారి చిత్రం'' యొక్క రచనా బాధ్యతను రాధాకృష్ణ స్వీకరించారు. ఇంత బిజీగా తనెప్పుడూ రాయలేదని భమిడిపాటి అన్నారు.

ప్రథమ ద్వితీయ తృతీయ స్థానం

ప్రేక్షకులు యిష్టపడేది ఎవరెవర్ని అని ఆరా తీశాను. నేను రాస్తున్న నిజం అధిక శాతం ప్రజల అభిప్రాయసారం.

హీరోల్లో నాగేశ్వరరావు, రామారావుగార్లకు మొదటి స్థానం, శోభన్‌బాబుకు ద్వితీయ స్థానం, వాణిశ్రీకి మూడవ స్థానం యిచ్చే జనం ఎక్కువ మంది వున్నారు గాబట్టే, పరిశ్రమలో నే చెప్పిన నలుగురికి డిమాండ్ ఎక్కువగా వుంది.

దర్శకుల్లో విశ్వనాథ్‌గారికి, దాసరిగారికి, బాపు గారికి పేరు ప్రఖ్యాతులు వున్నాయి.

సంగీత దర్శకుల్లో మహదేవన్‌కు మొదటి స్థానం, ఆదినారాయణరావుకు రెండవ స్థానం యివ్వడానికి శ్రోతలు సుముఖంగా వున్నారు.

ఛాయాగ్రహణ దర్శకుల్లో వెంకటరత్నం, స్వామి, జి. కె. రాముగార్లంటె ఎక్కువ అభిమానం చూపుతున్నారు, ప్రేక్షకులు.

విలన్ వేషానికి ప్రభాకరరెడ్డిని మాత్రమే పేర్కొంటున్నారు.

ప్రజల్లో సత్యనారాయణ, రాజబాబు, అల్లు రామలింగయ్యగార్లకు ప్రత్యేకమైన ఫాలోయింగ్ వుంది.

మహామనీషి లేరే

''మంచి మనిషి, మహా మనీషి, మనసున్న మనిషి'' అయిన చక్రపాణిగారు మనకు లేరే యిక.

''నిజాన్ని ముఖంమీద అనగలిగిన మనిషి, మంచిని ఆదరించే మనిషి, అన్నీ తెలిసిన మనిషి'' మనకు దూరమాయెనే.

రచనా రంగానికి, సినిమా రంగానికి, చిత్ర నిర్మాణ రంగానికి చక్రపాణిగారు ఎంతో సేవ చేశారు.



← ''గుణవంతుడు''లో శోభన్, అంజలి

18 చిత్రాలని పూర్తిచేసిన గిరిబాబు

"జగమే మాయ" చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన గిరిబాబు, "గాజుల కిష్టయ్య" చిత్రంతో పది + ఎనిమిది చిత్రాలను పూర్తిచేశాడు.

ఈమధ్య గిరిబాబును "క్షేత్రయ్య" షూటింగు సమయాన కలిశాను. "ఎలావున్నారు? ఎన్ని చిత్రాలు వున్నాయి ?" అని ప్రశ్నించాను.

గిరిబాబు నటిస్తున్న చిత్రాలు :

"వెలుగుబాటలు, వధూవరులు, ఒకమ్మాయి కథ, రాము — సోము, పెళ్లాడే బొమ్మ, పెళ్లికాని తండ్రి" చిత్రాల్లో హీరోపాత్రలను పోషిస్తున్నారు.

"మనస్సాక్షి, స్వామిద్రోహులు, ఒక చల్లని రాత్రి, జ్యోతి, సొగ్గాడు, దేవుడున్నాడు జాగ్రత్త, క్షేత్రయ్య, చిట్టెమ్మ — చిలకమ్మ, వింత ఇల్లు — సంతగోల, నందినీ ఫిలింస్ చిత్రాలలో విలన్ వేషాలను వేస్తున్నారు.

నటనలో కృషి, నడవడికలో మంచితనం, పెద్దలపట్ల గౌరవభావం వున్న గిరిబాబుకు భవిష్యత్తు బాగావుండగలదు.

లాల్‌కే పాలనే !

"నిప్పులాంటి మనిషి, అన్నదమ్ముల అనుబంధం" చిత్రాల విజయానికి ఎస్. డి. లాల్ ముఖ్య కారకుడు అని అనడంలో అబద్ధం అ[illegible]ంజం తయినా లేదు. లాల్ ప్రతిభగలవాడు అని ఏనాడో నిరూపించుకొన్నాడు. ఈనాడు ఓరకం చిత్రాలను జనరంజకం చెయ్యగల సామర్థ్యం లాల్‌కు మాత్రమే వుంది అన్నది ప్రజల్లోనూ, పరిశ్రమలోనూ ఉంది.

ప్రస్తుతం లాల్ మూడు హిట్ చిత్రాలకు దర్శకత్వం వహిస్తున్నారు. అవేమన. రవి చిత్ర (వై. వి. రావు) తలపెట్టిన "రోటీ", రాజ్యం పిక్చర్స్ (శ్రీధరరావు - లక్ష్మీరాజ్యం) నిర్మిస్తున్న "దీవార్", శ్రీ లక్ష్మీనారాయణ ఎంటర్‌ప్రైజస్ (సీతారామస్వామి, లక్ష్మణరావు) తీస్తున్న "ధర్మా."

లాల్‌కే పాలవ్ ప్రారంభమైన ఈ తరుణాన్ని ఆయన సద్వినియోగం చెయ్యగలరని ఆశిద్దాం.

రవి చిత్ర ఫిలింస్ !

సహృదయుడు, అభిరుచి వున్నవాడు వై. వి. రావుకు, రామారావుగారి సలహా సహకారాలు లభించడం యొక్క ప్రతిఫలమే గత ఏడు "నిప్పులాంటి మనిషి", ఈ ఏడు "రోటీ" రూపం అందుకోవడం జరిగింది.

"రోటీ" హిందీ చిత్రాన్ని కొన్ని మార్పులతో నిర్మిస్తున్నట్లు, వై. వి. రావు చెప్పారు.

అక్టోబరు యిరవైనాలుగు నుండి షూటింగు ఆరంభం. "నటరత్న" ముఖ్య పాత్రధారిగా, మంజుల, గుమ్మడి, ప్రభాకరరెడ్డి, రాజబాబు, అల్లురామలింగయ్య, పద్మనాభం, కాంతారావు, రాజనాల, త్యాగరాజు, శుభ, పండరీబాయి సహాయ పాత్రధారులుగా పాల్గొంటున్నారు.

రచనా విభాగానికి గొల్లపూడి, సంగీత విభాగానికి సత్యం, ఛాయాగ్రహణానికి దేవరాజ్, కళా విభాగానికి చలం, కూర్పుకు బాబు, సహకార దర్శకత్వానికి కృష్ణకిశోర్ సారథ్యం వహిస్తున్నారు. లాల్ దర్శకత్వంలో పూర్ణా విడుదల చెయ్యనున్న మరొక హిట్ చిత్రమే "రోటీ" రంగుల చిత్రం.

రాజ్యం పిక్చర్స్

ప్రజానుగుణంగా చిత్రాలను కాలపరిణామాన్ని అనుసరించి తీయగల సమర్థులు శ్రీధరరావు — లక్ష్మీరాజ్యంగార్లు.

హిందీలో అఖండ విజయాన్ని సాధించిన "దీవార్" చిత్రాన్ని రాజ్యం పిక్చర్స్ తలపెట్టడం ముదావహం. "నటరత్న"గారి అంగీకారం లభించడం నిర్మాతల అదృష్టం.



"సంతానం—సౌభాగ్యం"లో కృష్ణ, విజయనిర్మల

నవంబర్ 12 నుంచి షూటింగు ప్రారంభం. "ప్రజానటుడు" ముఖ్యపాత్రను పోషించ, అంజలీదేవి, రామకృష్ణ, మంజుల, ప్రభాకరరెడ్డి, త్యాగరాజు సహాయపడడానికి అంగీకరించారు.

"దీవార్" వర్ణ చిత్రానికి డి. వి. నరసరాజు, ఆదినారాయణరావు, చలం, శ్రీకాంత్ ముఖ్య సాంకేతిక శాఖలను నిర్వహిస్తున్నారు.

లాల్ నిర్దేశకత్వంలో "దీవార్" చిత్రం ఆల్ క్లైమ్స్ రికార్డ్సును సృష్టించగలదు, రాజశ్రీ పంపిణీ సంస్థకు.

శ్రీ లక్ష్మీనారాయణ ఎంటర్ ప్రైజస్

"కదలడు — వదలడు, చిక్కడు దొరకడు" చిత్రాలను నిర్మించిన కుదరవల్లి సీతారామస్వామి, "ధర్మా" చిత్రాన్ని తెలుగులో నిర్మించడానికి నిర్ణయించారు. ఆయనకు లక్ష్మణరావు తోడుగా నిలబడ్డారు. పూర్ణా కామరాజుగారి మద్దతు లభించింది. అక్టోబరు 9న షూటింగు ప్రారంభం.

"ధర్మా" వర్ణ చిత్రంలో రామకృష్ణ (నవీన్‌నిశ్చల్), సత్యనారాయణ (ప్రాణ్), మంజుల (రేఖ) ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. సహాయ భూమికలను రాజబాబు, అల్లు రామలింగయ్య, ప్రభాకరరెడ్డి ధరిస్తున్నారు..

రచనకు గొల్లపూడి, సంగీతానికి చక్రవర్తి, కళకు చలం, ఛాయకు దేవరాజ్, సహకార దర్శకత్వానికి దయాసాగర్ సారథులు.

లాల్ చిత్రీకరణలో "ధర్మా" చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించగలదు.

— శ్రీనివాస్

సినిమా

ప్రతిభ వున్న కొత్తనటుడు రంగారావు

"ఛైర్మన్ చలమయ్య" చిత్రంలో ప్రముఖ దర్శకుడు రామినీడుగారు రంగారావు అనే యువకుడ్ని తెలుగు తెరకు పరిచయం చేసారు. రంగారావుకు రామినీడుగారి సర్టిఫికేటుతోబాటు కొంతమంది దర్శకుల, నిర్మాతల ప్రశంసలు కూడా లభించాయప్పుడు. తొలి చిత్రంతోనే అందర్నీ ఆకర్షించిన ఈతడు వరుసగా "ముగ్గురు అమ్మాయిలు" (ప్రత్యగాత్మగారు దర్శకత్వం) "ఆడంబరాలు — అనుబంధాలు" (పి. యస్. రావ్ దర్శకత్వం) "తిరపతి" (దాసరి నారాయణరావు దర్శకత్వం) మున్నగు చిత్రాల్లో నటించి గట్టి పునాదిని సంపాయించుకున్నాడు.

విలన్ పాత్రలకు రంగారావు కరెక్ట్‌గా వుంటాడు. తూచినట్టు నటిస్తాడు. ప్రస్తుతం ఈతడు ఈ క్రింద పేర్కొన్న చిత్రాల్లో వైవిధ్యం వున్న పాత్రలను పోషిస్తున్నాడు.



"స్వామిద్రోహులు"లో రామకృష్ణ, విజయలలిత

"వయసొచ్చిన పిల్ల": ఈ చిత్రంలో ఈతని పాత్ర రెండు స్వభావాలతో చిత్రించబడింది: కోపిష్ఠి. కానీ మంచిమనిషి. "పెళ్లికాని తండ్రి": ఇతరుల డబ్బుతో జీవితాన్ని గడపాలనుకునే వ్యక్తి. నిజాయితీ లేకపోయినా, ప్రేమ విషయంలో పట్టుదలం గల మనిషి.

ఇటీవల విడుదలైన "తీర్పు" చిత్రంలో జన్మనిచ్చిన జనార్దనం పాత్రను జనరంజకంగా పోషించిన వ్యక్తి ఈతడే. విప్లవభావాలతో న్యాయం కోసం పాటుపడే పోరుడిగా రంగారావు చక్కగా నటించాడు. ప్రముఖ నిర్మాత, దర్శకుడు, రచయిత [illegible]శ్వరరావుగారు రంగారావు నటనపట్ల సదభిప్రాయాన్ని వెల్లడించారు. అందుకు నిదర్శనంగా తన అయిదు చిత్రాల్లో ముందుగానే రంగారావును బుక్ చేసారు.

ఈ మధ్య వచ్చిన కొత్త తారల జాబితాలో టాలెంట్ వున్న కొద్దిమందిలో రంగారావు పేరును సందేహం లేకుండా చేర్చుకోవచ్చు.

కూడు — గుడ్డ

"భారతంలో ఒక అమ్మాయి" చిత్రాన్ని నిర్మించిన నిర్మాతల్లో ఒకరైన తుమ్మా మల్రెడ్డి నిర్మిస్తున్న తదుపరి చిత్రానికి పెట్టిన పేరే "కూడు — గుడ్డ" మల్రెడ్డి కథకు దాసరి నారాయణరావు మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంను సమకూరుస్తున్నారు. బహుశా ఈ చిత్రం అక్టోబరులో ఆరంభమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. రాజేశ్వరరావు సంగీతం, కె. ఎస్. మణి ఛాయ; బాలు కూర్పు పై చిత్రానికి నిర్వహిస్తారు.

స్వర్గం — నరకం

ఒక సంసారం చక్కబడాలన్నా, చెడిపోవాలన్నా, ఆ యింటి గృహిణే అందుకు బాధ్యురాలౌతుంది. ఇల్లాలు పూనుకుంటే ఇంట్లో స్వర్గాన్ని సృష్టిస్తుంది. ఇల్లాలు తన కెందుకులే అని మానుకుంటే ఇల్లు నరకప్రాయం అవుతుంది. ఈ నైజాన్ని దృష్టాంతాల రూపంలో ధృవపరుస్తూ నిర్మించబడిన చిత్రమే "స్వర్గం-నరకం". దాసరి నారాయణరావు కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం నిర్వహించిన ఈ చిత్రాన్ని బి. రామతారకం సమర్పించగా, దిడ్డి శ్రీహరిరావు నిర్వహణలో మావుళ్ళయ్య, పి. యస్. భాస్కరరావులు నిర్మించారు.

ఈశ్వరరావు, జయలక్ష్మి, మోహన్‌బాబు, అన్నపూర్ణ ఇత్యాది నూతన తారాగణంతో తయారైన ఈ చిత్రానికి ప్రేక్షకులకు ప్రీతిపాత్రమయ్యే విధంగా దాసరి దర్శకత్వం అమరింది. స్వల్పకాలంలో తయారైన "స్వర్గం—నరకం" చిత్రం సుదీర్ఘకాలం ఆడడానికి తలిసిన అర్హతలను బడసివున్నది.

విభిన్న పాత్రల్లో విజయలలిత

కిశోర్ పిక్చర్స్ పతాకంక్రింద ప్రముఖ రచయిత కనకమేడల నిర్మిస్తున్న "ఒకమ్మాయి కథ" చిత్రంలో విజయలలిత విభిన్న పాత్రల్లో వెరైటీగా కన్పిస్తుంది. కుటుంబ స్త్రీగా, ప్రేమికురాలిగా, పతితగా, నర్తకిగా, హంతకురాలిగా విజయలలిత అపురూప నటన్ను ప్రదర్శించిందట.

ప్రశాంతంగా గడుపుతున్న విజయలలిత జీవితంలోకి అనుకోని సమస్యలు ప్రవేశించాయి. తత్ఫలితంగా ప్రేమికుడికి దూరమైంది. పతితగా మారింది. నర్తకిగా నాట్యం చేసింది. తన పచ్చని జీవితంలో చిచ్చులు రేపిన దుష్టశక్తులను అంతం చేయ సమకట్టి, చివరకు హంతకురాలిగా మారింది. ఆడదంటే ఆటబొమ్మకాదు, పగబడితే ఆదిశక్తిగా మారుతుందని నిరూపించింది.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, డిఫెన్స్ లాయరుగా గిరిబాబు, విలన్‌గా క్రొత్త నటుడు కె. వి. రెడ్డి నటించిన పై చిత్రంలో, మాడా, పి. వెంకటేశ్వరరావు, జయవిజయ, ఉదయలక్ష్మి, కె. వి. నాగేశ్వరరావు, రాళ్ళబండి కామేశ్వరరావు, హేమాసుందర్, మాస్టర్ కిశోర్ ముఖ్య పాత్రలను పోషించారు. కామెడీ పార్ట్‌ను రాంబాబు, రాజకుమారి భర్తీ చేసారు.

కనకమేడల వ్రాసిన "పతిత" నవల ఆధారంగా నిర్మితమవుతున్న ఈ చిత్రానికి దర్శకత్వ బాధ్యతను అతనే స్వీకరించాడు. బి. గోపాలం సంగీతం, కృష్ణశాస్త్రి, దాశరధి పాటలు, మోహనకృష్ణ ఛాయ, సోమనాథ్ కళ, దాశరధి కూర్పు నిర్వహించిన "ఒకమ్మాయి కథ" చిత్రం తుదిమెరుగులు దిద్దుకుంటోంది.

మహేష్ చిత్రానికి హేమాంబరధరరావు

"ఆంధ్రపత్రిక"లో దిన, వార ఫలాలు వ్రాసే మహేష్ లోగడ "అనగనగా ఒక తండ్రి" అనే చిత్రాన్ని ఆంధ్ర ప్రేక్షకులకు అందించారు. తన రెండవ చిత్రం తీయ నిశ్చయించి ఆంధ్రపత్రిక వారపత్రికలో సీరియల్‌గా ప్రచురించబడిన "ముగ్గురు మూర్ఖులు" కథకు తెర రూపం ఇస్తున్నారు మహేష్. ఇటీవల ఈ చిత్రం తాలూకు మొదటి పాట రికార్డింగ్ జెమినీ స్టుడియోస్‌లో జరిగింది. ఆంధ్రపత్రిక సంపాదకులు శ్రీ రాధాకృష్ణగారు మహేష్‌కు తన అభినందనలను తెలియచేసారు రికార్డింగ్ ముహూర్త సమయంలో.

వేటూరి వ్రాసిన "అందరి వాడవని పేరేగానీ— కొందరివాడవులే, అందగాడవని పేరేగాని, అందని వాడవులే" అనే పాటను చక్రవర్తి సంగీత దర్శకత్వంలో సుశీల, బాలసుబ్రమణ్యం పాడగా రికార్డ్ చేసారు జెమినీ కోటేశ్వరరావు.

కె. హేమాంబరధరరావు దర్శకత్వం నెరవుతున్న "ముగ్గురు మూర్ఖులు" చిత్రంలో ముగ్గురు మూర్ఖులుగా సత్యనారాయణ, రాజబాబు, నాగభూషణం నటిస్తున్నారు. సావిత్రి, రోజారమణి చిత్రంలో అతి ముఖ్య పాత్రల్లో కన్పిస్తారు.



మీ ముఖము చూచి
మెచ్చుకొనేవారెందరో. . మీ చర్మమునకు
మెరుపుచేసేవారూ ఉన్నారు
పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్
సహాయమును పొందండి
పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ మీ చర్మమును గాలి, దుమ్ము, వాతావరణములనుండి కాపాడుతుంది. దానిలోగల ఒక ప్రత్యేకపు హ్యూమెక్టంట్ చర్మమును తడి ఆరకుండా ఉంచుతుంది. దానివల్ల మీ ముఖము నున్నగా, జిడ్డులేకుండా ఉంటుంది. పౌడరు రాసుకొనేముందు దాన్నివాడితే దివ్యంగా ఉంటుంది. మీ మేకప్ తాజాగా, అందంగా గంటలతరబడి నిలుస్తుంది. లేదా, దాన్ని పూర్తి మేకప్‌గా వాడినా మంచిదే. జ్ఞాపకముంచుకోండి —మిమ్మల్ని మెచ్చుకొనే వారున్నట్లే, మీ చర్మమును మెచ్చుకొనేవారూ ఉండాలి.
పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్— పౌడరు రాసుకొనేముందు వాడుటకు ఉత్తమమైనది
POND'S
VANISHING CREAM
GREASELESS FOUNDATION
MADE IN INDIA

సినిమా



"మహాకవి క్షేత్రయ్య"లో అక్కినేని

సెక్రటరీ ఎప్పుడు?

సురేష్ అధినేత రామానాయుడుగారి ఆఫీసుకు గత వారం వెళ్లినప్పుడు, ఆయన టేబిల్ పైన వేల సంఖ్యలో వుత్తరాలు కనిపించాయి.

"ఇవన్నీ 'సెక్రటరి' చిత్రానికి సంబంధించిన వుత్తరాలు. రోజూ వంద వుత్తరాలయినా వస్తున్నాయి, 'సెక్రటరి' ఎప్పుడని" అంటూ కొన్ని లేఖలను చూపించారు.

అక్కినేనిగారంటె, సురేష్ సంస్థ అంటె ప్రేక్షకులకు ఎంత అభిమానమో, ఆ వుత్తరాలు తెలియచేశాయి.

ప్రేక్షకులు అత్యంతాసక్తితో ఎదురు చూస్తున్న "సెక్రటరి" వర్ణ చిత్ర నిర్మాణం డిశంబరు నుంచి ప్రారంభం అవుతుంది. "నట సామ్రాట్ — కళాభినేత్రి" జంటగా నటిస్తున్న "సెక్రటరి"ని ఒక సుందర చిత్ర కావ్యంగా రూపొందించడానికి దర్శకుడు కె. ఎస్. ప్రకాశరావు కంకణం కట్టుకొన్నారు.

ప్రేక్షకుల వూహల మేరకు "సెక్రటరి" తయారు కాగలదు

విగ్రహాల చోరం

ఇటీవల విగ్రహాల దొంగతనాలు ఎక్కువయ్యాయి. విలువైన విగ్రహం కంటబడితే మాయంచేసేస్తున్నారు కొందరు విద్రోహులు ఓ ధనవంతుడి యింట్లో వున్న సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయుల విగ్రహాల్ని ఎత్తుకువేసి ఎత్తుకు పోయిందొక ముఠా నవ్వుతూ, నమ్మకంగా తిరుగుతూ, శృతిమించిన స్వార్థంతో పై వాళ్ళ విగ్రహాల్ని తమ వశం చేసుకుందొక ముఠా సొంతదారుడ్ని అంతంచేసి ఆ విగ్రహాల్ని చేజిక్కించుకున్న ఆ వ్యక్తులెవరనుకున్నారు? రావుగోపాలరావు, త్యాగరాజ, రామదాసు, జి వరలక్ష్మి

అన్యాయంతో అంతస్తులందుకోవాలని ఉబలాటపడేవారు కొందరైతే, అన్యాయాన్ని, అక్రమాన్ని అరికట్టాలని కంకణం కట్టుకునేవారు యింకొందరు. మొదటి తెగకు చెందినవారే పై నల్గురు. ఇక రెండవ తెగకు చెందినవారెవరంటారా? ఒకరు రామకృష్ణ, రెండు విజయలలిత స్వలాభంకోసం ఆ నల్గురు విగ్రహాలు దొంగిలిస్తే, తమ స్వంత మనుష్యుల ఆత్మతృప్తికోసం ఆ విగ్రహాల్ని సంపాదించ సంసిద్ధమౌతారు రామకృష్ణ, విజయలలిత.

కుట్రదారుల కుయుక్తులు కొనసాగాయా? వారి నిజ స్వరూపాల్ని రామకృష్ణ, విజయలలిత ఎలా బహిర్గతం చేశారు? అవే సందేహాలకు సమాధానమే మార్కండేయా ఫిలింస్ వారి "స్వామి ద్రోహులు" చిత్రం.

బాబూపేట్ (వరంగల్) సమర్పించే యీ చిత్రానికి సముద్రాల జూ సంభాషణలను, హెచ్. అప్పారావు కెమేరాను, యస్. హనుమంతరావు సంగీతాన్ని, రాజేంద్రకుమార్ కళను, కందస్వామి కూర్పును సమకూర్చారు బి. ఆరోగ్యం, మిత్తిపాటి విజయకుమార్ నిర్మాతలైన ఈ చిత్రానికి కె. రవీంద్రరెడ్డి నిర్వహణ.

గిరిబాబు, రత్న, హలం, పండరీబాయి, అనూరాధ, సి హెచ్ కృష్ణమూర్తి ముఖ్య పాత్రధారులైన ఈ చిత్రం ఆంధ్రాలో భామా పిక్చర్స్ ద్వారా, సీడెడ్‌లో నటేష్ ఫిలింస్ ద్వారా విడుదలౌతుంది.

రాజబాబు ద్విపాత్రాభినయం

ఆంధ్ర ప్రేక్షకులు ఆదరించే ఆరుగురిలో హాస్యరాజు ఒకరు. నవ్వించే పాత్రలనే గాక, కరుణ రసం నిండిన పాత్రలను కూడా జనరంజకంగా పోషించగల ప్రతిభ రాజబాబుకు వుంది

రాజబాబు వైవిధ్యం వున్న రెండు పాత్రలను పోషిస్తున్న చిత్రాన్ని వెంకట్రామరాజు (తాళిబొట్టు) తలపెట్టిన విజాన్ని, ఆయన్ని రాజమండ్రిలో కలిసినప్పుడు, వెల్లడించారు

"జమిందారుగారి అమ్మాయి" చిత్రాన్ని జనరంజకంగా రూపొందించిన సింగీతం శ్రీనివాసరావు "రాజబాబు డ్యూయెల్ రోల్" చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు

క్షేత్రయ్యకు మేనకోడలుగా నటిస్తున్న ప్రభ ఒక నాయికగా నటించగలదు.

క్యారెక్టర్ యాక్టర్ సత్యనారాయణ పాత్ర విశిష్టమైనది.

హాస్యరాజు బహుపాత్రాభినయం

కరుణ చిత్ర వారి "వింత యిల్లు-సంతగోల" సెట్లో రాజబాబును కలిశాను. నే వెళ్లినప్పుడు, అయిదారుగురు ఆయన కాల్‌షీట్లకోసం వచ్చారు. ఎలాగంటి చెయ్యడం అంటూ తనవద్దనున్న డైరీని చూపెట్టారు.

ఆయన డైరీలో వున్న చిత్రాలుగాక మరో నలుగురికి చెయ్యడానికి అంగీకరించినట్టు రాజబాబు చెప్పారు.

బహు చిత్రాలలో పాత్రాభినయం చేస్తున్న రాజబాబును పెట్టుకున్న నిర్మాతలు ఎవరవ.

జగపతి, సురేష్, అంజలీ పిక్చర్స్, లావణ్య, రవీంద్రా, అరుణా ఆర్ట్స్, జానకీరామ ఆర్ట్స్, వైజయంతి మూవీస్, రవి చిత్ర, విజయలక్ష్మి ఆర్ట్స్ పిక్చర్స్, గజానన ఫిలింస్ మరియు కరుణ చిత్ర.

వేసే ఓపిక వుండాలేగాని, మరో పదిమంది రాజబాబును పెట్టుకునేందుకు సిద్ధంగా వున్నారు.



"పిచ్చిమారాజు"లో ముగ్గురు హాస్యమూర్తులు



శ్యాంప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌వారి నెం. 1 లో
కృష్ణంరాజు, జయచిత్ర

తెలుగు రంగానికి ఒకే వాంప్

తెలుగు చిత్రాలలో వాంప్ పాత్రలు పోషించే ఒకే నటి జయమాలిని. ఏ చిత్రంలో వాంప్ వేషం వున్నా, జయమాలిని పేరే వినవస్తుంది.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటె, జయమాలిని జాతకం రాచబాటలో విహరిస్తుంది.

వాంప్ ఏమిటి అని పెడముఖం పెట్టిందా, పనికాస్త గోవిందా!

— శ్రీనివాస్

మరికొన్ని యితర సినిమా వార్తలు

కోలవెన్ను వద్ద సోగ్గాడు షూటింగ్

''సోగ్గాడు లేచాడు చూచి చూచి
నీ దుమ్ము లేపుతాడు.''

అనే పాట వారంరోజులపాటు విజయవాడ దగ్గర కోలవెన్ను గ్రామంలో సురేష్ మూవీస్ వారి వర్ణ చిత్రం ''సోగ్గాడు'' కోసం సెప్టెంబర్ మూడో వారంలో చిత్రీకరించబడింది.

శోభన్‌బాబు, జయసుధ, రాజబాబు, నాగేష్, మొదలైనవారే కాక యింకా ఎనభైమంది ఈ షూటింగులో పాల్గొన్నారు. జయచిత్ర, మంజు భార్గవి, సత్యనారాయణ, అల్లురామలింగయ్య ఇతర ప్రధాన పాత్రధారులు.కథను బాలమురుగన్, కెమెరా విన్సెంట్, సంగీతం మహదేవన్, నృత్యం హీరాలాల్, మాటలు మోదుకూరి జాన్సన్, పాటలు ఆత్రేయ నిర్వహించిన యీ చిత్రానికి దర్శకుడు బాపయ్య.

దాదాపు 10 రీళ్ళు పూర్తయిన ఈ చిత్రం అక్టోబరుకల్లా షూటింగు ముగించుకుని నవంబరులో విడుదలకు సిద్ధం కానున్నదని డైరెక్టర్ బాపయ్య విలేకరులకి చెప్పారు. రామానాయుడు నిర్మించే ఈ చిత్రానికి పంపిణీదారులు నవయుగ ఫిలింస్.

గంగానదిపై ఉషోదయం

ప్రఖ్యాత కవి మీర్జాతుర్సన్‌జాదే రచించిన ''గంగా నది నుంచి క్రెమ్లిన్ వరకూ'' అన్న గీతం ఆధారంగా ''గంగా నదిపై ఉషోదయం'' అనే చిత్రాన్ని భారత — సోవియట్ దేశాలు ఉమ్మడిగా నిర్మిస్తున్నాయి. బ్లాక్‌సీ రేవు పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరిగింది.

కేటీ మీర్జా అనే హిందీ నటి యీ చిత్రంలో కథానాయిక పాత్ర ధరిస్తోంది. తన అనుభవాల గురించి టాస్ విలేఖరికివివరిస్తూ సోవియట్ ప్రజలు భారతీయులపట్ల ఎంతో స్నేహభావం కనపరుస్తారని, సోవియట్ ప్రజలు స్నేహశీలురని పేర్కొన్నారు. ఈ చిత్రం తాలూకు షూటింగ్ త్వరలో భారత దేశంలో కూడా జరుగుతూంది. కిప్లింగ్ రాసిన కథ ఆధారంగా అలెగ్జాండర్ జారెడి 'రిక్కి—టిక్కి—తావి' అనే చిత్రానికి భారత దేశంలో షూటింగు జరుపుతున్నారు. అలెగ్జాండర్ జారెడి ప్రఖ్యాత సోవియట్ దర్శకుడు.

సోవియట్ యూనియన్ భారత దేశంతోబాటు యింకా అనేక దేశాలతో చలన చిత్ర రంగంలో సహకరిస్తోందనీ, ఇటీవలనే సోవియట్ యూనియన్ 30 కథా చిత్రాల నిర్మాణాన్ని పూర్తి చేసిందనీ, యీ చిత్రాల నిర్మాణంలో అనేక దేశాలు పాల్గొన్నాయని సోవిన్ ఫిల్మ్ అధ్యక్షులు ఒలెగ్ తెనిష్విలి పేర్కొన్నారు.

సోవియట్ అమెరికాలు సంయుక్తంగా 'బ్లూ బర్డ్' చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం, ఇందులో ఎలిజీబెత్ టేలర్, జేన్‌ఫోండా, మాయా ప్లిసెట్‌స్కాయా, నజెజ్డా పావ్లోవా నటిస్తున్న విషయం పాఠకులకు తెలిసినదే. ఇది కాక, ప్రఖ్యాత ఫ్రెంచ్ చలన చిత్ర దర్శకుడు జాక్వెస్‌డెమీ దర్శకత్వంతో 'చెర్‌బోర్గ్ అంబెరిల్లా' అనే సంగీత ప్రధానమైన చిత్రాన్ని సోవియట్ యూనియన్ — ఫ్రాన్స్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. లెనిన్ ఫిలిం స్టూడియోలో యీచిత్రానికిషూటింగ్ జరుగుతోంది.

ఇటలీ — సోవియట్ యూనియన్‌ల సంయుక్త నిర్మాణంలో ''రెబిలియన్ ఆఫ్ యాన్ ఇటాలియన్ వుమన్'' అనే చిత్రం తుది మెరుగులు దిద్దుకొంటూంది. సోవియట్ యూనియన్, ఫిన్‌లాండ్‌లు కలిసి 'ట్రస్ట్' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఇది చారిత్రక చిత్రం. ఇందులో ఫిన్‌లాండ్‌కి 1917లో స్వాతంత్ర్యం ఎలా లభించిందో చూపబడుతుంది.

భారత, ఫ్రాన్స్, అమెరికా, ఇటలీ, ఫిన్‌లాండ్‌లతోబాటు సోవియట్ యూనియన్ తన సోదర సోషలిస్టు దేశాలతో కూడా చిత్ర నిర్మాణం విషయంలో సహాయ సహకారాలు అందిస్తోంది. సోవియట్ యూనియన్, యితర సోషలిస్టు దేశాల సంయుక్త నిర్మాణంలో ఇరవై చిత్రాలు తయారవుతున్నాయి. నాజీల నుంచి తూర్పు యూరప్ విముక్తిని చూపే ''ది కమ్యూనిస్ట్'' అనే పేరు గల నాలుగు భాగాల చిత్రాన్ని యూరీ ఒదెరావ్ నిర్మిస్తున్నారు. ''జెర్నీ టు ఇమ్మోర్టాలిటీ'' అనే చిత్ర నిర్మాణంలో పోలెండుతోనూ, ''మూటే జెర్కో'' చిత్రం తయారీలో హంగేరీతోనూ సోవియట్ యూనియన్ సహకరిస్తోంది. ●



''గుణవంతుడు''లో ఒక సన్నివేశం

కారణభూతం

(20వ పేజీ తరువాయి)

సుబ్బారావు మాట్లాడలేదు.

"నీచమైన ప్రవర్తన గురించీ అసహజమైన, అసభ్యమైన సన్నివేశాలను గురించీ చదివి, మనిషి నైతిక విలువల గురించి చాల తేలిక అభిప్రాయం నీలో ఏర్పడిందని నేనంటాను. లేకపోతే ఆ అమ్మాయి గురించి చెడ్డ అభిప్రాయం ఎవడికైనా కలుగుతుందా? నీ జీవితం వెలిగించటానికి దేవుడిచ్చిన వరమోయ్ ఆమె."

సుబ్బారావు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ప్రేమించని వాడు ఏడవలేదు. అనుమాన సౌధం మాటలతో కూలిపోతుందని నేను అనుకోలేదుకానీ, కల్పించుకున్న అనుమానాలు మొదట్లోనే కరిగిపోకపోతే అవే పెనుభూతాలు అవుతాయని నాకు తెలుసు. మాట్లాడటంతప్ప నేను చేయగలిగింది కూడా లేకపోవటంచేత ఉపన్యాస ధోరణిలోనే అన్నాను, "నీ ప్రవర్తనవల్ల ఆమె ఎంత అవమానం సహిస్తోందో తలచుకొంటే నిన్ను క్షమించకూడదని పిస్తోంది. జీవితంమీద ఆమెకున్న ఆశల్ని విశ్వాసాన్ని నువ్వు నాశనం చేస్తున్నావు. నీ తప్పు నువ్వు ఆలస్యంగా తెలుసుకొంటే ఆమె కోల్పోయిన ఆనందాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ తిరిగి యివ్వగలవా? ఆఖరుగా ఒక విషయం చెపుతున్నాను. నాకు తెలిసిన ఒక మహానుభావుడు తన అనుమానాలతో భార్యను నిరంతరం వేధించేవాడు. ఆ బాధలు పడలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఆ తరువాత ఆయనపడ్డ ఆవేదన చూసి హృదయం ద్రవించేది. ఇప్పటికే ఆలస్యం కాకపోతే యికనైనా నువ్వు మారాలని నా కోరిక. మా చెల్లెల్ని సంతోష పెట్టడం నీ బాధ్యత."

మాటలు రానివాడిలా కూర్చుండిపోయాడు సుబ్బారావు. కాస్సేపుండి "వస్తాను సార్" అంటూ యింటికెళ్ళిపోయాడు.

మర్నాడుదయం ఆఫీసులో సుబ్బారావు నెల్లాళ్ళ శలవు పెట్టాడని తెలిసింది. నాకు కొంచెం ఆందోళన కలిగింది. సుబ్బారావునీ, శకుంతలనీ ఆనందమైన జంటగా చూడాలన్న నా కోరికతో నేనే బాధ్యత తీసుకొని కొంచెం తీవ్రంగానే మాట్లాడానేమో! సాయంత్రం మేమిద్దరం వెళ్ళి ఒకసారి చూసిరావాలనుకొన్నాను.

కాని నేను వెళ్ళనవసరం లేకపోయింది. సాయంత్రం యింటికెళ్ళేసరికి సుబ్బారావూ శకుంతలా మా యింట్లోనే వున్నారు.

"మీ సుబ్బారావుగారూ శకుంతలా కొన్నాళ్ళపాటు వూళ్ళు తిరిగి వస్తారటండీ! మీతో చెప్పిపోదామని వచ్చారు" అంది మా ఆవిడ. శకుంతల సిగ్గుపడుతూ నిల్చునివుంది.

నా మనస్సులోనే వాళ్ళిద్దరినీ ఆశీర్వదించాను.


మురళీకృష్ణా ఎంటర్‌ప్రైజెస్
బుచ్చోడి పెళ్ళి
దర్శకత్వం: కె.యస్.రెడ్డి
నిర్మాత: కె.మురళీకృష్ణ
SUVARNA
ఆంధ్ర : శ్రీ బాలాజీ ఎంటర్‌ప్రైజెస్, విజయవాడ (శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలు మినహా) ★శ్రీకాకుళం, విశాఖపట్నం : సోమనాథ్ కమ్మర్షియల్ కార్పొరేషన్, చోడవరం ★సీడెడ్ మైసూరు: నటేశ్ ఫిల్మ్ఎక్స్చేంజ్, బళ్ళారి. ★నైజాం : సౌజన్యఫిలిమ్స్ ★ఒరిస్సా శ్రీ భవానీ శంకర్ ఫిల్మ్స్, ఖర్గపూర్.

హైదరాబాద్ నోట్ బుక్

సంస్కృత భాషకు ప్రోత్సాహం

కేంద్ర విద్యాశాఖ ఉపమంత్రి శ్రీ డి. పి. యాదవ్ ఆంధ్ర యువతీమండలి ఆవరణలో సెప్టెంబర్ 21 వ తేదీన అష్టాధ్యాయి సరళతమ సంస్కృత ప్రచార సమితి నవమ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ, ఐదవ పంచవర్ష ప్రణాళికలో సంస్కృత భాషా వ్యాప్తికి ఆరు కోట్లు కేటాయించ బడ్డాయనడం హర్షదాయకమే. కాని ఈ విషయంలో సంస్కృత విద్యార్థిగా నా వినీతవిజ్ఞప్తి ఒకటి ఉన్నది. సంస్కృత పాఠశాలలకు, సంస్కృత విద్వాంసులకు ఏదో దానధర్మంగా ధన సహాయం వల్ల అనుకున్నంత ప్రయోజనం వుండదు. దానికి తోడు దేశమంతటా (సంస్కృతం ద్వేషించే రాష్ట్రాలలో తప్ప) సంస్కృతాన్ని మొదటి తరగతినుండి పట్ట పరీక్ష వరకు నిర్బంధ పఠనీయం చేసినప్పుడు దానివల్ల మార్కులు వస్తే గాని ఉత్తీర్ణత వుండదు. అని నిర్బంధం వున్నప్పుడు గాని సంస్కృతం వ్యాప్తి వుండదు. దానివల్ల ప్రయోజనమూ వుండదు. సోవియట్ యూనియన్‌లో రష్యన్ భాష అన్ని రాష్ట్రాలకు, అన్ని తరగతులకు అనివార్యమయినట్టు సంస్కృతం మనకు అనివార్యం కావాలి. రెండు పంచవర్ష ప్రణాళికలు ఈ విధంగా జరగనీండి. సంస్కృతం ఎందుకు వ్యాప్తి చెందదో చూడండి. మన ప్రాచీన ఖగోళాది శాస్త్రాల అవగతికి ఆధునిక విజ్ఞాన శాస్త్ర సహాయం అవసరమని లోకమాన్యుడు అన్నాడు. ఆ విధంగా సంస్కృత సారస్వత పరిశోధన నవీన దృష్టితో జరిగినప్పుడే దానిపట్ల ప్రజలకు గౌరవం కలుగుతుంది. అంతేకాక, సంస్కృతాభ్యాసం చాతుర్వర్ణ్యాన్ని పునః ప్రతిష్ఠ చేస్తుందనే భయాన్ని కూడా ప్రభుత్వం పోగొట్టాలి. చాతుర్వర్ణ్యం వృత్తులలో ఏర్పడిందే గాని, దైవ నిర్మితం కాదని వేదం ఉద్ఘోషిస్తున్న దనే సత్యాన్ని విద్వాంసులు ప్రజలకు బోధించాలి. దానికి అంగంగా అనేక కాలాల, అనేక గణాల, అనేక ఖండాల దేశాల సకల విషయ సమామ్నాయం మనదగిన భారతం పై పరిశోధన జరిపి (సంస్కృత భారతం), సర్వకాల వర్తి అయిన ధర్మమనేది మానవత్వమేనని తక్కిన ధర్మాలు దేశకాలానుయాయులేనని స్పష్టపరచే ప్రచారం జరగాలి. అప్పుడుగాని, సంస్కృతవ్యాప్తి, సంస్కృతిపట్ల గౌరవం పెరగవు.

ఎక్కువ ఉద్యోగావకాశాలు

ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు సెప్టెంబర్ 22 న పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ గడచిన కొన్ని సంవత్సరాలకన్నా ఈ సంవత్సరం ఉద్యోగావకాశాలు ఉజ్జ్వలంగా వున్నవన్నారు. దీనికి కారణం ప్రభుత్వం పెక్కు పథకాలను ప్రారంభించడమేనని, ఈ సంవత్సరం 400 మంది ఇంజనీరింగు పట్టభద్రులను రిక్రూట్ చేశామని, మరి 400 మందికి క్రమంగా ఉద్యోగాలిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి ప్రకటననుబట్టి ఇంజనీరింగ్ పట్టభద్రులు వైద్య శాస్త్ర పట్టభద్రులు ఇక నిరుద్యోగులమని, భయపడనక్కర లేదు. అవినీతులు, అసమర్థులు అయిన ప్రభుత్వోద్యోగులను తప్పనిసరిగా ఉపకార వేతనమిచ్చి పంపివేయడమనే పథకం వల్ల యువకులకు మరింత ఉద్యోగావకాశం ఏర్పడింది. పోలీసు శాఖలోను, నీటి పారుదల శాఖలోను ఎక్కువ ఖాళీలు ఏర్పడ్డాయని, ప్రతి ఏటా 150 మంది పోలీసు సబ్, ఇన్‌స్పెక్టర్లను కొత్తగా తీసుకొంటుండగా ఈ సారి 400 మందిని తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

వైద్యులకు నిర్బంధ గ్రామ సేవ

వైద్యులకు నిర్బంధంగా గ్రామ ప్రాంతాల సేవ ఏర్పాటు చేయదలచడంతో ప్రభుత్వం దూరదృష్టి ప్రశంసనీయం. దీనివల్ల గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితి బాగుపడడమేకాక పట్టణాలలో వుందామనే మనస్తత్వం వైద్యులకు తొలగి నిజమైన ప్రజాసేవకు అవకాశం ఏర్పడుతుంది. ఏ వైద్యుడైనా ఒక సంవత్సరం పాటు తప్పనిసరిగా గ్రామాలలో పని చేయవలసి వుంటుందని ముఖ్యమంత్రి తెలిపారు గాని, నిజానికి మూడు సంవత్సరాలన్నా ఈ సేవను నిర్బంధం చేస్తే గాని మంచి జరుగదు. సంవత్సరం గడువులో చేసేది, చెందేది ఏమీ వుండవు. మూడు సంవత్సరాలన్నా తప్పనిసరికావాలి.

రెసిడెన్షియల్ పాఠశాలలు

ప్రస్తుతం రాష్ట్రంలో వున్న రెసిడెన్షియల్ పాఠశాలలు సాధిస్తున్న విజయాలనుబట్టి 21 జిల్లాలలోను రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పడానికి ప్రభుత్వం నిర్ణయించినట్టు విద్యామంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావు తెలుపడం బాగుంది. ఈ పాఠశాలలో పూర్వపు గురుకుల పద్ధతిలాగ గురు శిష్య సన్నిహితత్వం ఎక్కువగా వుండడం వల్ల ఫలితాలు విశేషంగా వుంటాయన టం నిస్సందేహం.

ఉపశ్రుతి


''ఏమండీ, స్వామివాదులని, స్వామ్యవాదులనీ ఏవో నిర్వచించారు మీరు. 'నీ పని చేసిపెడతాను నాకు లాభంలో సగమిస్తావా?' అని మధ్యపెట్టే పైరవీ నాయకులు ఏమి వాదులండీ?—'' అని ఒక నిస్సహాయ జీవి ప్రశ్నించాడు. ''వాళ్ళు, వాళ్ళు సామివాదులు. సామి అంటే సగం అని సంస్కృత భాష. దానినుంచే సెమి అనే ఆంగ్ల పదం పుట్టింది. కనుక ఆ పైరవీకారులను సామివాదులు — తదాపర్ధం మమాపర్ధంవాదులు — అందాము'' అన్నారు ఒక సంస్కృత విద్వాంసుడు.

— తిరుమల రామచంద్ర.

సామాన్యుని సణుగుడు

ఇదింకా మగాళ్ల ప్రపంచమేనా ?

ఇదింకా మగాళ్ల ప్రపంచమే! ఇది అంతర్జాతీయ మహిళల సంవత్సరమేగాని యిదింకా మగాళ్ల ప్రపంచమేనా ... ? అనిపిస్తున్నది! ... అబ్బబ్బ! మరీ యింత ఎక్స్‌ప్లోయిటేషనా ? లేక సెక్స్‌ప్లోయిటేషనా ? ... అంట! అప్పడాలకు, అగరు వత్తులకు పోనీ జాడీలకు కూజాలకు ఐనా ఫర్వాలేదుగాని, కమ్మని బీడీలకి, శాండో బనియన్‌లకు ఆడబొమ్మల మార్కు లెందుకు ? మగాళ్ల ప్రపంచంలో ఆడాళ్లని మరీ పబ్లిసిటీ కోసం ఎంత ఎక్స్‌ప్లోయిట్ చేస్తున్నారో చూస్తున్నారూ? అతివల్లారా! బహుపరాక్ ! బహుపరాక్ !!!



'బ్రా' లకు 'బొందు లంగా' లకి సెక్స్ అప్పీలు బొమ్మలు అంటే ఆడబొమ్మలు తప్పవుగాని, పంచరంగుల గళ్ల లుంగీలకు, టెర్లిన్ నెక్ టైలకు గెడ్డం గీసుకునే రేజర్‌బ్లేడులకు కూడా అందమైన పరువంలో నున్న అందాల భామ బొమ్మ ఎందుకు ?రేజర్ లేకుండా మెత్తగా గెడ్డం గీసుకునే సురకత్తికీ అందమైన అగ్రశేణి తారామణి అర్ధనగ్న చిత్రానికి ఏమిటండీ బాదరాయణ సంబంధం ?

''ఫ్రిజ్'' ప్రకటనకీ అమ్మాయి బొమ్మేనా ? నేలమీదా, గోడ మీదా, మొహంమీద వేసుకునే అన్ని రకాల రంగులకీ అందమైన అతివబొమ్మదేనా ట్రేడ్ మార్కు ?

ఇనప్పెట్టెల్లో కులికే లక్ష్మీదేవి మహిళామణియే కావచ్చును గాని యినప్పెట్టెలకీ, పడకకుర్చీలకూ, బార్బర్ షాప్‌మీదా, బ్రాందీ బార్‌మీదా, సింహాలూ, పులులూ, ఏనుగులూ చేసే సర్కస్ 'డేరా' మీదా కూడా అందమైన అమ్మాయిల బొమ్మలనే యిష్టమొచ్చినట్లు వస్త్రాపహరణం చేసి అంటించడమేనా అంట ?

అగరువత్తులకు, లిప్‌స్టిక్ రంగులకు, టూత్‌పేస్ట్‌లకి, అయితే ఫర్వాలేదుగాని రుచికరమైన అన్ని రకముల మిరపకాయ బజ్జీలకీ, అధునాతన ఫక్కీలో వండిన ''పోర్కు'' అమ్ముకునే అంగళ్ల మీదా కూడా 'భామల భంగిమ లెందుకూ ? ప్చ్ ... ప్చ్ ... సినిమాల సంగతి సరేసరి. తాటిచెట్టు సైజు బ్యానర్‌ల మీద ... కీచకుడు ద్రౌపదిని ... అదేమిటో చేయ బోయాడూ అంటారే... అలాంటి బొమ్మలు ... హీరో హీరోయిన్లే కావచ్చును కానీండి.

ఇక నవలలకీ కథలకీ చెప్పనే అక్కరలేదు ... నా పేరు అప్పారావు కలంపేరు 'ఊమేలింభా' అంటాడో వర్ధమాన రచయిత. అంటే ఒక్క ఆడ పేరైతే గ్లామరు లేదూ అని మాంచి గ్లామరున్న ఊర్వశిలోని మొదట అక్షరం 'మేనక' లోని అక్షరం అలాగే తిలోత్తమ లోని మొదటి అక్షరం చివర దాపల సున్నాతో రంభలోని చివర అక్షరం పెట్టుకుంటే గ్లామర్ పెరుగుతుందని అలా పెట్టేసుకున్నా నంటాడు గొప్పగా! ... యిదేనా స్త్రీలంటే రెస్పెక్ట్ ? రామగోల సుబ్బయ్య కలంపేరు 'చంద్రకళో' 'శశికళో' అమృతవల్లో ఏదో ఒక బుల్లెమ్మ పేరు అయి వుంటుంది. అయ్యో! అదీ కథా!...అంచేత అతివల్లారా ? బహుపరాక్ !! కనీసం అర్ధ ప్రపంచంలో గల అంటె పూర్వార్ధ గోళంలో గల మహిళామణులైనా ఏకం కండు ... లెండు ... యీ ఎక్స్‌ప్లోయిటేషన్ని ఎదురించుడు. ... మగ సలహాలు పాటించం అనే నియమం ఏదైనా వుంటే సారీ ... యిలా వదిలేయండి ...

[వీ రా జీ]

సంసారం సంసారం

జి. సుబ్బలక్ష్మి



ఉదయం ఆరు గంటల సమయం. మంచి నిద్రలోవున్న గోపాలానికి బాబు ఏడుపు విని మెలకువ వచ్చేసింది.

వెంటనే కోపం కూడా వచ్చింది.

"ఏయ్... జానీ... ఎక్కడికెళ్ళావే? పిల్లాడేడుస్తుంటే వినపట్టంలా?" అని పడుకున్న చోటినుంచే ఒక్క కేక పెట్టాడు.

"వస్తున్నానండీ... ఒక్క నిముషం. కాఫీ కలుపుకుని వచ్చేస్తున్నా..." ఫిల్టరులో కాఫీపొడి వేసి వేడినీళ్ళు పోసి పాలగిన్నెను పొయ్యిమీద పడేస్తున్న జానకి వంటింట్లో నుంచే సమాధానం చెప్పింది.

అసలే నిద్ర చెడిపోయిందని విసుక్కుంటున్న గోపాలానికి భార్యలేచివతలకు రాకుండా వున్నచోటినుంచే జవాబు చెప్పడంచూసి మరింత మండిపోయింది. "ముందు వీణ్ణి తీసికెళ్ళి సముదాయించు... ఛ! కాస్త నిద్రయినా పోనీయరు... తెల్లారి లేచీ లేవగానే ప్రారంభం వెధవ గోల!" అంటూ దుప్పటి మరింతగా లాగి ముసుగెట్టుకున్నాడుగోపాలం.

"ముందు కాఫీ పెట్టనా లేక వాణ్ణెత్తుక్కూచోనా? నిద్ర లేచేటప్పటికి కాఫీ రెడీగా లేకపోతే మీరేగా చిందులు తొక్కేది?" అంటూ జానకి పడకగది గుమ్మందాకా వచ్చి బాబును చూసింది. వాడు పక్కమీదే కూర్చుని ఏడుస్తున్నాడు.

"ఒరేయ్, బాబూ... పొద్దున్నే లేవడంతోటే ఏడవడమేనా పని నీకు?" అంటూ బాబునోసారి కసురుకుని మళ్ళీ వంటింట్లోకి చేరింది జానకి.

గోపాలం కోపంతో దుప్పటిని ఒక్క తన్ను తన్ని దిగ్గునలేచి బాత్‌రూమ్‌లోకి నడిచాడు.

అతను పళ్ళు తోముకుని మొహం కడుక్కుని వచ్చేసరికి కాఫీ కలిపి గ్లాసులోపోసి బాబుకి పాలుపట్టింది జానకి.

గోపాలం కాఫీత్రాగి వరండాలో కుర్చీలో కూర్చుని అప్పుడే వచ్చి పేపరును ఓసారి తిరగేసి టేబుల్ మీద పడేశాడు.

జానకి వంట పనిలో మునిగిపోయింది.


"జానీ... ఏయ్ జా..." ఉన్నట్టుండి ఒక్క కేక పెట్టాడు గోపాలం. అతని చేతిలో షర్టుంది.

జానకి "వస్తున్నా...వస్తున్నా" అంటూ లోపలినుంచి రాగానే దాన్ని ఆమెకు చూపించి, "చూడు, దీనికింకా బటనే కుట్టలేదు. నిన్ననే కుట్టమన్నానుగా ఎందుకు కుట్టలేదు? ఈ కాస్త పని చెయ్యడానిక్కూడా టైము లేకపోయిందన్నమాట! నేనోపక్క ఊరికే మొత్తుకుంటూంటేనే పని జరిగేది. లేకపోతె నోబడికేర్స్!" అంటూ విసుక్కున్నాడు గోపాలం.


"మొన్నీమధ్యనే కుట్టానుకదండీ దానికి గుండీ? మళ్ళీ ఊడిపోయిందా? అయినా ఆ దోబీ మరీ అధ్వాన్నం బాబూ! రేవుకేసిన ప్రతిసారీ గుండీలు ఊడగొట్టి మరీ తెస్తాడు. దానికి నన్నేం చెయ్యమంటారు చెప్పండి?"

"ఐడోంట్ వాంట్ ఎనీ స్టుపిడ్ ఎక్స్‌క్యూజెస్! పొద్దున్నే బట్టలు తీసి పెట్టేటప్పుడే బటన్సన్నీ సరిగ్గా వున్నాయో లేవోనని చూడొద్దూ? ఆఫీసుకెళ్ళేటప్పుడు లొందర్లో చొక్కా తొడుక్కుంటె అప్పుడు దానికి గుండీలే వుండవు ... అయినా ఇవాళకాస్త నయమేలే ... ఆఫీసు టైముకు ముందే నాదృష్టి దానిమీద పడింది"

"కాస్త ఆగండి ... ఇప్పుడే క్షణంలో ఆ గుండీ కుట్టిచ్చేస్తా...ఈ మాత్రాని కెందుకలా విసుక్కుంటారు?" అంటూ వెళ్ళి చేతులు కడుక్కునివచ్చి సూదీ దారం తీసుకుని గుండీ కుట్టడానికి కూర్చుంది జానకి. బాబు వచ్చి దారంరీలు అందుకుని ఆడుకోవ



32 గట్టి పళ్లకోసం.
పటిష్టమైన ఎముకల కోసం!



ఎముకలు, పళ్లు పటిష్టంగా పెరగాలంటే కాల్షియం ముఖ్యావసరం. అందువల్ల, పెద్దల కన్న పిల్లలకు రెట్టింపు కాల్షియం కావాలి. అందుకే, మీ పిల్లలకి కమ్మని, రాస్‌బెరీ రుచి కలిగిన కాల్షియం శాండోజ్ యియ్యండి.

గట్టి పళ్లు, పటిష్టమైన ఎముకల కోసం, రోజుకు కేవలం 4–6 కాల్షియం శాండోజ్ బిళ్లలు యిస్తే చాలు. అంతేకాదు, విటమిన్లు సి, డి మరియు B_{12}తో అది పుష్టివంతం చేయబడింది.

200, 50 బిళ్లల సీసాలలోనూ, సిరప్ రూపంలోనూ లభిస్తుంది.

పెరుగుదలకు కాల్షియం

కాల్షియం తీసుకున్న పిల్లలు, కాల్షియం తీసుకోని వారికన్న, 4 నెలలలో చాలా ఎక్కువగా ఎదిగారని శాస్త్రీయ పరిశోధన రుజువు చేసింది.



కాల్షియం-శాండోజ్®

SANDOZ

ప్రతి రోజు ప్రతివారికి

ముఖ్యమైన అన్ని మందుల దుకాణాల్లోనూ లభిస్తుంది.

dCP/CS/7e. Tel

డం మొదలెట్టాడు. "దారం తీసుకోకమ్మా బాబు. అంతా చిక్కుపడిపోతుంది." అని వాడి చేతిలోంచి ఉండ లాక్కుని కుట్టడం పూర్తిచేసి లేచింది. వంటింటి కెళదామని వెనక్కి తిరిగేసరికి తన చీర కుచ్చెళ్లు బాబు చేతుల్లో వుండడం కనిపించింది. "చీర వదులు నాన్నా ... అవతల నాకు బోలెడంత పనుంది." అంటూ చీర విడిపించుకుని లోపలికెళ్లిపోయింది జానకి. తల్లి తననెత్తుకోలేదన్న కోపంతో బాబు మళ్లీ ఏడవ సాగాడు.

"పాలు తాగడమయింది, అన్నీ అయ్యాయి ఇంకా ఏడు పెందుకురా ? కాసేపు హాయిగా ఆడుకోకూడదూ?" అని లోపలినుంచే వాడి మీద కేకలేసింది జానకి.

గోపాలం గడ్డంచేసుకోవడానికి కూర్చోగానే బాబుమోకాళ్లతో పాకుతూ అతని దగ్గరికెళ్లి ఆ పరికరాలన్నీ లాగడం మొదలెట్టాడు.

"ఏయ్ .. ఏ చేస్తున్నావే ? త్వరగా ఇలారా. వీడుమాడు అన్నీ ఎలా లాగేస్తున్నాడో ? కాస్త అటువైపు తీసుకెళ్ళు." అని విసుగుదలతో గట్టిగా అరచి చెప్పాడు గోపాలం.

జానకి చేస్తూన్న పనినలాగే వదిలేసి పరుగెత్తుకు వచ్చింది. "ఏంపిల్లలో పాడు !

సంసారం—సంసారం

నన్ను చంపుకుతినడానికే పుట్టారు" అంటూ బాబును దూరంగా కూర్చోపెట్టి కాసిని బొమ్మలు వాడిముందు పడేసి లోపలికి వెళ్లింది.

పదిపదిహేను నిముషాలైనా గడిచాయో లేదో అంతలోనే గోపాలం మళ్లీ అరిచాడు. "జానీ ... జానీ ... నీళ్లు కాగాయిటే ? ఇవ్వాళ స్నానంచేసే ప్రాప్తమేమైనా వుందా? లేక అలాగే ఆఫీసు కెళ్లమంటావా ?"

"నీళ్లు ఇందాకే కాగాయండీ, తువాలు కూడా బాత్‌రూంలోనే రెడీగా వుంచాను. ఇక మీదే ఆలస్యం."

వంటింట్లోంచే వచ్చింది సమాధానం.


గోపాలం త్వరత్వరగా స్నానం చేసివచ్చి భోజనానికి కూర్చున్నాడు.

"త్వరగా వడ్డిస్తారా జానకీదేవిగారూ ? ఆలస్యమయిపోయింది. నిన్నకూడా తొమ్మిది గంటల బస్సు అందనేలేదు. ఈరోజయినా కాస్త త్వరగా వెళతా...అదిసరేగాని ఈపూట ఏం వండావ్ ? వంకాయకూర, పప్పుచారు, అవేనా ? అదికాదే ముద్దూ, ఒకే రకం వంటలు చేసేబదులు కాస్త మార్చి మార్చి కొత్త వంటలు చెయ్యకూడదూ ? మొన్న ఆ సావిత్రమ్మగారింట్లో భోజనం ఎలావుందో తెలుసా ? అబ్బ ! తల్చుకుంటేనే నోరూరుతోంది." గోపాలం నాలుక చప్పరించాడు.

"అయితే రోజూ అక్కడికే వెళ్లండి భోజనానికి ... అదికాదండీ, ఎప్పుడో ఏ పదిహేను ఇరవై రోజులకో ఓసారి వంకాయకూర చేస్తే, దాన్నే పట్టుకుని అలా దెప్పిపొడుస్తారేమిటి మీరు ? రోజూ చేసే వంటలన్నీ ఎందుకు మరచిపోతూంటారు ? పోనీ ఒక్కరోజయినా బజారుకెళ్లి కూరలు తెచ్చారా ఎప్పుడైనా ? పొరపాటున ఏనాడైనా మిమ్మల్ని కూరలు తెమ్మని చెబితే వెంటనే ఇంతెత్తున లేస్తారు. 'దటీజ్ నాట్ మై డిపార్ట్‌మెంట్ !' అంటూ నామీద విరుచుకు పడతారు."

భోజనం చేస్తూన్న గోపాలం ఉన్నట్టుండి గుర్తుకు తెచ్చుకుని "అన్నట్టు పెద్దాడు ఎక్కడా చదువుకున్నట్టే కనబడలేదే ? పొద్దున్నే లేచి ఆటలకెళ్లిపోయాడు కాబోలు! అయినా రోజూ వాణ్ని కూర్చోపెట్టి ఓగంటసేపయినా చదివించ వెందుకని? మనం బాగా నేర్పితేకదా వాడు నేర్చుకునేది ? వాడు సమంగా చదువుకోకుండా ఫెయిలయితే

అవకాశానికి అవసరమైనప్పుడు ధరించడానికి సాంప్రదాయక సౌందర్యంతో బట్టలు...



ఆ అవమానం ఎవరికి ? మనకేగా ?"

"అయ్యోరామ! వాణ్ని చదివించేసరికి నా ప్రాణం పోతుంది. మీరటు వెళ్లగానే ఇంట్లో ఇహ వాడిదే రాజ్యం !"

సంసారం—సంసారం

గోపాలం లేచి బట్టలు వేసుకున్నాడు. "సర్లే, నేనిహ వెళ్తా...ఇవ్వాళ మరవకుండా మా అక్కయ్యకీ, మీ ముద్దుల చెల్లికీ ఉత్త

రాలు వ్రాసిపడేయ్. తెలిసిందా? దట్ డిపార్ట్‌మెంట్ ఈజ్ విత్‌యూ, ఇఫ్‌యూ రిమెంబర్...అయ్యో! చెప్పడమే మరిచాను. నా పైజామా ఈరోజు కుట్టేయి. ఇంట్లో



మిషను పెట్టుకుని ఆ టైలరుకెందుకు డబ్బు తగలెయ్యడం ?...ఆఁ ... సాయంత్రం మర్చిపోకుండా డాక్టరు దగ్గరికెళ్ళి బాబుకు టానిక్కు వ్రాయించుకురా ... ఇహ నే వెళ్తాస్తా." అంటూ గబగబా వెళ్ళి పోయాడు గోపాలం.

అతను వెళ్ళినవైపే చూస్తూ ఒక్క నిట్టూర్పు విడిచి లోపలికి వచ్చింది జానకి.

"రమేశ్, ఇలా రానాన్నా, ఆ ఇంగ్లీషు పుస్తకం ఇలా పట్రా, నీ చదువు గురించి నీకు బెంగ లేకపోయినా నాకుంది. త్వరగారా ...పెంకితనం చెయ్యకు." అంటూ కొడుక్కి పాఠం చెప్పడానికి సిద్ధంగా కూర్చుంది జానకి.

"అమ్మా, ముందు లెక్కలు చేస్తానమ్మా. నాకా పాడు ఇంగ్లీషంటేనే బోరు. పోని డ్రాయింగ్ వేయనా లేకపోతే ?"

ఎలాగయినా ఇంగ్లీషు పాఠం నుంచి తప్పించుకుంటే చాలని ఏదేదో ఉపాయాలు ఆలోచిస్తూనే రమేశ్‌ని చూస్తూంటె జానకికి చాలా కోపం వచ్చింది.

"చాల్లేరా నీ దొంగవేషాలు ... నోరు మూసుక్కూమని పాఠం నేర్చుకో. ఆ తరువాత స్కూలుకి టైమయిందంటూ గంతులేస్తావు. మీ నాన్నకయితే అసలు తీరికే వుండదాయె ... అందుకని ఇది కూడా నా డిపార్ట్‌మెంటేనని ఆయనేమో తేలిగ్గా తేల్చేశారుగాని నువ్వుమాత్రం రానేరావు ... ఏమోనాయనా, మా చిన్నప్పుడు ఒక్కరోజు కూడా ఎవరూ మాకు చదువుకోమని చెప్పే అవసరమే లేకపోయేది. మా అంతట మేమే చదువుకునేవాళ్లం..." అంటూ బలవంతంతో వాణ్ని చదవడానికి కూర్చోపెట్టుకుంది.

ఒక్క పాఠం చదివేసరికే విసుగుపుట్టింది రమేశ్‌కు. "ఇంకచాలు. ఇహ వడ్డించమ్మా... స్కూలుకు టైమయిపోతుంది..." అంటూ పుస్తకాలన్నీ సంచీలో కుక్కాడు. "పద" అని తనూలేచి వంటింట్లోకి నడిచింది జానకి

భోజనం చేస్తూండగానే రమేశ్ "అమ్మా టిఫిన్ బాక్సులో అస్తమానం ఆ రొట్టెలే పెట్టకమ్మా నేను తినలేను. రోజూ ఏదైనా కొత్త కొత్త టిఫిను చేసిపెట్టు నాకు." అన్నాడు.

"విసుగెందుకురా? రోజుకో కూర పెడుతున్నానుగా రొట్టెల్లో నంజుకోడానికి? బాగానే వుందిలే ఇప్పటుంచీ అన్నీ మీ నాన్న బుద్ధులే వచ్చాయా నీక్కూడా? సాయంకాలంపూట రోజూ రకరకాల టిఫిన్లు చేస్తూనే వున్నానుగా. ఇంకా పొద్దున కూడా ఎక్కడ చేస్తూ కూర్చోను?... ఊఁ... పద పద త్వరగా చెయ్యి కడుక్కుని స్కూల్‌డ్రస్ వేసుకో... అబ్బబ్బ! ఈ బూట్లు ఎందుకిలా మట్టికొట్టుకు పోతాయిరా రోజూ? ఎక్కడ మట్టిలో ఆడివస్తావో ఏం పాడో!" కొడుకు బయలుదేరేవరకూ అలా చెబుతూనే వుంది జానకి. అయితే రమేశ్ మాత్రం అవేమీ చెవిన వేసుకోకుండా.

"అమ్మా... వస్తా టాటా...సాయంత్రం నేను వచ్చేసరికి ఏదైనా స్వీట్‌చేసి వుంచాలి" అని గట్టిగా కేకేసి చెప్పి స్కూలుకు వెళ్ళి పోయాడు.

రమేశ్ అటు వెళ్ళిపోగానే జానకి బాబుకి నీళ్ళుపోసి అన్నం తినిపించింది. వంటింట్లో మిగిలిన పనులన్నీ పూర్తిచేసుకుని భోజనం చేసేటప్పటికి పన్నెండు గంటలైంది.

భోజనం పూర్తి కాగానే వుత్తరాలు వ్రాయడానికి కూర్చుంది జానకి. సరిగ్గా అదే సమయానికి పనిమనిషి వచ్చింది. ఒక ఉత్తరం వ్రాసేసరికి అది అంట్లు తోమేసి లోపలికి వచ్చి "అమ్మగారూ" అని పిలిచింది. దానికి ఇల్లూడవమని చీపురు పడేసి, మాసిన బట్టలన్నీ పోగుచేసి వేసేసరికి బాబు లేచాడు.


'ఇహ ఇవ్వాళ చెల్లాయికి ఉత్తరం వ్రాసి నట్టే!' అనుకుంటూ వెళ్ళి వాణ్నెత్తుకుంది జానకి. పాపం అదేమనుకుంటోందో ఏమో! వారం రోజుల నుంచీ తన ఉత్తరం కోసం ఎదురుచూస్తూ వుంటుందికూడా! ఏం చేయడం ? తనకు తీరికుంటేగా ?... ఇప్పుడు ఏదైనా టిఫిన్‌చేసి వుండాలి. లేకపోతే రమేశ్ వచ్చి నానాగొడవా చేస్తాడు. ఆలోచిస్తూ వెళ్ళి బాబు చేతికొక బిస్కెట్టు ఇచ్చి కూర్చోపెట్టి వంటింట్లోకి వెళ్ళి స్టౌ అంటించేటప్పటికే రమేశ్ స్కూలునుంచి రానేవచ్చాడు. కాఫీకి నీళ్లు పడేసి ఇవతలికి వచ్చిన జానకిదృష్టి రమేష్ లాగూమీద పడింది.

"ఏమిట్రా రమేష్, కొత్తలాగూ నప్పుడే చింపుకొచ్చావే...? అలా ఎలా చిరిగిందిరా అది ?" అంటూ రెండు కేకలేసి వాణ్ని బట్టలు మార్చుకోమని చెప్పి లోపలికి వెళ్ళింది.

తల్లి చెప్పిన మాటలేవీ రమేష్ చెవికెక్క లేదు. వాడికిప్పుడున్న ఆలోచనల్లా ఒక్కటే, అమ్మ ఏం టిఫిను చేసిందోనని! "అమ్మా, టిఫిన్..." అంటూ వంటింట్లోకెళ్ళి కూర్చున్నాడు. తను ఉదయం చెప్పివెళ్ళినా తల్లి స్వీటు చెయ్యకపోవడం చూసి కోపంతో లేచి బయటికి వచ్చి నిలబడిపోయాడు. జానకి మంచిమాటలతో వాణ్ని బుజ్జగించి బ్రెడ్డు, బిస్కెట్లు కాఫీ ఇచ్చి ఆడుకోడానికి పంపించింది.

అక్కడా ఇక్కడా పడివున్న బట్టలన్నీ తీసి సర్ది పెడుతూండగా జానకికి పైజామావాట గుర్తుకొచ్చింది. వెంటనే బీరువాలోంచి బట్టతీసి కత్తిరించి మిషన్‌మీద కూర్చుంది.

ఆమె అది కుట్టడం పూర్తిచేసి మిషను మీదనుంచి లేవడం, గోపాలం ఆఫీసునుంచి





సంసారం—సంసారం

రావడం ఒక్కసారే జరిగింది. ఇంట్లోకి వస్తూనే "వేడివేడిగా కాఫీ చుక్కేమయినా దొరుకుతుందా ఈ ఇంట్లో? అంటూనే వచ్చాడు. భార్య ఇంకా అప్పుడే మిషినుమీద నుంచి లేచిరావడం చూసి అతని మొహంలో చిరాకు స్పష్టంగా కనిపించింది.

"ఇంకా ఇప్పుడు కుడుతున్నావా? పగ లంతా ఏం చేశావు?" అంటూ బట్టలు మార్చుకుని బాత్‌రూమ్‌లోకి నడిచాడు.

జానకి మాట్లాడకుండా లేచివెళ్లి కాఫీ కలపసాగింది.

మొహం తుడుచుకుంటూ లోపలికి వచ్చిన గోపాలం "టిఫినేమయినా ఏడిపిందా లేదా? అయినా నీకేం చెయ్యడం వచ్చని? పోని ఆ వంటల పుస్తకంలోనైనా చూసుకుని ఏదైనా కొత్తరకం టిఫిను చేయకూడదూ? అందులో బోలెడు రకాలున్నాయి తెలుసా?" అన్నాడు.

"ఈ రోజు టిఫిన్ చేయడం కుదర లేదండీ... కాస్త ఇవ్వాల్టికి ఏ బ్రెడ్డో లేక బిస్కట్లో తీసుకుని కాఫీ త్రాగేయండి. రేపు చక్కగా ఆవడలు వేసిపెడతాను గాని." మృదువుగా మెల్లగా అంది జానకి.

"కాదూ మరి? పాపం! టిఫీను చెయ్యడానికి నీ కెక్కడ కుదురుతుంది చెప్పు? మేమంటే ఉదయం తొమ్మిది నుంచి సాయం కాలం ఆరింటివరకూ బయట చాకిరీ చెయ్యాలి... కాని మీకలా కాదే! వంట చెయ్యటం ఒక్కటి తప్పించి మరేం పని వుంటుంది మీకు?" వెక్కిరింతగా అన్నాడు గోపాలం.

"చాల్లెండి... ఎందుకిలా వెక్కిరిస్తారు? ఏ రోజయినా ఆఫీసునుంచి రాగానే నవ్వు మొహంతో మాట్లాడారా అసలు? ఎప్పుడూ చిర్రు బుర్రులాడ్డం ఒక్కటే తెలుసు మీకు. అస్తమానం ఏదో ఒక తప్పు కనిపెట్టడం, దేనికోదానికి సాధించడం — ఇదేపని" అంది. జానకి. ఆమె మొహం అప్పటికే ఎర్రబడింది.

"పోన్లే. ఈ మాత్రానికి ఏడుపు మొహం పెట్టకు. ఏదుంటె అదే పెట్టు, తిని అవతలికి పోతా" అనేసి జానకి అందించిన వెన్నరాసిన బ్రెడ్డు ముక్కలు తిని కాఫీ త్రాగి వంటింట్లోనుంచి ఇవతలికివచ్చాడు గోపాలం. "నేనలా వెళ్లొస్తా... ఎనిమిదిన్నర కొస్తే చాలుగా? అప్పటికి వంటవుతుందా లేక మరి కాస్త ఆలస్యంగా రానా?" అంటూనే తల దువ్వుకుని డ్రెస్ మార్చుకున్నాడు గోపాలం.

"ఎప్పుడైనా రండి. మీ ఇష్టం. నేనయితే ఇప్పుడే వంట మొదలెట్టేస్తున్నా. ఆలస్యమయితే ఆనక మీతో తినేవారు తింటారు బాబూ!" అంది జానకి.

అంతలో బయటనుంచి పరుగెత్తుకొచ్చిన రమేశ్ తండ్రిదగ్గరికొచ్చి నిలబడి "నాన్నా, నాకింకా రెండుపుస్తకాలు కావాలి నాన్నా..." అంటూ ఇంకా ఏమో చెప్పబోతుండగానే గోపాలం అడ్డుపడి, "అవన్నీ నాకెందుకు చెబుతున్నావురా? మీ అమ్మతో చెప్పు, పగ లంతా ఇంట్లో కూర్చుని ఏంచేస్తుంది. వెళ్ళి పట్టుకొస్తుందిలే." అని బయటికి వెళ్ళిపోయాడు.

జానకి మౌనంగా వంటింటివేపు నడిచింది

రాత్రి తొమ్మిది గంటలకు ఇంటికొచ్చిన గోపాలం ఇల్లంతా నిశ్శబ్దంగా వుండడం చూసి, "పిల్లలంతా పడుకున్నారా?" అని అడిగాడు.

"ఇప్పటికి పడుకున్నారు బాబూ! ఇంత వరకూ ఏ మల్లరి చేశారనుకున్నారు అబ్బబ్బ! నాకయితె తల దిమ్మెక్కిపోయిందనుకోండి." అంది జానకి.

"పోన్లెద్దూ... చిన్నపిల్లలు. ఇప్పుడు అల్లరి చెయ్యకపోతే పెద్దవాళ్లయ్యాక చేస్తారేమిటి?" అని భార్యను అనునయించాడు గోపాలం.

'ఆహా! మీరేనా ఇలా మాట్లాడుతూంట? నాకు చాలా ఆశ్చర్యంగా వుందండీ. పోన్లెండి ఆ గొడవకేంగాని ముందు కాళ్లూ చేతులూ కడుక్కుని భోజనానికి లేవండి. అంతలో నేను వేడివేడిగా రెండు చపాతీలు చేసేస్తా. ముందే చేసి వుంచుదామంటె 'అయిసులో పెట్టావా' అని వెక్కిరిస్తారు మీరు" అంటూనే లోపలికి వెళ్లి స్టౌవెలిగించింది జానకి.

"ఏమిటి? నేనొక్కణ్ణే కూర్చోవాలా భోజనానికి? ఆహాఁ! అలా వీల్లేదు. నాలుగు చపాతీలూ చేసెయ్యి. తరువాత ఇద్దరం ఒక్కసారే కూర్చుందాం భోజనానికి, పోని ఇంకోపని చేద్దామా? నువ్వు ఒత్తి పెట్టు, నేను కాల్చేస్తాను" అంటూ గోపాలం లుంగీని పైకెత్తి కట్టుకుంటూ వంటింట్లోకి వచ్చాడు.

"చాలు చాల్లెండి...లేనిపోని అలవాట్లన్నీ చెయ కండి నాకు. మీరెళ్లి కాళ్లు కడుక్కొచ్చేలోగా నేనన్నీ రెడీ చేసేస్తాను." అంటూ త్వరత్వరగా చపాతీలు చెయ్య సాగింది జానకి. రాత్రిపూట చపాతీలు లేకపోతే గోపాలం భోజనం చెయ్యలేడని ఆమెకు బాగా తెలుసు.

గోపాలం భోజనానికి కూర్చున్నాడు. "కూర చాలా బాగుంది జానీ—అయినా నీలా వంట ఎవ్వరూ చెయ్యలేరనుకో" అన్నాడు.

"ఓహో! ఈ రోజేమిటో పొగిడేస్తున్నారే...ఏమిటి సంగతి?" నవ్వుతూ అంది జానకి.

"పొగడ్డంకాదు జానీ, నిజంగానే అంటున్నా. నువ్వు చేసిన వంటకు వంకపెట్టగలరా ఎవరైనా? ఒకవేళ ఎవడైనా వంక పెట్టాడనుకో ... వాణ్ని నాముందుకు లాక్కురా ... బ్రింగ్ దట్ ఫెలో ఇన్ ఫ్రంట్ ఆఫ్ మి ... వాడి పని పడతా" ఎడంచేత్తో కుడిభుజం చరుచుకుంటూ వీరుడిలా అన్నాడు గోపాలం.

"ఇహ చాలించండి, మరీ ఎక్కువయిపోయింది పొగడ్త" అంది జానకి. సిగ్గుతో ఆమె మొహం ఎర్రబడింది.

భోజనాలు పూర్తయ్యాయి.


"జానీ, ఇవన్నీ ఇలా వుండనిద్దూ ... పొద్దున శుభ్రం చేసుకోవచ్చు. యూ మస్ట్ రిలాక్స్ నౌ, ఆఫ్టర్ వర్కింగ్ సో హార్డ్!" అని గోపాలం భార్యవైపు ప్రేమగా చూశాడు.

"ఛీ! వద్దు బాబూ...గలీజు! వంటిల్లిలా వుంటె నాకసలు నిద్రేపట్టదు. మీరెళ్లండి, నేనివన్నీ తీసేసి వచ్చేస్తా" కొంగు నడుము చుట్టూ బిగించి ఒక్కొక్కటిగా అన్నీ తీయ సాగింది జానకి.

"వద్దోయ్, నామాటవిను. నీకూ చాలా అలసటగానె వుంటుంది నాకు తెలుసు. నిజంగా యూహేవ్ సోమచ్ వర్క్ ఇన్ దిస్ హౌస్. పాపం నీకసలు కాస్తకూడా రెస్టనేదే వుండదుకదూ?"

జానకికి అతని మాటలు వింటుంటె లోలోపల నవ్వొస్తోందిగాని, పైకి కనబడనీయకుండా "అబ్బే, అలా ఏంలేదండీ, ఇంకా మీకే విశ్రాంతి వుండదు పాపం! పగలంతా ఆఫీసులో పనిచేసి వస్తారు... ఇంటికివస్తే పిల్లలగోల" అంది.

"పిచ్చిదానా ఇంకా నేనే నిస్సెప్పుడూ



తిడుతూంటాను. నువ్వు మంచిదానివి కాబట్టి అన్నీ భరిస్తున్నావు ... అదే మరొకరైతేనా ఎంత పోట్లాడేవారో నాతో? మనకు పెళ్లయి పదేళ్లయిపోయినా నువ్వు మాత్రం అప్పట్లాగే వున్నావు సుమా! కోపం, తాపం, విసుగు, చిరాకు ఏమీ లేదునీలో. నిజంగా యూ ఆర్ ఏ స్వీట్ డార్లింగ్!"

"ఓహోహో! ఏమిటండోయ్ ఇవ్వాళ మరీ అంతగా పొగిడేస్తున్నారు? ఆడవాళ్ల నాప్పే పొగడకూడదండీ ... పొగిడితే నెత్తి కెక్కి కూర్చుంటారట. అందుకని మీరిప్పుడు పొగడ్డం ఆపేసి వెళ్లి పడుకోండి." నవ్వాపు కుంటూ అంది జానకి. భర్త తననలా పొగడడానికి కారణమేమిటో ఆమెకు బాగా తెలుసు. అయినా ఏమెరగనట్టు నటిస్తోంది.

"పాపం నువ్వొక్కదానివే ఇక్కడ కష్ట పడుతూంటె నేవెళ్లి హాయిగా పడుకోవ డమా? రామ రామ!" అంటూ భార్య వెనకాలే తిరగసాగాడు గోపాలం.

* * *

మళ్ళీ తెల్లవారింది. బాబు ఏడుపు విని గోపాలానికి మెలుకువ వచ్చేసింది. ఒళ్లు మరచి నిద్రిస్తూన్న భార్యను తట్టి లేపుతూ "ఏయ్... జానీ... లేవవే... బాబు ఏడుస్తున్నాడు చూడు! అబ్బబ్బ! ఏం గోలో పాడు. హాయిగా కాస్త నిద్దరయినా పోనీరు..." అంటూ మళ్లా దండకం ప్రారంభించాడు గోపాలం.

జానకి లేచి కూర్చుని బాబును ఒళ్లో పడుకోబెట్టుకుంది. గోపాలం మళ్లీ ముసుగు తన్ని అటు తిరిగి పడుకున్నాడు. బాబుని జోకొడుతూ కూర్చున్న జానకి దృష్టి భర్త వైపుకు మరలింది.

రాత్రి అంత ఆప్యాయంగా మాట్లాడిన మనిషి ఈయనేనా? అనిపించిందామెకు!? బహుశా మగజాతి... ... ...

వారఫలం

—మహేష్

17-10-1975 శుక్రవారం మొదలు 23-10-1975 గురువారం వరకు


మేషం :— చేజిక్కిన అవకాశాలు కూడా జారి పోవచ్చును. వృత్తిలో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభించగలదు. వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు —ఆరోగ్యం బాగుండదు. శుభకార్యాల విషయంలో అభివృద్ధిని సాధిస్తారు.

వృషభం :— వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. రావలసినడబ్బు అందుతుంది. వారం మధ్యలో మీ తాలూకు వస్తువులు పోవచ్చును. ఉద్యోగంలో ఎవరినీ విశేషంగా నమ్మడం తగదు. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. స్త్రీలకు — కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.


మిథునం:— అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. స్త్రీలకు —ఆరోగ్యం బాగుంటుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

కర్కాటకం:— ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. ప్రముఖ జనంగల సంభాషణలను జరుప గలరు. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభించగలదు. స్త్రీలకు—సంతోషకరమైన వార్తలను వింటారు. బంధు మిత్రులను కల్సుకొంటారు.


సింహం :— మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. మిత్రులకు సహాయం చేస్తారు. స్త్రీలకు —ఆరోగ్యం బాగుండదు. నూతన విషయాలను తెల్సుకొంటారు.



మీరు చవిచూసే ప్రతి హనీ బీ బ్రాందీ
గుటకలోనూ ఫ్రాన్సు యొక్క చిన్న భాగం ఉంది



హనీబీ బ్రాందీ చవిచూడండి. ఒక్కసారి
ఫ్రాన్సుకి వెళ్ళిన అనుభవాన్ని పొందండి




హనీ బీ
బ్రాందీ



మార్కెట్ చేయువారు
హెర్బర్ట్‌సన్స్ లిమిటెడ్

dCP/HBB/2e Tel.







వారఫలం

కన్య :— మీ ఆలోచనలు ఫలిస్తాయి. వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు వారంమధ్యలో ఆందోళన కలుగుతుంది. వృత్తిలో యెవరిని విశేషంగా నమ్మడం తగదు. ప్రయాణాల్లో ప్రయాసకు గురికాగలరు. స్త్రీలకు కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధువులకు చికాకులు యేర్పడతాయి.

తుల :— అనవసరమైన సందేహాలు కలుగుతాయి. సాటివారితో వాదప్రతివాదాలు తగవు. వారం మధ్యలో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. ప్రయోజనంగల సంభాషణలను జరుప గలరు. మీ ప్రయత్నాలు సులువుగా నెరవేరతాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి.

వృశ్చికం — మీ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరతాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. ఇతరుల నిమిత్తం శ్రమ పొందవలసి వస్తుంది. వృత్తిలో సాటివారి పోటీ పెరుగుతుంది. దైవ కార్యాలు నెరవేరతాయి. స్త్రీలకు —వినోద కాలాక్షేపాల్లో పాల్గొంటారు. ఆడంబరంకోసం వ్యయం చేస్తారు

ధనుస్సు:— అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది. సాటివారిలో గౌరవం లభిస్తుంది. వారం మధ్యలో వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. మిత్రుల సహాయం లభిస్తుంది. స్త్రీలకు —ఆరోగ్యం బాగుంటుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

మకరం :— మీ వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. ప్రయాణాలోచనలు చేస్తారు. వారం మధ్యలో ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. మీ కార్యక్రమాలు హడావుడిగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్త్రీలకు—సంతోషకరమైన వార్తలను వింటారు బంధు మిత్రులను కలుసుకొంటారు.

కుంభం:— భాగస్వాములతో కలిసివేసే వ్యాపారాలు బాగుంటాయి. రావలసిన డబ్బు అందుతుంది. వృత్తిలో సాటివారి పోటీ తగ్గుతుంది. అధికారుల వలన జరగ వలసిన వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాలలో ఖ్యాతి లభిస్తుంది

మీనం :— మీ కార్యక్రమాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. మీ ఆలోచనలు ప్రయోజనకరంగా ఉంటాయి. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. ●

ఈ మూడు సుగుణాలను ఇవ్వగలిగినది రూబీ డస్ట్ టీ మాత్రమే



1. తక్షణమే డికాక్షన్
2. నిండైన పరిమళం
3. ప్రతి పొట్లానికి ఎక్కువ కప్పుల టీ

చిక్కదనము మరియు పొదుపుతో కూడిన ఒకే ఒక్క టీ లిప్టన్ రూబీ డస్ట్.

లిప్టన్ రూబీ డస్ట్ - నిండైన కమ్మదనము మెండైన సువాసన కలిసి మెలిసే టీ.

లిప్టన్ రూబీ డస్ట్ ప్రతి ఒక్క ప్యాకెట్టుకు అధిక కప్పుల, రుచికరమైన టీని ఇస్తుంది

లిప్టన్ అంటే మంచి టీ
LIPTON

ప్యాకెట్లలోవున్న టీ మాత్రమే తాజాతనము, సువాసన నిలిచివుండును

LRDC-10 TEL 7

చక్రపాణిగారు

(13 వ పేజీ తరువాయి)

ఒక అర్ధశతాబ్దం కాలంలో ఒక రకం వాతావరణంలో పెరిగిన తెలుగువాళ్లకి చక్రపాణిగారు ఒక రకం తెలుగు సంస్కృతికి ప్రతినిధిగా కనిపించటంలో ఆశ్చర్యం లేదు. తమిళనాడు రాజధాని అయిన మదరాసులో ఈ సంస్కృతికి మంచి పోషణ ఉందంటే అతిశయోక్తి కాదు. చక్రపాణిగారు పెద్ద పోషకులలో ఒకరు. ఆయన అస్తమయంతో పుస్తకాలు, పత్రికలు చదివే వాళ్లకీ, సినిమాలు చూసేవాళ్లకీ తీరని లోటు ఏర్పడినట్లు అనిపించి తీరుతుంది. (ఒ. వి.)

భారతావని అంతటా సామూహిక శక్తిపూజ దసరా

(7వ పేజీ తరువాయి)

నికి అగ్నిదేవుడు 'శతఘ్ని'ని ప్రసాదించాడు. పవనుడు ధనుర్బాణాల నొసగినాడు. ఇంద్రుడు వజ్రాన్నిచ్చాడు. యముడు తన కాలదండాన్నే ప్రసాదించాడు. దివ్యమైన గంగాజలంతో నిండిన కమండలాన్ని బ్రహ్మ ఇచ్చాడు. కాలుడు కత్తులూ కటార్లిచ్చాడు. కుబేరుడు మధువుతో నిండిన కాంచనచషకాన్నిచ్చాడు. బ్రహ్మ 'కౌమోదకీ' అనే గదనిచ్చాడు. సూర్యభగవానుడు తన కిరణాల్ని అంకితం చేశాడు.

అప్పుడా దేవి సర్వాభరణ భూషితయై త్రిలోకముగ్ధయై కూర్చొనియున్నది. ఆ దేవిని దేవతాగణమంతా స్తుతించింది. దాంతో ఆ జగన్మాత ప్రత్యక్షమైంది. తమ కోరికల్ని నివేదించారు దేవికి. అబలయైన ఆ దేవి సబలయై మహిషాసురుణ్ని సంహారం చేసింది. అంతటితో దేవతల కష్టాలు గట్టెక్కాయి.

నాటినుండీ నేటివరకూ అవిచ్ఛిన్నంగా నవావరణ విధిని నవరాత్రులు జరుగుతున్నాయి — దేవికి. దుష్ట శక్తుల వినాశానికే ఈ శరన్నవరాత్రుల పూజలు.

సర్వమంగళ మూర్తియైన ఆ దేవిని ఈ నవరాత్రుల సందర్భములో— ఇలా స్తుతిద్దాం!

నమో దేవ్యై మహాదేవ్యై శివాయై సతతంనమః
నమః ప్రకృత్యై భద్రాయై నమతాః ప్రణ
తాః స్మృతాః

—వేదం రామశాస్త్రి.



Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna



"నేను మెచ్చే లక్స్
ఇప్పుడు మైమరపించే
కొత్త సౌరభాన్ని
చిందిస్తోంది!"
అంటున్నారు మంజుల
మిమ్మల్ని ఆహ్లాదపరిచే మృదువైన లక్స్ యొక్క సరికొత్త సౌరభాన్ని మీరు ఎంతో మెచ్చుకుంటారు. ఎందుకంటే, లక్స్ ఎంతో శుద్ధమైనది మరియు మృదువైనది. అది మీ రూపాన్ని కోమలంగా తీర్చిదిద్దుతుంది—అవును. మంజులవలెనే.
LUX
PINK


యువతి లాగే
ఉండాలని
అభిలాషపడే
యువతికే
తయారీదారులు:
రివర్ మిల్స్
భారత దేశంలోని అత్యంత
చీరలు